fb/prajasakti, www.prajasakti.com

ప్రజాశక్తి

సిటీ◆

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajamahendravaram, Srikakulam, ongole and Ananthapuramu

సంపుటి : 38 సంచిక : 62 | విజయవాడ, ఆదివారం 4 మార్చి 2018 | 12 + 12 పేజీలు + స్నేహ వెల : 5.00

మృతి చెందిన మావోయిస్టుల వివరాలు లభ్యం

- అగ్రనేతలెవరూ లేరు
- సిపిఐ మావోయిస్టు తెలంగాణ అధికార ప్రతినిధి జగన్

3



పోలవరంపై చంద్రబాబుకు ఎనిమిది ప్రశ్నలు

- కెవిపి లేఖాస్త్రం

2



అమెరికా తూర్పు తీరాన్ని కుదిపేసిన తుపాను

ఐదుగురు మృతి

కాలిఫోర్నియా మంచు తుపానులో ఒకరు మృతి, ఇద్దరికి గాయాలు

9

త్రిపురలో బిజెపి గెలుపు

నాగాలాండ్, మేఘాలయాలో హంగ్

ప్రభుత్వ ఏర్పాటుకు కాషాయ కూటమి కసరత్తు



త్రిపురలో సిపిఎం కార్యాలయంపై బిజెపి కార్యకర్తలు దాడి చేసి తగుల పెట్టిన అనంతరం మంటలార్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

త్రిపుర

పార్టీ	స్థానాలు
బిజెపి + ఐపిఎఫ్‌టి	43
సిపిఎం	16
కాంగ్రెస్	0
ఇతరులు	0

నాగాలాండ్

పార్టీ	స్థానాలు
బిజెపి + ఎన్‌డిపిపి	27
ఎన్‌పిఎఫ్	27
కాంగ్రెస్	0
ఇతరులు	4

మేఘాలయ

కాంగ్రెస్	21
ఎన్‌పిపి	19
యుడిఎ	6
బిజెపి	2
ఇతరులు	11

ప్రజాశక్తి ప్రతినిధి - అగర్తల, న్యూఢిల్లీ

ఈశాన్య రాష్ట్రాలైన త్రిపుర, నాగాలాండ్, మేఘాలయ అసెంబ్లీ ఎన్నికల్లో మిశ్రమ ఫలితాలువచ్చాయి, త్రిపురలో వేర్పాటువాద ఇండిజీనియస్ పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర (ఐపిఎఫ్‌టి)తో కలిసి పోటీ చేసిన బిజెపి విజయం సాధించింది. 25 ఏళ్ల పాటు పాలనసాగించిన సిపిఎం నేతృత్వంలోని వామపక్ష కూటమి ఈ ఎన్నికల్లో ఓటమి చవిచూసింది. 60 స్థానాలున్న త్రిపురలో 59 స్థానాల్లో ఎన్నికలు జరిగాయి. వీటిలో బిజెపి 35 స్థానాల్లోనూ, దాని మిత్రపక్షమైన ఐపిఎఫ్‌టి 8 స్థానాల్లోనూ విజయం సాధించాయి. సిపిఎం 16 స్థానాల్లో గెలుపొందింది. త్రిపుర ముఖ్యమంత్రిగా బిజెపి త్రిపుర రాష్ట్ర అధ్యక్షుడు విప్లవ్ దేవ్‌ను ప్రకటించే అవకాశముంది.

నాగాలాండ్‌లో బిజెపి ప్రస్తుతం మైత్రిసాగిస్తున్న నాగా పీపుల్స్ ఫ్రంట్ (ఎన్‌పిఎఫ్) ను కాదని కొత్తగా ఏర్పడిన నేషనల్ డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ (ఎన్‌డిపిపి)తో జట్టు కట్టడంతో సందిగ్ధ ఫలితాలు వెల్లడయ్యాయి. 60 స్థానాలకు గాను 58 స్థానాల్లో ఎన్నికలు జరగ్గా అధికార ఎన్‌పిఎఫ్ 27 స్థానాల్లో విజయబావుటా

మిగతా 9లో

శూన్యం నుంచి శిఖరానికి చేరాం : మోడీ

త్రిపురలో విజయం సాధించడం ద్వారా శూన్యం నుంచి శిఖరానికి తాము చేరామని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పేర్కొన్నారు. ఈశాన్య రాష్ట్రాల్లో మంచి ఫలితాలు సాధించడంతో ఢిల్లీలో కొత్తగా నిర్మించుకున్న నూతన ప్రధానకార్యాలయంలో సంబరాల్లో మునిగితేలుతున్న పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. త్రిపురలో బిజెపి గెలుపును అసాధారణ విజయంగా పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో కృషి చేసిన కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజా ఐక్యతకు పోరాటం కొనసాగిస్తాం : సిపిఎం

త్రిపురలో అన్ని తరగతుల కార్మికవర్గ ఐక్యతకు, గిరిజన, గిరిజనేతర ప్రజల ఐక్యతకు ఇక ముందు కూడా పోరాటం కొనసాగిస్తామని సిపిఎం తెలిపింది. త్రిపుర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై ఆ పార్టీ పొలిట్‌బ్యూరో శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. త్రిపుర ప్రజలు ఇచ్చిన తీర్పు బిజెపి - ఐపిఎఫ్‌టి కూటమి ప్రభుత్వ ఏర్పాటుకు వీలుకల్పించిందని పేర్కొంది. 25 ఏళ్ల

మిగతా 9లో

లెక్కలు తేల్చారు

- జెఎఫ్‌సి నివేదిక విడుదల
- 11 అంశాల ప్రస్తావన
- బకాయిలు రూ.74,542 కోట్లుగా అంచనా
- ప్రధానికి నివేదిక అందజేయాలని నిర్ణయం



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రత్యేక హోదా, విభజన హామీల అమలులో ఏర్పడిన గందరగోళాన్ని ఛేదించేందుకు జనసేన అధినేత పవన్ కల్యాణ్ చొరవతో ఏర్పాటైన జాయింట్ ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ (జెఎఫ్‌సి) నివేదిక ప్రజల

మిగతా 9లో

కాంగ్రెస్ బిజెపి దొందూ దొందే

- మార్పు కావాలి
- ప్రయత్నాలు జరుగుతున్నాయి
- థర్డ్ ఫ్రంటో, మరొకటో వస్తుంది
- అందరితో మాట్లాడుతున్నా
- ఎపికి హోదా వాయిదా వేయడం మంచిది కాదు
- తెలంగాణ సిఎం కెసిఆర్



ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

'కాంగ్రెస్ బిజెపి దొందు దొందే... వారు చేసిందేమి లేదు. పథకాల పేర్లు మాత్రమే మారుస్తారు. ఇది కాదు కావాల్సింది. దేశ రాజకీయిల్లో గుణాత్మక మార్పు రావాలి.. క్షేత్రస్థాయిలో

మిగతా 9లో

నేడు చలో గుంటూరు

- దళిత ఆత్మగౌరవ సభకు వేలాదిగా తరలుతున్న ప్రజలు
- పాల్గొంటున్న వామపక్ష, దళిత ప్రజాసంఘాల జాతీయ, రాష్ట్ర నేతలు



సభా ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న శాంతకుమార్, రామారావు, తదితరులు

ప్రజాశక్తి-గుంటూరు

పెదగొట్టిపాడు సహా రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో అగ్రవర్ణాల, పెత్తందార్ల దాడులకు గురైన దళిత బాధితులకు సంఘీభావంగా ఆదివారం గుంటూరులో దళిత ఆత్మగౌరవ సభ నిర్వహించనున్నారు. గుంటూరులోని ఎసి కాలేజీ సమీపంలోని ఉల్ఫ్‌హాల్ గ్రౌండ్‌లో సాయంత్రం 4 గంటలకు బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఈ మేరకు విస్తృత ఏర్పాట్లు చేసినట్లు పెదగొట్టిపాడు దళిత బాధిత సంఘీభావ కమిటీ కన్వీనర్ జి.శాంతకుమార్ పేర్కొన్నారు. రెండు సార్లు సభ అనుమతి కోసం కమిటీ చేసిన దరఖాస్తులను పోలీసు అధికారులు తిరస్కరించిన నేపథ్యంలో హైకోర్టు ఆదేశాలతో సభ నిర్వహిస్తున్నారు. సభకు గుంటూరు, ఇతర జిల్లాల నుంచి వేలాదిగా ప్రజలు తరలి రానున్నారని నాయకులు తెలిపారు. పెదగొట్టిపాడు దళిత బాధిత పోరాట సంఘీభావ కమిటీ, వామపక్షాలు, ఇతర ప్రజా సంఘాలు చలో గుంటూరు విజయవంతానికి నెల రోజులుగా జిల్లాలో విస్తృత ప్రచారం నిర్వహించాయి. రాష్ట్రంలో దళితులపై దాడులు, ప్రభుత్వ విధానాలను ప్రజలకు వివరించారు. సభకు దళిత్ సోషన్ ముక్తి మంచ్ జాతీయ కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సిపిఎం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శులు పి.మధు, కె.రామకృష్ణ, పలు వామపక్ష పార్టీల, దళిత, ప్రజాసంఘాల జాతీయ, రాష్ట్ర,

మిగతా 9లో

నేడు మన్యం బంద్

ప్రజాశక్తి-పెదబయలు (విశాఖపట్నం)

బోయ వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చొద్దని, విభజన చట్టం హామీలను నెరవేర్చాలని కోరుతూ ఈ నెల 4న చేపట్టే రాష్ట్రవ్యాప్త మన్యం బంద్‌ను

మిగతా 9లో



విశాఖ జిల్లా పెదబయలు జీపుజాతాలో మాట్లాడుతున్న గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు బొండా సన్నిబాబు

పొలిటికల్ బడ్జెట్

- ప్రచారంపైనే ప్రభుత్వం దృష్టి
- సమావేశాలకు హాజరుకాలేం : వైసిపి
- అసెంబ్లీలో చెప్పాల్సింది చెబుతాం : బిజెపి
- రేపటి నుండి ఎపి బడ్జెట్ సమావేశాలు

ఈ ప్రభుత్వానికి ఇదే పూర్తిస్థాయి బడ్జెట్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎన్నికల ఏడాది కావడంతో సోమవారం నుండి ప్రారంభమయ్యే బడ్జెట్‌పై సమావేశాలపై సర్వత్రా చర్చ మొదలైంది. ఈనెల 5న సమావేశాలు ప్రారంభమవుతాయి. 8న బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. ఈ ప్రభుత్వానికి ఐదేళ్లకాలానికి సంబంధించి ఇదే ఆఖరిది కావడం, ఎన్నికలు కూడా వస్తుండడంతో అన్ని పక్షాలూ ఈ సమావేశాల్ని ప్రతిష్టాత్మకంగా తీసుకోనున్నాయి. అధికార టిడిపి మాత్రం క్షేత్రస్థాయిలోకి వెళ్లేందుకు వీలుగా సంక్షేమం, ఇరిగేషన్, పంచాయతీరాజ్ వంటివాటికి అధిక నిధులు కేటాయించే దిశగా ప్రణాళిక సిద్ధం చేస్తోంది. ఈ సమావేశాలకు కూడా హాజరుకావడంలేదని ప్రధాన ప్రతిపక్షం వైసిపి తేల్చిచెప్పింది. మూడు రాజ్యసభ సీట్లలో అధికార టిడిపి మూడో వ్యక్తిని నిలబెట్టకపోతే ఏకగ్రీవం అవుతుందని, ఎన్నికలు నిర్వహించాల్సి వస్తే ఆ రోజు ఎమ్మెల్యేలు అసెంబ్లీకి

మిగతా 9లో

వాణిజ్య యుద్ధానికి దారి

- ట్రంప్ నిర్ణయంపై అంతర్జాతీయ సంస్థలు
- స్టీల్‌పై భారీ ఎగుమతి సుంకంతో నష్టం
- అమెరికాకు మంచిది కాదు
- డబ్ల్యుటిఒ, ఐఎంఎఫ్‌ల ఆందోళన

6

ఎస్సీ, ఎస్టీ, బిసి అభ్యర్థులకు ఉచిత డిఎస్సీ శిక్షణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విజయవాడ అంబేద్కర్ స్టడీ సర్కిల్‌లో ఎస్సీ, ఎస్టీ, బిసి అభ్యర్థులకు ఉచిత డిఎస్సీ శిక్షణ ఇవ్వనున్నట్టు సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ పిఎస్ఎ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు మార్చి 14లోగా దరఖాస్తులు పంపాలని కోరారు. తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాలకు చెందిన 47 ఏళ్ల లోపు ఎస్సీ, ఎస్టీ, బిసి అభ్యర్థులు ఈ శిక్షణకు అర్హులు. ఇంటర్‌తో పాటు టిటిసి పూర్తి చేసి, టెట్‌లో అర్హత సాధించిన వారు దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. ఇతర వివరాలకుగాను 0866 2574388కు కానీ, krishna.ap.nic.in వెబ్‌సైట్‌ను కానీ సంప్రదించాలని సూచించారు.

సాధించుకుందాం



విజయనగరం కలెక్టరేట్ వద్ద శనివారం మాట్లాడుతున్న ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి అజశర్మ

పోరాడి సాధించుకుందాం

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన చట్టంలోని అంశాలు సాధించుకోవడం మన హక్కు అని, అవి అడిగితే రావని, పోరాడి సాధించుకుందామని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ పిలుపునిచ్చారు. విభజన చట్టంలోని అంశాలను అమలు చేయాలని కోరుతూ ఉత్తరాంధ్ర అభివృద్ధి పేరిట చేపట్టిన జాతా శనివారం ఉదయం శ్రీకాకుళం నుంచి విజయనగరం జిల్లాలోకి ప్రవేశించింది. చీపురుపల్లి, విజయనగరంలో జాతాకు ఉద్యోగులు, ప్రజాసంఘాల నాయకులు స్వాగతం పలికారు. అనంతరం గరివిడి, నెల్లిమర్ల, విజయనగరం, గజపతినగరం, సాలూరు మండలాల్లో జాతా సాగింది. ఈ సందర్భంగా అజశర్మ మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు హోదా విషయంలో రాష్ట్రానికి మోసం చేశాయన్నారు. మోడీని ప్రత్యేక హోదా విషయంలో గట్టిగా అడగలేని దౌర్భాగ్యస్థితిలో చంద్రబాబునాయుడు ఉన్నారన్నారు. విభజన సమయంలో చట్టంలో చేసిన రైల్వేజోన్, కడప స్టీల్‌ప్లాంట్, గిరిజన విశ్వవిద్యాలయం, ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ వంటి హామీలను అమలు చేయకపోవడం సరికాదన్నారు. ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని చెప్పి ఏడాదికి కేంద్రం ఇచ్చిన రూ.50 కోట్లను ఎంపిడిఒ కార్యాలయాల్లో ఫర్నీచర్ కొనుగోలుకు వినియోగించారన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి జరగాలంటే రూ.24 వేల కోట్లు అవసరమని, కేంద్రం ఆ నిధులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఉత్తరాంధ్రలో ప్రాజెక్టులు పూర్తి చేయడం ద్వారా, కొత్త పరిశ్రమల ఏర్పాటు, వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. విజయనగరంలో ఎయు రిటైర్డ్ ప్రొఫెసర్ రామకృష్ణారావు, ఎపి ఎన్‌జిఒ జిల్లా అధ్యక్షులు ప్రభూజి, కె.శేషగిరి, రామరాజు, శ్రీనివాసరావు, రెడ్డి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.



మండుతున్న ఎండలు

ప్రజాశక్తి-విశాఖపట్నం ప్రతినిధి

రాష్ట్రంలో ఎండలు మండుతున్నాయి. శనివారం అత్యధికంగా రాయలసీమలోని కర్నూలులో 39, తిరుపతిలో 37 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నెల్లూరు, కావలి, గన్నవరంలోనూ 37 డిగ్రీలు, కాకినాడ, మచిలీపట్నం, నర్సాపురంలో 35 డిగ్రీలు చొప్పున నమోదయ్యాయి. మరో నాలుగు రోజులపాటు ఇదే పరిస్థితి కొనసాగుతుందని హైదరాబాద్ వాతావరణ శాఖ పేర్కొంది. ఆకాశం నిర్మలంగా ఉండటం, పశ్చిమ ఆటంకాలు కూడా తొలగిపోడంతో దేశవ్యాప్తంగా ఎండలు విజృంభిస్తున్నాయని వాతావరణ శాఖ నిపుణులు చెబుతున్నారు.

ప్రజ్ఞ

సమాధానాలు 7లో

1. 3వ అంతర్జాతీయ యోగా ఉత్సవాలు ఎక్కడ ప్రారంభమయ్యాయి?
2. దేశంలో మొట్టమొదటి ఏవియేషన్ మల్టీ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఎక్కడ ప్రారంభమైంది?
3. ప్రపంచంలోనే అతిపెద్ద సోలార్ పార్కు(శక్తి స్థల్) ఏ రాష్ట్రంలో ఏర్పాటుచేశారు?
4. తెలుగు రాష్ట్రాల్లో మొట్టమొదటి టింకరింగ్ ల్యాబ్‌ను ఎక్కడ ప్రారంభించారు?
5. ప్రపంచవ్యాప్తంగా జీరో డిస్క్రిమినేషన్ డేను ఎప్పుడు నిర్వహించారు?

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది. 94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి దినపత్రిక, ఎంబి విజ్ఞానకేంద్రం, డోర్.నెం.27-30-4, గవర్నరుపేట, విజయవాడ-520002కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

వైసిపి రాజ్యసభ అభ్యర్థిగా ప్రభాకర్‌రెడ్డి

అధికార పార్టీ ఆకర్షణలకు లొంగవద్దని ఎమ్మెల్యేలకు జగన్ సూచన



రాజ్యసభ అభ్యర్థిగా ప్రభాకర్‌రెడ్డిని పరిచయం చేస్తున్న జగన్

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్ (ప్రకాశం)

వైసిపి రాజ్యసభ అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ఆ పార్టీ అధ్యక్షులు జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారు. ప్రజా సంకల్పయాత్రలో భాగంగా ప్రకాశం జిల్లా తాళ్లూరు మండలం శివరాంపురం వద్ద లంచ్‌క్యాంప్‌లో జగన్ తన పార్టీకి చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నేతలతో శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని వారికి పరిచయం చేశారు. ఏకగ్రీవం కాకుండా ఓటింగ్ జరిగితే అంతా కలిసికట్టుగా ఉండి వేమిరెడ్డిని గెలిపించాలని కోరారు. రాజ్యసభ ఎన్నికలు నిక్కచ్చిగా జరిగితే ఒకటి వైసిపికి, రెండు టిడిపికి వస్తాయన్నారు. ఈ లెక్క కాకుండా చంద్రబాబు ఏదైనా డ్రామా ఆడటానికి అవకాశం ఉందని, అధికార పార్టీ ప్రలోభాలకు ఎవరూ లొంగవద్దని సూచించారు. 23 మంది ఎమ్మెల్యేలు పార్టీ వీడి పక్కకు పోయినా, 44 మంది ఎమ్మెల్యేలు తన వెంటే ఉన్నారని, వారందరికీ తాను హ్యాట్సాఫ్ చెబుతున్నానని పేర్కొన్నారు.

ఢిల్లీలో ధర్నాకు వెళ్లే వాహనాలను ప్రారంభించిన జగన్

ప్రత్యేక హోదా కోసం జరిగే పోరాటం ఉధృతం చేయాలని, ఢిల్లీ నుంచి గల్లీ దాకా ఒకే నినాదం ఇవ్వాలని జగన్ చెప్పారు. 5న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగే ధర్నాలో పాల్గొనేందుకు బయలుదేరిన వాహన శ్రేణిని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 21న ఎన్‌డిఎ ప్రభుత్వంపై అవిశ్వాసం పెట్టాలని ఎంపీలకు సూచించారు. అవిశ్వా సానికి అవసరమైన 25 మంది ఎంపీల మద్దతును చంద్ర బాబు పార్టనర్ పవన్‌కళ్యాణ్ కూడగట్టాలని కోరారు. అవిశ్వాసానికి కేంద్రం దిగిరాని పక్షంలో ఏప్రిల్ 6న పార్లమెంటులో రాజీనామాలు చేసి బయటకు రావాలని సూచించారు.

ఎసిబి వలలో ముగ్గురు అక్రమార్కులు

- సుమారు రూ. 80 కోట్లు విలువైన అక్రమాస్తులు స్వాధీనం
- నిందితుల అరెస్ట్, 14 రోజుల రిమాండ్



సోదాలు నిర్వహిస్తున్న ఎసిబి అధికారులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో/ విశాఖపట్నం

విశాఖ జిల్లాలో అవినీతి నిరోధక శాఖ (ఎసిబి) అధికారులు శనివారం వరుస దాడులు నిర్వహించారు. రెవెన్యూ విభాగానికి చెందిన ఇద్దరు విఆర్‌ఒలతో పాటు గ్రేటర్ విశాఖ మున్సిపాలిటీలోని ఒక చైన్‌మెన్‌ల ఇళ్లపై ఏకకాలంలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో రూ.కోట్ల అక్రమాస్తులను గుర్తించారు. ఆదాయానికి మించిన ఆస్తులు బయటపడటంతో నిందితులను అరెస్ట్ చేసి విశాఖపట్నం ఎసిబి కోర్టులో హాజరుపరుచగా, కోర్టు 14 రోజులు రిమాండ్ విధించింది. ఒకేసారి ముగ్గురు ప్రభుత్వ ఉద్యోగులపై దాడులు చేయడం జిల్లాలో సంచలనంగా మారింది. వీరి నుంచి స్వాధీనం చేసుకున్న ఆస్తులు విలువ ప్రభుత్వ లెక్కల ప్రకారమే రూ.6.19 కోట్లుగా ఎసిబి అధికారులు లెక్కగట్టారు. బహిరంగ మార్కెట్లో వీటి విలువ సుమారు రూ.80 కోట్లుకుపైగానే ఉంటుందని అంచనా వేస్తున్నారు.

మల్కాపురం విఆర్‌ఒ...

విశాఖ జిల్లా మల్కాపురం విఆర్‌ఒ సంజీవ్‌కుమార్‌తో పాటు అతని స్నేహితులు, బంధువులకు చెందిన 13 ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. సంజీవ్‌కుమార్ పేరుతో అనకాపల్లిలో రెండంతస్తుల భవనం, భార్య రమ్య పేరుతో మూడంతస్తుల భవనం, గాజువాకలో మరో భవనం ఉంది. కుమారుడు దినేష్‌కుమార్ పేరుతో అనకాపల్లి, నర్సీపట్నం, యలమంచిలిలో మెడికల్ సెంటర్లు, గాజువాక ఆటోనగర్‌లో బ్రిక్స్ ఇండస్ట్రీని గుర్తించారు. సంజీవ్‌కుమార్ స్నేహితుడు దాసరి దానియేల్ పేరుతో విశాఖలో 3757 చదరపు గజాలతో పాటు సుమారు ఎనిమిది కోట్ల రూపాయిలు విలువైన 1.60 ఎకరాల భూమి, రెండు కోట్లు విలువైన 3.31 ఎకరాల స్థలం దస్తావేజులు స్వాధీనం చేసుకున్నారు. సన్నిహితులు ఉమాశంకర్ పేరుతో రూ.15 లక్షలు విలువైన స్థలం, శ్రీనివాస్ పేరుతో 1.08 ఎకరాల స్థలం, బైశెట్టి గణేష్ పేరుతో కోటి రూపాయిల విలువైన 13,897 గజాలు, శ్రీరామకృష్ణ పేరుతో రూ.18 లక్షల విలువైన రెండు స్థలాలు ఉన్నాయి. భీమారావు పేరు మీద రూ.66 లక్షల విలువైన స్థలం దస్తావేజులు, రమేష్‌కుమార్ పేరుతో ఉన్న 1.25 ఎకరాల భూ పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. మరో మిత్రులు చౌదరి పేరుతో ఉన్న కొన్ని ఆస్తులను కనుగొన్నారు. వీటితో పాటు రూ.18.33లక్షల విలువైన 733 గ్రాములు బంగారు ఆభరణాలు, ఆరు లక్షల విలువైన గృహోపకరణాలు, రూ.6,440 నగదు, రూ.1.23లక్షల ఫిక్సిడ్ డిపాజిట్ బాండ్లును ఎసిబి స్వాధీనం చేసుకుంది. స్వాధీనం చేసుకున్న ఆస్తుల మొత్తం కార్డు విలువ రూ.3.77 కోట్లుగా నిర్ధారించారు.

మద్దిపాలెం విఆర్‌ఒ

విశాఖ అర్బన్ మద్దిపాలెం విఆర్‌ఓ వెంకటేశ్వరరావుతో పాటు అతని కుటుంబ సభ్యులకు చెందిన నాలుగు ప్రాంతాల్లో ఏకకాలంలో ఎసిబి తనిఖీలు నిర్వహిం చింది. గాజువాక, సీతమ్మధార, గోపాల పురం, దర్లమూడి, పెదబొడ్డేపల్లిలోని స్నేహితుల ఇళ్లలోనూ అధికారులు సోదాలు చేశారు. గాజువాకలో 290 గజాల స్థలం, రెండంతస్తుల భవనం, రూ.4.75 లక్షల విలువైన బంగారు ఆభర ణాలు, నాలుగు లక్షల రూపాయిల గృహోప కరణాలు కనుగొ న్నారు. విశాఖపట్నం ఎన్ఎడి వద్ద ఉన్న యాక్సిస్‌బ్యాంక్‌లో లాకర్లు ఉన్నట్లు కనుగొన్నారు. లాకర్లలో మరింత విలువైన ఆస్తులు ఉండే అవకాశం ఉన్నట్లు అధికారులు భావిస్తున్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం స్వాధీనం చేసుకు న్న ఆస్తుల విలువ సుమారు రూ.1.11 కోట్లుగా లెక్కించారు.

గ్రేటర్ విశాఖ చైన్‌మెన్..

గ్రేటర్ విశాఖ మున్సిపాలిటీ జోన్ 3లో చైన్‌మన్‌గా విధులు నిర్వహిస్తోన్న నాగేశ్వరావు నివాసంతో పాటు అతని సన్నిహితుల ఇళ్లపైనా ఎసిబి అధికారులు దాడులు నిర్వహించారు. నాగేశ్వరావు పేరుతో విశాఖ హౌసింగ్ బోర్డు కాలనీలో రెండంతస్తుల భవనం, పెంట్‌హౌస్, భార్య సూర్యప్రభ పేరుతో రెండు ఇళ్ల స్థలాలను గుర్తించారు. కుమారుడు శంకర్ పేరు మీద మూడంతస్తుల భవనం ఉంది. పదకొండు లక్షల విలువైన బంగారు ఆభరణాలు, రూ.40వేలు విలువైన వెండి వస్తువులు, రూ.5లక్షల ఫిక్సిడ్ డిపాజిట్లు, మూడు లక్షల విలువైన గృహోపకరణాలు, రూ.41లక్షల డిపాజిట్ ఉన్న బ్యాంక్ పాస్‌పుస్తకాలు, రూ.1.21లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న ఆస్తుల విలువ ప్రభుత్వ లెక్కల ప్రకారం రూ.1.31కోట్లుగా గుర్తించారు.

టిడిపితోనే రాయల'జల'సీమ

మంత్రి దేవినేని

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పోలవరం ప్రాజెక్టుకు రూ.2,950 కోట్లు కేంద్రం నుంచి రావాల్సి ఉందని జలవనరులశాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. ఇప్పటి వరకు 7.5 కోట్ల క్యూబిక్ మీటర్ల కొండ రాయి, మట్టిని తొలగించామన్నారు. టిడిపితోనే రాయలసీమ జలసీమగా మారుతుందన్నారు. ప్రముఖ ఇంజనీర్ కె.రామకృష్ణయ్య జయంతి వేడుకను విజయవాడ జలవనరులశాఖ రాష్ట్ర కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రామకృష్ణయ్య జయంతిని ఇరిగేషన్ దినోత్సవంగా జరపడం ఆనందంగా ఉందన్నారు. రాయలసీమలోని తెలుగుగంగ, హంద్రీనీవా, గాలేరు-నగరి తదితర ముఖ్యమైన ప్రాజెక్టులు కట్టడంలో ముందుచూపుతో ఆయన వ్యవహరించారన్నారు. జలవనరుల రంగానికి ఆయన చేసిన సేవల్ని నేటి యువ ఇంజనీర్లు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. పోలవరం ప్రాజెక్టును సకాలంలో పూర్తి చేసి రైతులకు మేలు చేస్తామన్నారు.

సమావేశాలకు వైసిపిని ఆహ్వానిస్తున్నాం

స్పీకర్ కోడెల శివప్రసాద్ రావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సోమవారం నుంచి మార్చి నెలాఖరు వరకు అసెంబ్లీ సమవేశాలు జరుగుతాయని, ఈ సమావేశాలకు ప్రతిపక్ష వైసిపి సభ్యుల్ని ఆహ్వానిస్తున్నామని అసెంబ్లీ స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాద్ రావు తెలిపారు. సమావేశాలకు రావాల్సిందిగా కొంత మంది వైసిపి ముఖ్య నేతలతో ఇప్పటికే మాట్లాడామన్నారు. శనివారం ఆయన అసెంబ్లీలోని ఆయన ఛాంబర్‌లో మాట్లాడుతూ ప్రజా సమస్యల ప్రస్తావనకు, వాటి పరిష్కారానికి అసెంబ్లీనే ఉన్నతమైన వేదిక అని, ఈ సదవకాశాన్ని ప్రతిపక్షం ఉపయోగించుకోవాలని సూచించారు. అసెంబ్లీ వేదికగా మాట్లాడే అంశాలకు, ప్రస్తావించే విషయాలకు ఎక్కువ విలువ ఉంటుందన్నారు. ఉభయ సభలనుద్దేశించి సోమవారం ఉదయం 9 గంటలకు గవర్నర్ ప్రసంగిస్తారని స్పీకర్ వెల్లడించారు.

ఏప్రిల్ 9 నుంచి సమ్మేటీవ్-2

తేలని ప్రశ్నాపత్రాల ముద్రణ ?

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పాఠశాల విద్యార్థులకు సమ్మేటీవ్-2 పరీక్షల షెడ్యూల్ ఖరారయ్యింది. 6 నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు సమ్మేటీవ్-2 పరీక్షల్ని ఏప్రిల్ 9 నుంచి 21 వరకు నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. అయితే ఈ ప్రశ్నాపత్రాల ముద్రణా బాధ్యతల్ని ఎవరికి అప్పగించాలన్న అంశం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఈ పరీక్షలకు సంబంధించిన ప్రశ్నాపత్రాల రూప కల్పన తుదిదశకు చేరుకుంది. ఈ నేపథ్యంలో ఈ సారి ముద్రణ బాధ్యతలు ఎవరికి అప్పగించాలనే దానిపై స్పష్టత లేకపోవడంతో ఈ ప్రక్రియ ముందుకు కదలడం లేదు. రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ మండలి(ఎస్‌సిఈఆర్‌టి) గతంలో ప్రశ్నాపత్రాల్ని సిద్ధం చేసి ప్రతి జిల్లా ఉమ్మడి పరీక్ష(డిసిబి)ల మండలికి అందజేసేది. గతంలో సమ్మెటివ్-1 ప్రశ్నాపత్రాల లీకేజీ కారణంగా ముద్రణా బాధ్యతల్ని ప్రభుత్వ పరీక్షల విభాగానికి అప్పగించింది. అయితే పరీక్షల విభాగానికి ఇవ్వడం వల్ల ఎక్కువ ఖర్చయ్యిందని అధికారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సమ్మెటీవ్-1 పరీక్షల్ని ప్రభుత్వ పరీక్షల విభాగానికి అప్పగించడం వల్ల రూ.20కోట్లు ఖర్చయ్యిందని అంచనా. పరీక్షల విభాగం ముద్రణ, సరఫరాలో కూడా పరీక్షల విభాగం ఆలస్యం చేసింది. సమ్మెటీవ్-1 పరీక్షల సమయంలో ఉత్తరాంధ్ర జిల్లాలకు విమానంలో ప్రశ్నాపత్రాల్ని పంపిం చింది. ఈసారి కూడా ప్రశ్నాపత్రాల ముద్రణ తమకే అప్పగించాలని పరీక్షల విభాగం కోరుతుండగా, తాము తక్కువ ఖర్చులోనే ముద్రణ, సరఫరా పూర్తిచే స్తామని డిసిఈబిలు పేర్కొంటున్నాయి. 8,9 తరగతుల ప్రశ్నాపత్రాల ముద్రణకు పరీక్షల విభాగం ఎక్కువ వ్యయం చేసిన నేపథ్యంలో తమకు అప్పగిస్తే తక్కువ ఖర్చులోనే పూర్తి చేస్తామని పేర్కొంటూ అంచనాల్ని సమర్పించేందుకు కొన్ని డీసీఈబీలు సన్నద్ధమవుతున్నాయి. గతంలో నిర్వహించిన పరీక్షలకు సంబంధించి రూ.25కోట్లు వరకు ఇంకా బకాయిలు చెల్లించాల్సి ఉంది.

ఏపికి ప్రత్యేక హోదా ఇవ్వాలి

జెఎసి ఆందోళన

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని నాన్ పొలిటికల్ జెఎసి అధ్యక్షుడు అప్పికట్ల శ్రీహరినాయుడు డిమాండ్ చేశారు. విభజన హామీలు పూర్తి స్థాయిల్లో అమలు చేసే వరకు పోరాడుతామని ఆయన అన్నారు. శనివారం నాడిక్కడ స్థానిక ఏపి భవన్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద ఏపి నాన్ పొలిటికల్ జెఎసి, ప్రత్యేక హోదా జెఎసి, నవ్యాంధ్ర విద్యార్థి జెఎసి, ఏపి నిరుద్యోగ పోరాట సమితి ఆందోళన చేపట్టాయి. ఈ సందర్భంగా శ్రీహరినాయుడు మాట్లాడుతూ రాష్ట్ర పునర్విభజన చట్టంలో పేర్కొన్న అంశాలు, పార్లమెంట్ సాక్షిగా ఏపికిచ్చిన ప్రత్యేక హోదా హామీని అమలు చేయాలని, వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో విద్యా, వైద్య జాతీయ సంస్థలను నెలకొల్పాలని, పోలవరం ప్రాజెక్టు, రాజధాని నిర్మాణం నిధులు విడుదల చేయాలని, విశాఖ రైల్వే జోన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక హోదా ద్వారానే నిరుద్యోగ సమస్యకు పరిష్కారం దొరుకుతుందని అన్నారు. ఏపి ప్రత్యేక హోదా జెఎసి, ఢిల్లీ ప్రధాన కార్యదర్శి మెండు చక్రపాణి మాట్లాడుతూ ఏపికిచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండు చేశారు. విభజనతో నష్టపోయిన ఏపిని ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక హోదా సాధన సమితి కన్వీనర్ లింగరాజు, కో కన్వీనర్ బాల కోటేశ్వరరావు, గల్లా సతీష్, నవ్యాంధ్ర విద్యార్థి జెఎసి రాష్ట్ర అధ్యక్షుడు ఎ.అయ్యస్వామి, ఏపి నిరుద్యోగ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు కోటిరెడ్డి, నాయకులు కోటేశ్వరరావు, చినకాకాని మాజీ సర్పంచి ఏటుకూరి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

పోలవరంపై చంద్రబాబుకు ఎనిమిది ప్రశ్నలు

కెవిపి లేఖాస్త్రం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పోలవరంపై రాష్ట్ర ప్రభుత్వాన్ని కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు కెవిపి రామచంద్రరావు మరోసారి ప్రశ్నించారు. ఈ మేరకు శనివారం ఎనిమిది ప్రశ్నలతో కూడిన బహిరంగ లేఖను ముఖ్యమంత్రి చంద్రబాబుకు రాశారు. "2015 మార్చిలో పిపిఎ అధికారులు పోలవరం అంచనాలను ప్రస్తుత ధరలకు సవరించి ఇవ్వాలని కోరగా, ఒక నెలలో ఇస్తామని చెప్పిన మీరు 2016 సెప్టెంబర్‌లో కేంద్రం ప్యాకేజి ప్రకటించే నాటికి కూడా ఇవ్వకుండా ఎందుకు నాటకాలు ఆడారు? పిపిఎ అధికారులు 2014 మార్చి 31కి ముందు ప్రాజెక్ట్‌పై చేసిన ఖర్చును రాష్ట్ర వాటాగా భావిస్తామని, అదేవిధంగా.2014 ఏప్రిల్ 1 తరువాత ప్రాజెక్ట్‌పై అయ్యే ఖర్చులో ప్రతి పైసా కేంద్రమే భరిస్తుందని పదేపదే స్పష్టం చేసింది. అయినా ఎందుకు ప్రతి సమావేశంలో పాత ఖర్చులు, ఇతర జాతీయ ప్రాజెక్టులకు వలే 90శాతం నిధులివ్వాలని డిమాండ్ చేశారు? జీవో నెంబర్ 22 జారీ చేసిన తరువాత, అదనంగా లేబర్, యంత్రాలు, ఇతర మెటీరియల్ ధరల తేడాలు ప్రభుత్వమే భరిస్తే..కాంట్రాక్టర్లకు నష్టం వచ్చే అవకాశం ఎక్కడున్నది? కేంద్రమిచ్చిన ప్యాకేజీలో.2014 ఏప్రిల్ 1 నాటి ధరల ప్రకారమే నిధులు ఇస్తామనే షరతుకు మీరెందుకు అంగీకరించారు? 2018 జనవరి 11న జరిగిన పిపిఎ ఏడో సమావేశంలో అధికారులు పునరావాస కార్యక్రమాలకు పెద్ద మొత్తంలో కావలసిన నిధులు ఎలా సమకూర్చుకొంటారని అడిగినప్పుడు, కేంద్రమే ఇవ్వాలని తేల్చి చెప్పకుండా, పునరావాసం ఫేజ్‌ల వారీగా చేస్తామని ఎందుకు చెప్పారు? ఏప్రిల్‌లో నిపుణుల కమిటీకి ప్రాజెక్ట్ అంచనాలు రూ.46,926 కోట్లుగా చెప్పిన మీరు, ఆగష్టు నాటికి అంచనాలను రూ.58,319 కోట్లకు ఎలా పెంచారు? పోలవరం హెడ్‌వర్క్స్‌లో మిగిలిన పనికి 2015-16 అంచనాల ప్రకారం రూ.5,535 కోట్లు ఖర్చుగా పేర్కొంటూ 2016 సెప్టెంబర్ 8న జీవో 96 జారీ చేసిన మీరు, అదే హెడ్‌వర్క్స్ మిగిలిన పనికి 2013-14 అంచనాల ప్రకారం రూ.11,638 కోట్లు ఖర్చుగా పేర్కొంటూ కేంద్రానికి ఎలా పంపారు? పోలవరం పూర్తి ఖర్చును విభజన చట్టం ప్రకారం కేంద్రమే భరించాలని మీరు ఇప్పటికీ అనుకొన్నట్లైతే..అదే విషయాన్ని హైకోర్టులో తాను వేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యంలో కౌంటర్ ద్వారా తెలియపరిచేందుకు ఎందుకు భయపడుతున్నారు?" అంటూ చంద్రబాబును కెవిపి ప్రశ్నించారు.

బాలయోగికి చంద్రబాబు నివాళి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

లోక్‌సభ మాజీ స్పీకర్ జిఎంసి బాలయోగి 16వ వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం నివాళులర్పించారు. కోనసీమ అభివృద్ధిలో బాలయోగి ప్రధానపాత్ర పోషించారని సిఎంపేర్కొన్నారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటన్నారు.

నేటి నుంచి విట్‌లో నేషనల్ ఫెస్ట్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వెల్లూరు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎపి విట్)లో ఈ నెల 4, 5 తేదీల్లో నేషనల్ టెక్నికల్ ఫెస్ట్ నిర్వహించనున్నట్లు విట్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ శేఖర్ విశ్వనాధన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫెస్ట్‌లో బిగ్ డేటా ఎనలటిక్స్, రోబోటిక్స్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఇఒటి, టెక్నికల్ క్విజ్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి అజయ్‌జైన్, షిండేర్ ఎలక్ట్రిక్ వైస్ ప్రెసిడెంట్ అరిందం సేన్, కాగ్నిజెంట్ టెక్నాలజీ వైస్ ప్రెసిడెంట్ రాజీవ్ మీనన్ పాల్గొననున్నారని తెలిపారు.

ఉత్తమ శిక్షణా కేంద్రాలుగా ఏపి స్టడీ సర్కిళ్లు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని ఏపి స్టడీ సర్కిళ్లను ఉత్తమ శిక్షణా కేంద్రాలుగా తీర్చి దిద్దుతామని సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి నక్కా ఆనంద్ బాబు అన్నారు. ఈ మేరకు ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులకు ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్టు తెలిపారు. శనివారం ఆయన విజయవాడలోని అంబేద్కర్ స్టడీ సర్కిల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతేడాది నిర్వహించిన గ్రూప్-2 పరీక్షలో ఈ స్టడీ సర్కిల్ నుంచి నలుగురు అభ్యర్థులు డిప్యూటీ తాహశిల్దారులుగా ఎంపికయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా విజేతలకు ఫోన్‌లో అభినందనలు తెలిపారు. ఉత్తమ శిక్షణ ఇచ్చి, విజయానికి దోహద పడిన స్టడీ సర్కిల్ సిబ్బందిని మంత్రి అభినందించారు. శిక్షణకు హాజరయ్యే అభ్యర్థులకు నాణ్యమైన మెటీరియల్‌ను అందుబాటులోకి తీసుకొని రావాలని సూచించారు. అభ్యర్థులకు వేర్వేరుగా వసతి సౌకర్యాన్ని కల్పించాలని, దీనికి సంబంధించిన ప్రతిపాదనల్ని రూపొందించాలని ఆదేశించారు.

విద్యుత్ కార్మికుల ఆందోళనల్లో ప్రత్యక్షంగా పాల్గొంటాం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు చేపడుతున్న ఆందోళనల్లో ప్రత్యక్షంగా పాల్గొనాలని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాల సంయుక్త సమావేశం తీర్మానించింది. విజయవాడలోని ఎన్జీఓ హోమ్‌లో శనివారం సాయంత్రం నిర్వహించిన ఈ సంయుక్త సమావేశానికి సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఎ గఫూర్, ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు రామారావులు అధ్యక్షతన వహిం చారు. 4న జరిగే నిరవధిక నిరాహార దీక్షలు, 5న కలెక్టరేట్‌ల వద్ద నిరసన, 7న 'చలో విద్యుత్ సౌధ' కార్యక్రమాల్లో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజా సంఘాలు పాల్గొనాలని నిర్ణయించారు. ఈ అంశంపై ముఖ్యమంత్రికి అన్ని సంఘాలూ సంయుక్తంగా లేఖ రాయాలని, కార్మికుల న్యాయమైన డిమాండ్‌లు, ప్రభుత్వ మొండి వైఖరిపై కరపత్రాలు ముద్రించి ప్రజలకు పంపిణీ చేయాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఎ గఫూర్ మాట్లాడుతూ కార్మికుల సమస్యలు పట్టని అరాచక ప్రభుత్వం అధికా రంలో కొనసాగుతోందన్నారు. విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమస్యల్ని ఆ శాఖ మంత్రికి, కార్మిక శాఖ మంత్రి దృష్టికి తీసుకువెళ్లినా పరిష్కారానికి చొరవ తీసుకోలేదన్నారు.

కార్మికులతో మాకు సంబంధం లేదని సిఎం చంద్రబాబు అనడం ఆయన నియంతృత్వానికి నిదర్శమన్నారు. సమ్మె చేపట్టి రెండు వారాలు పూర్తవుతున్నందున అన్ని కార్మిక, ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజాసంఘాలు ప్రత్యేక్ష ఆందోళనలో భాగస్వాములై ఉద్యమాన్ని ఉధృతం చేయాలన్నారు. ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు రామారావు మాట్లాడుతూ విద్యుత్ కార్మికుల ఐక్య వేదిక చేపట్టిన ఆందోళనలకు ఎఐటియుసి, అనుబంధ సంఘాలు ఆందోళల్లో పాల్గొంటా యన్నారు. ఎపి ఎన్జీఓ నేత విద్యాసాగర్ మాట్లా డుతూ విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల పట్ల ప్రభుత్వ వైఖరి మారాలన్నారు. కార్మికులకు నేరుగా జీతాలు చెల్లించడంలో ఇబ్బందేంటని ప్రశ్నించారు. ప్రభుత్వంలో మానవత్వం లోపించిందన్నారు.

శతృఘ్నసిన్హాకు జీవిత సాఫల్య పురస్కారం

అందజేసిన బ్రిటిష్ 'ఏసియన్ వాయిస్' పత్రిక



లండన్ : బాలీవుడ్ నటుడు, బిజెపి నేత అయిన శతృఘ్న సిన్హాకు సినిమాలలో, రాజకీయ రంగాలలో చేసిన సేవలకు గుర్తింపుగా జీవిత సాఫల్య పురస్కారాన్ని బ్రిటన్ పార్లమెంటు కాంప్లెక్స్‌లో గురువారం జరిగిన ఉత్సవంలో అందజేశారు. బ్రిటన్‌కు చెందిన 'ఏసియన్ వాయిస్' వార్తా పత్రిక ప్రతిసం వత్సరం అందించే " పొలిటికల్ అండ్ పబ్లిక్ లైఫ్ అవార్డ్స్" పురస్కారానికి ఈ సంవత్సరం ఆయనను ఎంపిక చేసినట్లు ప్రకటించింది. కాగా, ఈ పత్రిక 12వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటోంది. ప్రజా జీవితం తీవ్ర ప్రభావాన్ని చూపిన వ్యక్తులకు ఈ పురస్కారాన్ని అందజేస్తారు. ఈ వేడుకలకు పలువురు ప్రముఖులు హాజరైనట్లు తెలిపారు. శతృఘ్నసిన్హా 1960 నుంచి ఇప్పటివరకు పలు భాషలలో 225 సినిమాలలో నటించారు. బీహార్ నుండి లోక్ సభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆయనతో పాటుగా పాకిస్తాన్ మూలాలున్న యుకె క్యాబినేట్ మంత్రి సాజిద్ జావిద్ కూడా ఈ పురస్కారాన్ని అందుకున్నారు. 'టెలివిజన్ ఛానెల్ ఆఫ్ ది ఇయర్'గా భారత్‌కు చెందిన కలర్స్ టివి ఎంపిక కాగా, 'ఎయిర్‌లైన్ ఆఫ్ ది ఇయర్'గా జెట్ ఎయిర్‌వేస్ అవార్డు దక్కించుకున్నాయి. బెంగాలీ పారిశ్రామిక వేత్త ప్రబీర్ ఛటోపాధ్యాయ ను 'ఉత్తమ పారిశ్రామికవేత్త'గా సత్కరించారు.

కౌలు రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - సిద్ధవటం (కడప)

కడప జిల్లా సిద్ధవటం మండలంలోని జంగాలపల్లెకు చెందిన కౌలు రైతు గోపాలయ్య (50) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. ఎఎస్ఐ జయరామయ్య కథనం మేరకు.. గోపాలయ్య భూములు కౌలుకు తీసుకొని సాగుచేసుకొంటూ జీవనం సాగించేవారు. రెండు సంవత్సరాల నుండి వ్యవసాయంలో తీవ్ర నష్టాలు వచ్చాయి. పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడంతో అప్పులు ఎక్కువయ్యాయి. శుక్రవారం సాయంత్రం పురుగులు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. గోపాలయ్యను కుటుంబసభ్యులు 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం అర్ధరాత్రి ఆయన మృతి చెందారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



గుంటూరులో నిర్వహిస్తున్న నంది నాటకోత్సవాల్లో భాగంగా శనివారం ప్రదర్శించిన గురువింద గింజలు నాటికలోని ఓ సన్నివేశం

సందేశాలతో ఆకట్టుకున్న నాటక పోటీలు

కొనసాగుతున్న నంది నాటకోత్సవాలు

ప్రజాశక్తి-తెనాలి

స్థానిక రామకృష్ణ కవి కళాక్షేత్రం వేదికగా నిర్వహిస్తున్న నంది నాటకోత్సవాల్లో శనివారం ప్రదర్శించిన నాటకాలు, నాటికలు ప్రేక్షకులను విశేష సందేశాలతో అబ్బుర పరిచాయి. విజయవాడ వారు న్యూ స్టార్స్ మోడర్ థియేటర్ ఆర్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎం.ఎస్.చౌదరి రచనా దర్శకత్వంలో 60మంది కళాకారులతో ప్రదర్శించిన భరతావనిలో బలిపశువు సాంఘీక నాటకం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. బలవంతులచేతుల్లో బలహీనులు బలిపశువులుగా మారుతున్న ఉదంతాలను, సృష్టి గతితప్పడం ద్వారా ధర్మదేవత ఆవేదన చెందడానికి మృగధర్మాన్ని మానవులు ఆచరించడం వల్లనేనని, కలిపురుషుడు అంటే మరెక్కడి నుంచో రాడని, మానవుల్లో చోటు చేసుకుంటున్న విపరీతపు చేష్టలేనని చాటారు. తొలి ప్రదర్శనగా మహేశ్వరి ప్రసాద్ కామెడీ క్లబ్ విజయవాడ వారు బిబి శ్యామ్‌ప్రసాద్ రచనకు రాంపిళ్ళ మోహనకృష్ణ దర్శకత్వంలో ప్రదర్శించిన గురువింద గింజలు నాటకం ప్రేక్షకులను రక్తి కట్టించింది. ఆర్ఆర్ క్రియేషన్స్ విజయవారు వీర్లవరప్రసాదరావు రచనకు ఆర్.రాజేశ్వరి దర్శకత్వంలో మనం సాంఘీక నాటికను ప్రదర్శించారు. పాశ్చాత్య సంప్రదాయాల్లో పడి మన తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు మర్చిపోతున్న తీరు నాటిక ద్వారా వివరించారు. నవజ్యోతి ఆర్ట్స్ కావలి వారు ఎ.వి.మల్లేశ్వరరావు రచనా దర్శకత్వంలో ప్రదర్శించిన ఆల్చిగాడు నాటిక ద్వారా చేనేత రంగంలో ఎదురవుతున్న ఒడిదుడుకులు, ఆత్మహత్యల పాలవుతున్న తీరు, దోపిడి వ్యవస్థ, ప్రభుత్వ విధానాలను నాటిక ద్వారా వ్యక్తం చేశారు. అభ్యుదయ కళాసమితి తెనాలి వారు కొసరాజు మల్లిఖార్జునరావు రచనా దర్శకత్వంలో ప్రదర్శించిన నవ్వుల నదిలో నాటిక ఆసాంతం హాస్యాన్ని పంచుతూ చక్కని సందేశాన్ని పంచింది.

పేరుకే మోడల్.. సౌకర్యాలు నిల్..

- కనీస వసతులు కరువు
- ప్రారంభం కాని భవనాలు
- వేధిస్తోన్న సిబ్బంది కొరత



ప్రారంభం కాని గుత్తి ఆదర్శ పాఠశాలలో వసతి గృహం

ప్రజాశక్తి - అనంతపురం ప్రతినిధి

రాష్ట్రంలో బాలికల అక్షరాస్యతను పెంపొందించేందుకు ఏర్పాటు చేసిన ఆదర్శ పాఠశాలలు సమస్యలతో కునారిల్లుతున్నాయి. ఆదర్శ పాఠశాలల్లో హాస్టల్ వసతి లేకపోవటంతో దూరప్రాంతాల నుండి రావడానికి అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని బాలికలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు పాఠశాలల్లో తాగునీరు, కనీసవసతుల్లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. గుత్తిలో హాస్టల్ భవనం ప్రారంభించినా నిధులున్నా పలుచోట్ల హాస్టళ్ల నిర్మాణం చేపట్టని పరిస్థితులున్నాయి.

పామిడి, రాయదుర్గం తదితర ప్రాంతాల్లో ప్రహరీగోడ లేకపోవటంతో విద్యార్థులకు రక్షణ లేకుండా పోతున్నది. మరోవైపు వేసవి సమీపిస్తుండడంతో మోడల్స్ స్కూల్స్‌లో నీటి సమస్యలు మరింత ఉధృతమయ్యే పరిస్థితులేర్పడుతున్నాయి. పాఠశాలల్లో నెలకొన్న సమస్యల కారణంగా పదో తరగతి ఫలితాలపై ప్రభావం పడే అవకాశాలున్నాయని ఉపాధ్యాయ సంఘాల నాయకులు చెబుతున్నారు.

అనంతపురం జిల్లాలో 63 మండలాలకు గాను 61 మోడల్ స్కూల్స్‌ను మూడు విడతల్లో ప్రారంభించాలని ప్రభుత్వం ప్రణాళికలను రూపొందించింది. మొదటి విడతలో 25, రెండో విడతలో 24, మూడో విడతలో 12 ఆదర్శ పాఠశాలలను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రతి మోడల్ స్కూల్ భవనం 5 ఎకరాల్లో 3.25 కోట్ల రూపాయలు, హాస్టల్ భవనాలకు 1.28 కోట్ల రూపాయలతో నిర్మించేలా ఇప్పటివరకు 25 పాఠశాలలను ప్రారంభించారు. ప్రతి తరగతిలో వందమంది విద్యార్థులు చదువుకునేలా ఏర్పాట్లు చేశారు. ఇప్పటివరకు పనులు ప్రారంభించిన వాటిలో ఆరుచోట్ల నేటికీ హాస్టల్ బిల్డింగ్ నిర్మాణాలు పూర్తి కాలేదు. 2017-18 విద్యాసంవత్సరంలో 6 నుండి 10 వరకు 4,129 మంది బాలురు, 4,404 మంది బాలికలు, ఇంటర్‌లో 917 మంది బాలురు, 667 మంది బాలికలు చదువుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మొత్తంగా 17,500 మంది చదువుకోవాల్సి వుండగా 10,905 మంది విద్యార్థులు చదువుతున్నారు.

సిబ్బంది కొరత

ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన మోడల్ స్కూల్స్‌లో సిబ్బంది కొరత వేధిస్తోంది. జిల్లాలో 25 ప్రిన్సిపల్ పోస్టులకు 9 మంది మాత్రమే రెగ్యులర్ ప్రిన్సిపల్స్ వున్నారు. (పిజిటి) పోస్టు గ్రాడ్యుయేట్స్ టీచర్ 325 పోస్టులకు 96, టిజిటిలో 57, ఇతర బోధన సిబ్బంది 172, నాన్‌టీచింగ్‌లో 33 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా మోడల్ స్కూల్స్‌లో సగానికిపైగా సిబ్బంది కొరత వేధిస్తున్నది.

ఇంటికెళ్లే సరికి చీకటి పడుతోంది

రోజు ఇంటికి వెళ్లేసరికి చీకటి పడుతోంది. నేను మా మిత్రులు చర్లోపల్లి, బ్రాహ్మనపల్లి ప్రాంతాల నుండి వస్తున్నాం. ప్రత్యేక తరగతులుఉంటాయి. బాగా చదువుకోవాలని ఉన్నా సమస్యల వల్ల వెనుకబడుతున్నాం. హాస్టల్ వసతి ఏర్పాటు చేస్తే ఇక్కడే వుండి బాగా చదువుకోవాలని వుంది.

శ్వేత, విద్యార్థిని, గుత్తి ఆదర్శ పాఠశాల

ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలి



విద్యార్థుల భవిష్యత్తు దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలి. అనేక సమస్యలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. నీరు, ప్రహరీగోడలు, కనీస వసతుల్లేక అష్టకష్టాలు పడుతున్నారు. నిధులు వున్నా సమస్యలను పట్టించుకోని పరిస్థితి వుంది. వెంటనే నిర్మించిన పాఠశాలలో రెసిడెన్షియల్స్‌ను ప్రారంభించాలి. రెండోదశను ప్రారంభించి జిల్లాలో అక్షరాస్యత పెంపుకు కృషి చేయాల్సి వుంది.

కసాపురం రమేష్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు



విశాఖలోని ఎపిఇపిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయం

ప్రజాశక్తి-విశాఖపట్నం ప్రతినిధి

దేశంలోనే మొదటిస్థానం సంపాదించిన ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(ఎపిఇపిడిసిఎల్)కు ఇటీవల ఓ పెద్ద సమస్య వచ్చింది. ప్రభుత్వ చర్యలు సైతం దాని ప్రతిష్టను మంటగలిపేలా ఉన్నాయి. విద్యుత్ పంపిణీ, సరఫరా నష్టాలను లెక్కగట్టేందుకు రెండు కొలమానాలను పరిగణనలోకి తీసుకుంటారు. పంపిణీ, సరఫరా నష్టాలతో పాటు వసూళ్లు పూర్తిస్థాయిలో జరగాల్సివుంది. అయితే ఇక్కడ వసూలు సంపూర్ణంగా జరగకపోవడంతో ఆ ప్రభావం ఇపిడిసిఎల్‌కు ఉన్న కీర్తిని దిగజారేలా కన్పిస్తోంది. ఈ సంస్థకు రావాల్సిన బకాయిల్లో అత్యధికభాగం ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థలు, స్థానిక సంస్థలు, ఎత్తిపోత పథకాలకు సంబంధించినవే ఉన్నాయి. విద్యుత్ బకాయి నిధులు ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో కోట్ల రూపాయలు ఇపిడిసిఎల్‌కు ప్రభుత్వ కార్యాలయాలు చెల్లించాల్సి ఉంది. ప్రభుత్వ మౌఖిక ఆదేశాల ప్రకారం ప్రభుత్వ కార్యాలయాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయకుండా కొనసాగిస్తోంది. ఇది చివరకు ఇపిడిసిఎల్‌కు గుదిబండగా మారడమే కాదు, దానికున్న ప్రతిష్టను దెబ్బతీసేలా తయారైంది. పంపిణీ, సరఫరా నష్టాలు తగ్గినా, వసూళ్లలో పురోగతి లేకపోతే సగటు రేటింగ్ శాతం తగ్గనుంది. రెండూ సమతుల్యంగా ఉన్నంత కాలం డిస్కాం పరపతి కొనసాగుతోంది. వసూళ్లు పూర్తిస్థాయిలో లేకపోవడంతో ఇపిడిసిఎల్ పంపిణీ, సరఫరా నష్ట శాతం క్రమంగా పెరుగుతోంది. 2000-01లో 17.91 శాతమున్న పంపిణీ నష్టాలను 2016-17 వచ్చే సరికి క్రమంగా 4.99 శాతానికి తగ్గించారు. 2015-16, 2016-17 వరకు పంపిణీ నష్టాలు, సాంకేతిక, వాణిజ్యపరమైన నష్టాలుగా చూసే వసూళ్లు సమతుల్యంగా ఉంటూ వచ్చాయి. 2016-17లో వసూళ్ల నష్టం 4.99 శాతం ఉండగా, 2017-18 నాటికి ఈ నష్టం 7.96 శాతానికి చేరుకుంది. దీంతో పంపిణీ, సరఫరా నష్టాలు 2016-17లో 4.99 శాతముండగా, 2017-18 నాటికి 5.10 శాతానికి పెరిగింది. ఈ పరిణామం ఇపిడిసిఎల్‌ను తీవ్ర కలవరానికి గురి జేస్తోంది.

	పంపిణీ నష్టాలు	వాణిజ్యపరమైన నష్టాలు
2015-16	5.48	5.48
2016-17	4.99	4.99
2017-18	5.10	7.96

రైతులకు చేరువగా పిఎసిఎస్‌లు

రాష్ట్ర రవాణశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - జలుమూరు



పిఎసిఎస్ నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

ప్రాథమిక సహకార సంఘాల (పిఎసిఎస్) సేవలను రైతులకు చేరువ చేస్తున్నామని రాష్ట్ర రవాణశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శ్రీకాకుళం జిల్లాలోని జలుమూరు, కోటబొమ్మాళి మండలాల్లో పలు శంకు స్థాపనలు, ప్రారంభోత్సవాల కార్యక్రమాల్లో శనివారం ఆయన పాల్గొన్నారు. ఇందులో భాగంగా జలుమూరు మండలంలోని చల్లవానిపేట జంక్షన్‌లో రూ.40 లక్షలతో నిర్మించిన ప్రాథమిక సహకార సంఘం నూతన కార్యాలయ భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కౌలు రైతులకు సహకార సంఘాల ద్వారా రుణాలిచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయరంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమను ప్రోత్సహిస్తోందని చెప్పారు. పాల ఉత్పత్తిలో రాష్ట్రంలోనే శ్రీకాకుళం జిల్లా ప్రథమ స్థానంలో నిలపాలని పిలుపునిచ్చారు. అందుకవసరమైన చర్యలను చేపడుతున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, జిల్లా సహకార అధికారి బి.శ్రీహరి, డిసిసిబి ముఖ్య కార్యనిర్వహణాధికారి దత్తి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మృతి చెందిన మావోయిస్టుల వివరాలు లభ్యం

అగ్రనేతలెవరూ లేరు
మావోయిస్టు అధికార ప్రతినిధి జగన్

ప్రజాశక్తి - చింతూరు (తూర్పుగోదావరి)

తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో శుక్రవారం జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన 10 మంది మావోయిస్టుల వివరాలు లభ్యమయ్యాయి. వారిలో ఏడుగురు మహిళలే. మృతుల్లో మావోయిస్టు పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు, హన్మకొండ మండలం రాంపురానికి చెందిన పెడబోయిన స్వామి అలియాస్ ప్రభాకర్ మినహా మిగిలిన వారంతా ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా, దంతెవాడ జిల్లాలకు చెందినవారని పేర్కొన్నారు. మరణించిన వారిలో జిల్లా కమిటీ సభ్యుడు పెడబోయిన స్వామి (ప్రభాకర్), పిత్తాపురం దళ సభ్యుడు ఐతు, సింగం గ్రామానికి చెందిన బుద్రి, ఇంద్రావతికి చెందిన దళ కమాండర్ మల్లేష్, వీరాపురం గ్రామానికి చెందిన రామి (సిఆర్‌సి డాక్టర్స్ టీమ్), దక్షిణ బస్తర్‌కు చెందిన కమల, గంగులూరుకు చెందిన సుక్కి, బీజాపూర్‌కు చెందిన రతన్, సోంబు, బస్తర్ జిల్లాకు చెందిన కొవ్వాసి రంగి ఉన్నారు. ఎన్‌కౌంటర్లో తమ పార్టీ అగ్రనేతలెవరూ మృతి చెందలేదని తెలంగాణా సిపిఐ మావోయిస్టు పార్టీ అధికార ప్రతినిధి జగన్ శనివారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ప్రజలతో మాట్లాడుతూ సేదతీరుతున్న సమయంలో ఒక వ్యక్తి ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి, ఏకపక్షంగా కాల్పులు జరిపారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు ప్రచారం చేస్తున్నట్లు ఈ ఎన్‌కౌంటర్‌లో హరిభూషణ్, బడే తుకారాం, కంకణాల రాగిరెడ్డి చనిపోలేదని తెలిపారు. మరోవైపు కొత్తగూడెం జిల్లా పోలీసులు మాట్లాడుతూ మృతదేహాలకు భద్రాచలంలోనే ఫోరెన్సిక్ వైద్యుల పర్యవేక్షణలో పోస్టుమార్టం నిర్వహించినట్లు తెలిపారు.

గోనెగండ్లలో అగ్ని ప్రమాదం

24 గడ్డివాములు దగ్ధం

ప్రజాశక్తి-గోనెగండ్ల (కర్నూలు)

కర్నూలు జిల్లా గోనెగండ్ల లక్ష్మీపేటలో శనివారం మధ్యాహ్నం భారీ అగ్ని ప్రమాదం జరిగింది. ప్రమాదంలో 24 గడ్డివాములు దగ్ధమయ్యాయి. రూ.లక్షల్లో ఆస్తినష్టం సంభవించింది. కర్నూలు జిల్లా గోనెగండ్ల లక్ష్మీపేట రైతులు పశువుల కోసం గడ్డివాములను నిల్వ చేసుకున్నారు. శనివారం మధ్యాహ్నం అకస్మాత్తుగా నిప్పంటుకుని మంటలు వ్యాపించి గడ్డివాములు పూర్తిగా కాలిపోయాయి. బాధితులు అగ్నిమాపక శాఖకు సమాచారం అందజేయడంతో ఎమ్మిగనూరు, ఆదోని, కోడుమూరు నుంచి అగ్నిమాపక సిబ్బంది హుటాహుటినా సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. అప్పటికే గడ్డివాములు పూర్తిగా కాలిపోయి బూడిదయ్యాయి. జిల్లాస్థాయి అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

పార్లమెంట్ సమావేశాలను అడ్డుకుంటాం : ఎంపి కొనకళ్ల

ప్రజాశక్తి-గుడివాడ (కృష్ణా)

ప్రత్యేక హోదా కోసం కేంద్రంతో తాడోపేడో తేల్చుకునేందుకు పార్లమెంట్ సమావేశాలను అడ్డుకుంటామని మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు కొనకళ్ల నారాయణ అన్నారు. కృష్ణాజిల్లా గుడివాడలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం నాలుగేళ్ళుగా అన్యాయం చేస్తూ వచ్చిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు 29 సార్లు ప్రధాన మంత్రిని కలిసి విభజన చట్టంలో ఉన్న హామీలను అమలు పరచాలని కోరినప్పటికీ కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవటం దారుణమన్నారు. ఈనెల 5వ తేదీలోపు రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇచ్చేది లేనిది తేల్చి చెప్పాలని ఇప్పటికే బిజెపి అధిష్టానానికి అల్టిమేటం జారీ చేసినప్పటికి కేంద్ర ప్రభుత్వం ఎటువంటి సమాధానం ఇవ్వకుండా తాత్సారం చేస్తూ వస్తుందన్నారు. ఈ నెల 5 నుంచి జరిగే పార్లమెంట్ సమావేశాలను కచ్చితంగా అడ్డుకుని నిరసనను వ్యక్తం చేస్తామని చెప్పారు. అంతేకాకుండా దశలవారీగా ఆందోళనలను ఉధృతం చేసి కేంద్ర ప్రభుత్వంతో అమీతుమీ తేల్చుకునేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, అర్బన్ బ్యాంక్ చైర్మన్ పిన్నమనేని పూర్ణ వీరయ్య పాల్గొన్నారు.

ఫలించిన వ్యకాస పోరాటం

58 మందికి ఇళ్ల స్థలాల కేటాయింపు


ప్రజాశక్తి- నందివాడ (కృష్ణా)

కృష్ణాజిల్లా నందివాడ మండలం అంకన్నగూడెంలో అధికారులు ఇళ్ల స్థలాలు కేటాయింపునకు పూనుకున్నారు. గతంలో కేటాయించిన స్థలాన్ని విడగొట్టి పేదలకు పంపిణీ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆర్‌డిఒ కార్యాలయం, స్థలం వద్ద ఆందోళన చేసిన విషయం విదితమే. శనివారం సర్వే మేళా కార్యక్రమంలో భాగంగా ఆర్ఐ ప్రసాద్, సర్వేయర్ శేషగిరిరావులు 3.30 ఎకరాల స్థలాన్ని విడగొట్టి 58 మందికి 2 సెంట్ల చొప్పున పట్టాలు అందజేశారు. మరో 12 మందికి త్వరలో కేటాయిస్తామని తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆందోళనలో భాగంగానే తమకు స్థలాలు వచ్చాయని గ్రామ దళితులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు ఆర్‌సిపి.రెడ్డి మాట్లాడుతూ.. పోరాటం చేస్తే తప్ప ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. పారిశ్రామికవేత్తలకు వందల ఎకరాలు కేటాయిస్తున్న ప్రభుత్వం గ్రామాల్లో గూడు లేని పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో సిపిఎం గుడివాడ ఎరియా కమిటీ నాయకులు నీలం మురళీకృష్ణారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం తూర్పు కృష్ణా కార్యదర్శి మురాల రాజేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రత్యేకం

తగ్గుతున్న ఆయకట్టు

- కర్ణాటక అక్రమ నీటి వినియోగం
- ఏటా 10 టిఎంసిల దాకా నీటి మళ్లింపు



ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

కర్నూలు జిల్లాలోని పశ్చిమ ప్రాంతానికి సాగు, తాగునీటిని అందించే తుంగభద్ర నది నీరు ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల చౌర్యానికి గురవుతోంది. తుంగభద్ర దిగువ కాల్వకు చెందిన నీటిని పొరుగు రాష్ట్రమైన కర్ణాటక యథేచ్ఛగా దోపిడీ చేస్తోంది. దీంతో ఏపికి రావాల్సిన కోటాకు గండిపడుతోంది. జిల్లాలోని కరువు ప్రాంతాలైన ఆలూరు, ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం, కోడుమూరు, పాణ్యం నియోజకవర్గాల్లో తుంగభద్ర దిగువ కాల్వ కింద 1.53 లక్షల ఎకరాల స్థిరీకరించిన ఆయకట్టు ఉండేది. ఇప్పుడు కేవలం 50 వేల ఎకరాలకు మాత్రమే సాగునీరు అందుతోంది. దిగువ కాల్వ కింద ఈ డ్యాంలో 24 టిఎంసిల నికర జలాల కేటాయింపు ఉంది. డ్యాంలో నీటి లభ్యతను బట్టి కేటాయింపులు చేస్తారు. ఈఏడాది 123.7 టిఎంసిల నీరు డ్యాంలోకి రావడంతో దిగువ కాల్వకు 12.906 టిఎంసిల వాటా వచ్చింది. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక సరిహద్దులోని హానవాళువద్ద తుంగభద్ర దిగువ కాల్వలో 600 క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉండాలి. కానీ ఎన్నడూ 300 క్యూసెక్కులకు దాటకపోవడంతో సగానికిపైగా ఎగువన జలచౌర్యానికి గురవుతోంది. మన వాటా 12.906 టిఎంసిలకుగాను ఇప్పటిదాకా కేవలం 5.3 టిఎంసిలు మాత్రమే వచ్చింది. అయితే 11.92 టిఎంసిల నీటిని వాడారని, డ్యాంలో ఎల్లెల్సీ వాటా కింద కేవలం 0.977 టిఎంసిల నీరు మాత్రమే ఉందని బోర్డు అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం జిల్లాలో తుంగభద్ర దిగువ కాల్వ కింద కేవలం 46 వేల ఎకరాలకే సాగునీరు అందించారు. మన రాష్ట్రానికి నీటి వాటా ప్రకారం 11.92 టిఎంసిలు మనకే ఇచ్చి ఉంటే దాదాపు లక్ష ఎకరాల ఆయకట్టు అభివృద్ధిలోకి వచ్చేదని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం తుంగభద్ర డ్యాంలో 9 టిఎంసిల దాకా నీరు అందుబాటులో ఉంది. ఇందులో మన వాటాను దిగువ కాల్వ కింద నీటి సమస్యతో సతమతమవుతున్న 10 వేల ఎకరాల పత్తి, మిరప పంటలను కాపాడాలని రైతులు కోరుతున్నారు. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి కోసమైనా తుంగభద్ర దిగువ కాల్వకు సంబంధించిన నీటివాటాను రాబట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

తుంగభద్ర ఆయకట్టును కాపాడడంలో ప్రభుత్వం విఫలం

తుంగభద్ర ఆయకట్టును కాపాడడంలో ప్రభుత్వం ప్రతి ఏడాది విఫలమవుతోంది. కర్ణాటక మన రాష్ట్రానికి చెందిన నీటి వాటాను అక్రమంగా వాడుకుంటున్నప్పటికీ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం జలచౌర్యాన్ని నివారించి తుంగభద్ర ఆయకట్టును పరిరక్షించేందుకు చర్యలు తీసుకోవాలి.

- టి.రమేష్‌కుమార్, ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి

సంక్షిప్తం

వచ్చే ఏడాది నుంచి కెజిబివిలో ఇంటర్ విద్య

భవన ప్రారంభోత్సవంలో గంటా

ప్రజాశక్తి- భీమునిపట్నం, విశాఖ

వచ్చే ఏడాది నుంచి రాష్ట్రంలో అన్ని కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయాల్లో(కెజిబివిలో) ఇంటర్ విద్యను ప్రారంభించనున్నామని విద్యా శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు తెలిపారు. భీమిలిలోని కృష్ణా కాలనీలో సర్వశిక్షా అభియాన్ నిధులు రూ.1.25 కోట్లతో నిర్మించిన కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయం (కెజిబివి) భవనాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదో తరగతి వరకు బాలికలు చదివి అనంతరం డ్రాప్ అవుట్స్‌లో ఉంటున్నారని, చదువు కొనసాగించడానికి ఉపయోగంగా ఉంటుందని అన్ని కెజిబివిల్లో ఇంటర్ విద్యను ప్రారంభించనున్నామని చెప్పారు.

కిడ్నీ వ్యాధి నిర్మూలనకు చర్యలు తీసుకోవాలి సిపిఎం వినతి

ప్రజాశక్తి - నూజివీడు (కృష్ణా)

కృష్ణాజిల్లా ఎ.కొండూరు, గంపలగూడెం మండలాల్లోని ఆయా గ్రామాలు, తండాలు, దళిత, బిసి ప్రాంతాల్లో కిడ్నీ వ్యాధి తీవ్ర రూపం దాల్చిందని, కిడ్నీ వ్యాధి నిర్మూలనకు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతూ సిపిఎం పశ్చిమ కృష్ణా కార్యదర్శి డివి.కృష్ణ ఆధ్వర్యంలో నూజివీడు ఆర్‌డిఒ సిహెచ్.రంగయ్యకు వినతిపత్రం శనివారం అందజేశారు. ఈ సందర్భంగా డివి.కృష్ణ మాట్లాడుతూ.. ఎ.కొండూరు పిహెచ్‌సిలో డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేసి నెఫ్రాలజిస్ట్‌ను నియమించాలన్నారు. నిపుణులైన వైద్య బృందాన్ని పంపి పరీక్షలు నిర్వహించి వ్యాధి నిర్ధారణ చేయాలన్నారు. పిహెచ్‌సిలో కిడ్నీ సంబంధిత వ్యాధులకు ప్రతి నెల ఉచితంగా మందులు పంపిణీ చేయాలని, అదనంగా వైద్యులను, సిబ్బందిని నియమించాలని కోరారు.

మూడున్నర కిలోల బంగారు బిస్కెట్లు స్వాధీనం

ప్రజాశక్తి-తెనాలిటౌన్ (గుంటూరు)



అనధికారికంగా తరలిస్తున్న రూ.1.10 కోట్ల విలువ చేసే మూడున్నర కిలోల బంగారు బిస్కెట్లను గుంటూరు జిల్లా తెనాలి రైల్వే పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. తెనాలి రైల్వే ఎస్‌పి వివరాల ప్రకారం.. రాజమండ్రిలో వేర్వేరు బంగారు షాపుల్లో పని చేస్తున్న ప్రగళ్లపాటి ప్రభాకరరావు, దుడే అంజిబాబు చెన్నై నుంచి శుక్రవారం రాత్రి రాజమండ్రికి బయలుదేరారు. చెన్నై నుంచి చార్మినార్ ఎక్స్‌ప్రెస్‌లో గూడూరు వచ్చి, అక్కడ శేషాద్రి ఎక్స్‌ప్రెస్ జనరల్ బోగీలో ఎక్కారు. తెల్లవారుజామున రెండు గంటలకు తెనాలికి చేరుకునే సమయానికి రైల్వే ఎస్ఐ కె.వెంకటయ్య తనిఖీలు చేసే క్రమంలో ప్రభాకరరావు, అంజిబాబు అనుమానాస్పదంగా కనిపించటంతో అదుపులోకి తీసుకున్నారు. కొద్దిసేపు విచారణానంతరం తమ వద్ద బంగారు బిస్కెట్లు ఉన్నట్లు అంగీకరించారు. ప్రభాకరరావు వద్ద కిలో, అంజిబాబు వద్ద రెండున్నర కిలోల బిస్కెట్లు స్వాధీనం చేసుకున్నారు. బంగారానికి బిల్లుల్లేవని, కమర్షియల్ ట్యాక్స్, ఇన్‌కంట్యాక్స్ సహకారంతో చర్యలు తీసుకుంటామని ఎస్‌పి చెప్పారు.

సంపాదకీయం

మాట్లాడదాం!

ఇది తరతరాల చరిత్ర. ఈ దేశ చిత్రపటం నిండా చెరగని మరకలతో కొనసాగుతోన్న రక్త చరిత్ర. ఆదిమ కాలం నుంచి స్త్రీజాతి చిందిస్తోన్న రక్తధారల చరిత్ర. స్త్రీ జాతి నుదుటిపై మనువాద సమాజం అద్దిన రక్తపు మరకల చరిత్ర. అంటు అనో, మైల అనో తన ఇంట్లోనే అంటరాని వ్యక్తిగా బతకమని శాసిస్తోన్న సంప్రదాయపు ముసుగు చరిత్ర. ఈ ఆధునిక సమాజంలోనూ ఆచారం పేరుతో రుద్దబడుతోన్న దురాచారాల చరిత్ర. శృంగారం గురించి పచ్చిగా మాట్లాడే పెద్దమనుషులు ఈ రక్తపు మరకలను ఒక అంటుగా ఎందుకు చూస్తున్నారు. 'స్త్రీ రుతుక్రమం అంత హీనమైన విషయమా? అంత సిగ్గుపడే విషయమా? అంత రహస్యంగా దాచుకోవాల్సిన విషయమా? నాలుగు రోజుల పండగంటూ ఎగతాళి ఎందుకు..? నాలుగు రోజుల ఎర్రబట్ట నీ పుట్టుకైనప్పుడు, జన్మనివ్వడం రహస్యం కానప్పుడు... అపచారమంటూ నాలుగు గోడల మధ్య, చింకి చాప మీద ఎందుకు బతకాలి? ఆ ఎరుపులోనే నీ జన్మ రహస్యం దాగుందని తెలుసుకోరేం? ఎర్రబట్టను మోస్తూనే నినుకడుపున మోసే మాయను స్త్రీ తనలో ఇముడ్చుకుంటుందని భావించరేం..?'- స్త్రీలు బహిరంగంగా ప్యాడ్స్‌ను పట్టుకోవడంపై సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా చర్చ జరుగుతోంది. 'గుళ్ళో దేవతని కొలుస్తారు/ ఇంట్లో ఆడపిల్లను ఈసడిస్తారు/ అమ్మ వారు చెప్పాలా తను కూడా ఆడదని/ ఆ నాలుగు రోజులూ తనకీ ఉంటాయని మర్చిపోతారేం' అంటూ ధ్వజమెత్తుతారో కవయిత్రి.

అంతేకాదు, బహిరంగంగా బిడ్డకు పాలివ్వడాన్ని కూడా తప్పు బట్టే కుసంస్కృతి సామాజిక మాధ్యమాల్లో అక్షరాలై ప్రవహిస్తోంది. ఒకవైపు స్త్రీని అంగడి వస్తువుగా మార్కెట్ చేస్తూనే, మరోవైపు తన మనుగడపై, స్వేచ్ఛపై అంక్షలు పెట్టడం శోచనీయం. ఈ సమాజం ఆరోగ్యవంతంగా వుండాలంటే... పుట్టే బిడ్డలు ఆరోగ్యంగా పుట్టాలి. బిడ్డల బుల్లి బొజ్జను తల్లి తన చనుబాలతో నింపాలి. ఐక్యరాజ్య సమితి నివేదిక ప్రకారం మన దేశంలో ప్రతీ ఏడాది తల్లి పాలు అందక పౌష్టికాహార లోపంతో లక్ష మంది శిశువులు చనిపోతున్నారు. తల్లీబిడ్డల ఆరోగ్యంపై జరగాల్సిన చర్చ... ఇప్పుడు పక్కతోవ పడుతోంది. 'తదేకంగా చూడకండి... చంటిబిడ్డకు పాలు పట్టాలి...' శీర్షికతో 'గృహలక్ష్మి' అనే మళయాల మ్యాగజైన్ కవర్ పేజీపైన మోడల్ గిలుజోసెఫ్ ఒక బిడ్డకు స్తన్యమిస్తున్న ఫొటోను ప్రచురించింది. దీనిపై సామాజిక మాధ్యమాల్లో పెద్ద చర్చ జరుగుతోంది. బహిరంగ ప్రదేశాలలో తల్లులు బిడ్డకు పాలు పట్టడంలో ఉన్న ఇబ్బందులను చర్చించడం ఈ కథనం ఉద్దేశం. అయితే... ఒక మోడల్‌తో బిడ్డకు పాలిస్తున్నట్లున్న ఈ ఫొటోపై కొందరు అభ్యంతరం చెబుతున్నారు. కండోమ్‌ల ప్రచారానికి జుగుప్సాకరంగా టీవీలలో వస్తోన్న వాణిజ్య ప్రకటనలపైన, వాటిలో నటిస్తోన్న మోడల్స్‌పైన లేని అభ్యంతరం... ప్యాడ్స్ పట్టుకున్న ఫొటోలపైనా, బిడ్డకు పాలిస్తోన్న ఫొటోపైనా ఎందుకు? 'రెండు కళ్ళనించి చూపులు సూదుల్లా వచ్చి/ మాంసపు ముద్దలపై విచ్చుల విడిగా తిరుగుతుంటాయి/ చూపులెప్పుడూ ముఖంలోకి చూడవు/ మాట ఎప్పుడూ మనసు నించి పుట్టదు/ కనిపించి నప్పుడల్లా కంపరం పుట్టేలా/ వంటిమీద చూపులు చెదల్లా పాకుతూ ఉంటాయి' అని వేల్చేరు నారాయణరావు 'చూపులు' కవితలో చెప్పినట్టుగా, చూపులు సూదుల్లా తాకుతున్నా... చూపులు చెదల్లా వళ్లంతా అల్లుకుంటున్నా బహిరంగ ప్రదేశాల్లో బిడ్డకు పాలిచ్చే తల్లులెందరో వున్నారు. ఆస్ట్రేలియా సెనేటర్ లరిస్సా వాటర్ గతేడాది పార్లమెంటులోనే బిడ్డకు చనుబాలివ్వడం అప్పట్లో సంచలనం సృష్టించింది. 'ముళైగల్' అనే కవితలో... 'చన్నులు/ బిగిసిన కౌగిలిలో ప్రేమనూ/ బిడ్డ గుర్తు రాగానే పాలనూ/ ఒలికిస్తాయి' అంటారు తమిళ కవయిత్రి రేవతి కుట్టి. బిడ్డకు పాలివ్వడం తల్లి హక్కు. ఆ పాలను తాగడం బిడ్డ జన్మహక్కు. దీనికి పేదతల్లి, డబ్బున్న తల్లి అనే భేదం లేదు. అది తల్లి గొప్పతనం. అది మహిళకు మాత్రమే వున్న గొప్ప వరం.

'ఇన్నేళ్లుగా నానిన మాటలన్నీ/ వేళ్ళకొసల్నుండి ధారలు ధారలుగా/ కాగితాల నిండా పరచుకొంటున్నాయి' అని శీలా సుభద్రాదేవి, 'మనం మాట్లాడకపోతే/ మన ముందు తరాలకు/ మాట మిగలదు' అని 'మాట్లాడదాం' కవయిత్రి జయ చెప్పినట్లుగా... బహిరంగంగా ప్యాడ్స్ పట్టుకోడం గురించీ, బిడ్డకు చనుబాలివ్వడం గురించీ మహిళలు మాట్లాడకపోతే... ఇక్కడా మగాడి ఆధిపత్య భావజాలమే రుద్దబడుతుంది. 'స్త్రీకి కూడా శరీరం ఉంది. దానికి వ్యాయామం ఇవ్వాలి. ఆమెకి మెదడు ఉంది. దానికి జ్ఞానం ఇవ్వాలి. ఆమెకు హృదయం ఉంది. దానికి అనుభవం ఇవ్వాలి' అనే సంగతిని గుర్తించని మగానుభావులకు, పురుషాధిక్యతతో కళ్ళు మూసుకుపోయేవారికి చలం రాసిన ఈ వాక్యాలు చెంపపెట్టు. పురుషాధిక్యమూ, మత ఛాందసమూ మార్కెట్ ప్రేరిత ప్రభుత్వ విధానాలు మహిళల మనుగడకే కొత్త సవాళ్లు సృష్టిస్తున్నాయి. ప్రతేడాది మార్చి 8న జరిగే అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఒక ఉత్సవంగా మార్చారు. సంప్రదాయం పేరుతో అద్దే ఈ మరకలు... కడిగితే పోయేవికాదు. 'తరతరాల దురాచారాల వడిలో/ తలవంచిన ఓ మహిళా/ ఇకనైనా తలెత్తి చూడు/ తూర్పు వాకిట కిరణరాశై/ కదలుచున్నది చైతన్యరథం' అని డాక్టర్ వాసా ప్రభావతి చెప్పినట్లుగా... ప్రతి మహిళా తలెత్తి చూడాల్సిందే.

ఇది విషయం



ప్రజా తీర్పు పేరు చెప్పి
పింకు నోట్ల పంపకమా...
చట్టాలను లొంగదీసి
ప్రలోభాల తతంగమా!

అధికారం చేతవుంటే
అక్రమాలకు అడ్డెక్కడ...
అలసత్వపు నీడలోన
బ్యాలెట్‌కు స్వేచ్ఛెక్కడ!

- కొల్లూరు వెంకట్

కమల వ్యూహాలు - ఈశాన్య ఫలితాలు

విశ్లేషణ





తెలకపల్లి రవి

> ఇటీవల రాజస్థాన్, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, ఒరిస్సా వంటి చోట్ల ఉప ఎన్నికల్లో బిజెపికి తగిలిన ఎదురుదెబ్బల నేపథ్యంలో ఈశాన్య విజయాన్ని ఎక్కువగా చూపినా చెల్లుబాటు కాదు. ఉత్తర మధ్య భారత దేశంలో తన స్థానాల సంఖ్య తగ్గనుండడం, దక్షిణ భారతంలో పెద్దగా విస్తరణావకాశాలు లేకపోవడం వల్ల ఈశాన్యంలోని 25 లోక్‌సభ స్థానాలపై బిజెపి దృష్టి వుంచింది.

మూడు ఈశాన్య రాష్ట్రాల శాసనసభ ఎన్నికల ఫలితాలు స్పష్టమైనాయి. త్రిపురలో గత నలభై ఏళ్లుగా (1989 సైనిక జోక్యంతో కలిగిన ఓటమి తప్ప) ప్రజానుకూల పాలన సాగిస్తున్న వామపక్ష ప్రభుత్వం ఓటమిపాలైంది. కమ్యూనిస్టులను ఎలాగైనా ఓడించి అధికారం కైవశం చేసుకోవాలని అన్ని రకాలైన రాజకీయ అరాజకీయ వ్యూహాలకూ పాల్పడిన బిజెపి గెలుపు సాధించింది. ఈ విజయం తమకు చారిత్రికమైందని విప్లవాత్మకమైందని బిజెపి కీలక నేత, వ్యూహకర్త రామ్ మాధవ్ ప్రకటించారు. మేఘాలయలో పాలక కాంగ్రెస్, నాగాలాండ్‌లో పాలక ఎన్‌పిఎఫ్ పెద్ద శక్తులుగా వచ్చాయి. గత పాతికేళ్లుగా వరుసగా నాలుగుసార్లు వామపక్ష ప్రభుత్వం విజయం సాధించిన సమయంలో ఏనాడూ త్రిపుర ఫలితాలకు ఇలాంటి ప్రాధాన్యత గాని ప్రచారం గాని లభించింది లేదు. ఇప్పుడు బిజెపి గెలవగానే అది చారిత్రాత్మకం, అపురూపం అయిపోయింది. వామపక్ష ఫ్రంట్ ఓటమి కమ్యూనిస్టు అభిమానులను, ప్రగతిశీల వాదులను నిరుత్సాహ పర్చడం సహజం. కాని రాజకీయాలలో అది కూడా ప్రత్యర్థి ప్రతీఘాత శక్తులన్నీ కట్టగట్టుకుని దాడి చేసినపుడు ఎన్నికల్లో ఓడిపోవడం అసాధారణమేమీ కాదనే వాస్తవాన్ని కూడా గమనంలో పెట్టుకోవాలి. ఎన్నికల ఓటమి సైద్ధాంతిక పరాజయం కాదు. కేరళలో ఒకసారి ఎల్‌డిఎఫ్, ఒకసారి యుడిఎఫ్ గెలుస్తుంటాయి గనక ఆ ఫలితాలను ఒక విధంగా చూస్తుంటారు. బెంగాల్‌లో వరుసగా 35 ఏళ్ళ, త్రిపురలో 25 ఏళ్ళ అవిచ్ఛిన్నంగా అధికారంలో కొనసాగడం వల్ల ఓడిపోవడం ఎక్కువ ప్రచారం పొందుతుంది.

గెలుపు కోసం నానా విన్యాసాలు

త్రిపురతో సహా ఈశాన్య రాష్ట్రాల్లో ఎలాగైనా పాగా వేయడం కోసం బిజెపి అగ్ర నాయకత్వం ప్రధాని మోడీ, అధ్యక్షుడు అమిత్ షా ద్వయం, ఆరెస్సెస్ పరివార్ అన్ని రకాలైన మాయోపాయాలకూ పాల్పడ్డాయి. నాగాకు చెందిన రాణి గైడన్‌లాకు భారతరత్న ఇవ్వడమే గాక ఆమె సంస్మరణ ఉత్సవాలకు మోడీ తరలి రావడంతో ఈశాన్య ఆపరేషన్ మొదలైంది. తర్వాత ఆరెస్సెస్ స్వయంగా రంగంలోకి దిగింది. వనవాసి కళ్యాణ్ పరిషత్ ద్వారానూ ఇతర సంస్థల ముసుగులోనూ రాజకీయ ప్రచారం నడిచింది. ఈశాన్య రాష్ట్రాల్లో క్రైస్తవులు అధిక సంఖ్యలో వుంటారు గనక బిజెపి హిందూత్వ రాజకీయాలు చెల్లుబాటు కావని ఈ ఎత్తుగడ పాటించారు. మణిపూర్‌లో మెజార్టీ లేకున్నా అక్రమ పద్ధతిలో ప్రభుత్వం ఏర్పాటు చేశారు. అరుణాచల్‌లోనూ అసోంలోనూ విజయం సాధించారు. అసోంలో గెలుపు కోసం వేర్పాటువాద శక్తులను కలుపుకోవడమే గాక బంగ్లాదేశ్ శరణార్థుల సమస్యను మత కోణంలో ప్రచారం చేశారు. గద్దెక్కిన తర్వాత హిందూ శరణార్థులకు పౌరసత్వం, ముస్లింలకు నిరాకరిస్తూ 1971 నాటి పౌరసత్వం కొలబద్దను వమ్ము చేశారు. అసోంను ఆధారం చేసుకుని తక్కిన ఈశాన్య రాష్ట్రాలలో చొరబడాలని వ్యూహాలు సిద్ధం చేసుకున్నారు. ఆ రాష్ట్ర మంత్రి హేమంత బిస్వాస్ శర్మను ఇందుకు నియోగించారు. దేశమంతా బిజెపికి ఎదురు లేకుండా పోతున్నదనే భావం కలిగించడం కోసం ఈశాన్యంలో విజయం కీలకమనేది ఇక్కడ ఆలోచన. దాంతోపాటే క్రైస్తవ గిరిజన జనాభా అధికంగా వుండటం, చైనాతో సరిహద్దు కారణంగా బిజెపికి మరింత ఆసక్తి. ఇక కరుడుగట్టిన కమ్యూనిస్టు వ్యతిరేకతకు మారు పేరైన ఆ పార్టీకి త్రిపురలో వామపక్ష ప్రభుత్వం ఉనికి ఎలాగూ మింగుడు పడేది కాదు. కనుకనే ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి రామ్ మాధవ్ మొదలు ఆరెస్సెస్ అధినేత మోహన్ భగవత్ వరకూ త్రిపురలో మోహరించారు. త్రిపురను మొదటిసారి ప్రధాన భూభాగం (మెయిన్‌లాండ్)తో కలపాలని రాం మాధవ్ నినాదమిచ్చారు. ప్రధాని మోడీ నాలుగు సార్లు పర్యటించారు. రెండేళ్ల కిందటే అమిత్ షా మకాం వేసి మంత్రాంగం నడిపారు. ఇవన్నీ రాజకీయంగా చేయడం అటుంచి గిరిజన గిరిజనేతరుల మధ్య, గిరిజన వర్గాల మధ్య తగాదాలు పెట్టే 'ఇండిజీనియస్ పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర' అనే సంస్థతో పొత్తు పెట్టుకున్నారు. త్రిప్విలాండ్ పేరిట వేరే దేశంగా ఏర్పడాలంటూ ఈ సంస్థ దిగ్బంధనం చేస్తే ప్రధాని కార్యాలయ మంత్రి జితేంద్ర సింగ్ అనుమతించారు. పైగా దానికి సమాంతరంగా బిజెపి తరపున కూడా సచివాలయం దగ్గర ఆందోళన చేశారు.

దుష్ప్రచారం..కక్ష సాధింపు..

అన్నిటికంటే ఘోరమేమంటే పేదల ముఖ్యమంత్రిగా దేశమంతా గౌరవించిన మాణిక్‌సర్కార్‌కు అవినీతిని ఆపాదిస్తూ అవాస్తవాలు ప్రచారంలో పెట్టారు. ఆయనను సిబిఐ కేసులో ఇరికించే ప్రయత్నం చేశారు. 'మాణిక్యం కాదు, వజ్రం ఇస్తా'మంటూ ప్రధాని మోడీ తన ప్రచారంలో ఏవో ఇంగ్లీషు అక్షరాలు కలిపి (హైవే, ఇంటర్నెట్, రోడ్స్, ఎయిర్‌వేస్) మాటల గారడి చేశారు. కమ్యూనిస్టు వ్యతిరేక శక్తులన్నీ కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్‌తో సహా బిజెపి జెండా పట్టుకున్నాయి. కేంద్రంలో అధికారాన్ని ఉపయోగించి త్రిపురకు రావలసిన వార్షిక అదనపు సహాయం రు.2000 కోట్లు రాకుండా చేశారు. ఈశాన్య భారతమంతటిలోనూ స్థిరంగా రాజకీయంగా అభివృద్ధి చెందుతున్న త్రిపుర రహస్యమేమిటని ఒకప్పుడు మాణిక్ సర్కార్‌ను ప్రశంసించిన మోడీయే ఆ అభివృద్ధి పాలనను విచ్ఛిన్నం చేసేందుకు నానా వ్యూహాలు అమలు చేశారు. ఈ ఏడాదిలోనే నలుగురు సిపిఎం కార్యకర్తలు కూడా హత్యకు గురయ్యారు. ఎన్నడూ లేనిది ఆ పేద రాష్ట్రంలో ఎన్నికల ఖర్చును కోటానుకోట్లకు పెంచి ధనం గుమ్మరించారు. మీడియా సంస్థలతోనూ అమిత్ షా నేరుగా సమావేశమై మీరు మమ్ముల్ని బలపరిస్తే మేము మీకు అండగా వుంటామని లోబర్చుకోవడం వల్ల వారి కథనాలు జోరుగా ప్రచారమైనాయి. ఎన్నికల సంఘం కూడా వివాదాస్పద నిర్ణయాలు తీసుకోవడం ఫలితాలకు ముందే సిపిఎం దేశం దృష్టికి తెచ్చింది. మీరు ఎవరికి ఓటేసినా కమలం గుర్తుకే వెళతాయని కూడా బిజెపి నేత ఒకరు ముందే ప్రకటించి దొరికిపోయారు. అక్షరాస్యత ఆయు:ప్రమాణం, తలసరి ఆదాయం, రోడ్ల విస్తీర్ణం తదితర అనేక విషయాల్లో జాతీయ సగటు కన్నా కూడా మెరుగైన ఫలితాలు సాధించిన త్రిపుర వామపక్ష ప్రభుత్వం ఇన్ని శక్తుల దాడికి ఒకసారి ఓడిపోయిందన్నది వాస్తవం. అయితే దాని ఓటింగు మాత్రం యాభై శాతం వరకూ అలాగే వుండిపోయింది. అంటే సీట్ల లెక్కలు తారుమారైనా ఓటింగు బలం నిలిచేవుందని తెలుస్తుంది. ఏమైనా ప్రజల తీర్పును గౌరవించి ఈ ఫలితాలను సమగ్రంగా సమీక్షించుకుని దాడుల నుంచి నిర్బంధాల నుంచి కాపాడుకుంటూ ఉద్యమాన్ని ప్రజల ప్రయోజనాలను ఎలా కాపాడుకోవాలనేది త్రిపురలో సిపిఎం వామపక్షాల ముందున్న సవాలు. మరోవైపున అధికారం కోసం అనేక విచ్ఛిన్నకర విద్వేష శక్తులను చేరదీసిన బిజెపి ప్రభుత్వం దానికి మూల్యం చెల్లించవలసి వుంటుంది.

నాగాలోనూ నిగూఢత

మిగిలిన రెండు ఈశాన్య రాష్ట్రాలలోనూ నాగాలాండ్‌లో తన మిత్ర పక్షమైన ఎన్‌డిపిపితో కలసి బిజెపి మంచి ఫలితాలే సాధించినా ఇప్పుడు పెద్ద పార్టీగా వచ్చిన పాలక ఎన్‌పిఎఫ్ కూడా ఎన్‌డిఎలో భాగస్వామిగానే వుంది. కనుక చివరకు ఎలాంటి నిర్ణయం తీసుకునేది చూడాల్సి వుంటుంది. నాగాలాండ్‌లో కూడా శాంతి పేరిట మూల సూత్రాలపై సంతకం చేసిన కేంద్రం అవేమిటో బయిటపెట్టలేదు. అంటే అక్కడ కూడా కొన్ని విచ్ఛిన్నకర శక్తులకు లోపాయికారి అవగాహన వుందని తెలుస్తుంది.

కాంగ్రెస్ పరిస్థితి?

మేఘాలయలో పాలక కాంగ్రెస్ పెద్ద పార్టీ స్థానం నిలబెట్టుకున్నా మెజార్టీకి తక్కువగా వుంది. ఇతరులతో కలసి ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశం చర్చిస్తామని బిజెపి ప్రతినిధులు అప్పుడే చెబుతున్నారు. వాస్తవానికి గోరక్షణ పేరిట చేసిన హత్యల కారణంగా అక్కడ బిజెపితో వున్న వారు కూడా గతంలో దూరమై బాగా తగ్గిపోయింది. అయితే ఎన్‌పిపి నాయకుడు కోనార్డ్ సంగ్మా ఎన్‌డిఎ భాగస్వామి మాత్రమేగాక మణిపూర్‌లో బిజెపితో కలసి ప్రభుత్వంలో వున్నారు. ఇతర పార్టీలకు, స్వతంత్రులకు కూడా స్థానాలు న్నాయి. కాంగ్రెస్‌ను రాకుండా చేయడం కోసం కేంద్రం గవర్నర్ బిజెపి కలసి ఏదైనా చేసే అవకాశం వుండొచ్చు. మణిపూర్ గోవాలలో జాప్యంతో దెబ్బతిన్న కాంగ్రెస్ మేఘాలయకు తమ పార్టీ హేమాహేమీలను పంపిస్తున్నది. ఇది రాసే సమయానికి ఏంజరిగేది ఇంకా స్పష్టత రాలేదు. వాస్తవానికి కాంగ్రెస్ ఎన్నికలపై పెద్ద కేంద్రీకరించిందీ లేదు. కర్ణాటకే మాకు ముఖ్యం అని వారు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తూ వచ్చారు. ఏమైనా ఈశాన్య రాష్ట్రాల్లో పాగా వేయాలన్న బిజెపి వ్యూహం త్రిపురలో పూర్తిగానూ నాగాలాండ్‌లో మిశ్రమంగానూ పలించింది. ప్రధాన పాలకవర్గ జాతీయ పార్టీగా కాంగ్రెస్ స్థానాన్ని బిజెపి ఆక్రమిస్తున్న సూచనల కొనసాగింపుగానే ఈ ఫలితాలు కనిపిస్తున్నాయి.

ఒకప్పుడు కాశ్మీర్‌ను ప్రధాన స్రవంతిలోకి తీసుకు రావాలని బయిలుదేరి తర్వాత పిడిపితో కలసి ప్రభుత్వం ఏర్పాటు చేసిన బిజెపి హయాంలో అక్కడ ఎంతటి ఉద్రిక్తతలు తాండవిస్తున్నది చూస్తున్నాం. మరి ఈశాన్య భారతంలో అలాంటిది పునరావృతమైతే పరిస్థితి ఇంకా దారుణంగా వుంటుంది. ఇటీవల రాజస్థాన్, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, ఒరిస్సా వంటి చోట్ల ఉప ఎన్నికల్లో బిజెపికి తగిలిన ఎదురు దెబ్బల నేపథ్యంలో ఈశాన్య విజయాన్ని ఎక్కువగా చూపినా చెల్లుబాటు కాదు. ఉత్తర మధ్య భారత దేశంలో తన స్థానాల సంఖ్య తగ్గనుండడం, దక్షిణ భారతంలో పెద్దగా విస్తరణావకాశాలు లేకపోవడం వల్ల ఈశాన్యంలోని 25 లోక్‌సభ స్థానాలపై బిజెపి దృష్టి వుంచింది. ఈ ఎన్నికల ఫలితాలలో వామపక్షాలకు తగిలిన ఎదురుదెబ్బ, బిజెపి విజయం, అలాగే ఇతర చోట్ల వివిధ పార్టీల రాజకీయ ప్రయోజనాల పాకులాట... ఇప్పటికే చారిత్రికంగా తీవ్ర ఉపేక్షకూ ఉద్రిక్తతలకు గురైన ఈశాన్య భారతదేశంలో పరిస్థితిని ఇంకా దిగజార్చ రాదని మాత్రం కోరుకోవాలి. అలాంటి కుత్సిత వ్యూహాలను వమ్ము చేసేందుకు మరింత గట్టిగా పోరాడాల్సి వుంటుంది.

సందర్భం

దళితవాడలపై దాడులు ఇంకెన్నాళ్లు!



నేడు చలో గుంటూరు

గత కొద్ది నెలలుగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో దళితులపై దాడులు జరుగుతూనే వున్నాయి. జనవరి 1వ తేదీన పెదగొట్టిపాడులో జరిగినది తాజా ఘటన. ఓవైపు పెత్తందార్ల దాడులు, వివక్ష...మరొకవైపు పోలీసుల నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా వారు నేడు 'చలో గుంటూరు' కార్యక్రమం చేపట్టారు.

ప్రపంచమంతా నూతన సంవత్సర సంబరాలు జరుపుకుంటున్న వేళ గుంటూరు జిల్లా పత్తిపాడు మండలం పెదగొట్టిపాడు దళితవాడ ఒక్కసారిగా ఉలిక్కి పడింది. అగ్రకుల పెత్తందార్లు ట్రాక్టర్లపై కత్తులు, రాడ్లు, రాళ్ళు, కర్రలు, ఖాళీ బీరు సీసాలు వేసుకొని విరుచుకుపడి...అనేకమందిని గాయపరిచారు. ప్రార్థనా మందిరంలో తల దాచుకున్న మహిళలకు లుంగీలెత్తి చూపిస్తూ బూతులు తిడుతూ అవమానపర్చారు. దాడిలో గాయపడిన వారు ఇప్పటికీ గాయాలతో బాధ పడుతున్నారు. వీరిని పరామర్శించడానికి వెళ్లిన వామపక్ష నేతలు, దళిత, గిరిజన, ప్రజా నాయకులను అరెస్టు చేసి దిగ్బంధించారు. అగ్ర కులస్తులు దళితుల్ని సాంఘిక బహిష్కరణకు గురిచేశారు. అయినా ప్రభుత్వంలో కదలిక లేదు.

ఇది దళిత సమస్య మాత్రమే కాదు. మానవ హక్కుల సమస్య. పెత్తందార్ల ఆగడాలకు అడ్డుకట్ట వేయకపోతే గ్రామాల్లో దళితులు, బలహీన వర్గాలతో పాటు పేద, మధ్య తరగతి రైతులు, వత్తిదార్లు కూడా నిలబడలేరు. కాంట్రాక్టర్లు వీరే. మిల్లర్లు వీరే. వడ్డీ వ్యాపారస్తులు వీరే. ఎరువుల షాపులు వీరివే. మార్కెట్ దందా వీరిదే. ఎస్సీ, ఎస్టీలకు దక్కాల్సిన సబ్‌ప్లాన్ నిధుల్నీ వీరే కైంకర్యం చేస్తారు. అయినా దళిత ఎమ్మెల్యేలు, మంత్రులు ఇది అన్యాయమని నోరెత్తి ఒక్క మాట అనలేకపోతున్నారు. తమ రాజకీయ పబ్బం గడుపుకోవడానికి వీరు కూడా అగ్ర కుల పెత్తందార్లకే అండగా ఉంటున్నారు. తమ తోటి సోదరులకు అన్యాయం చేస్తున్నారు. కులాల పేరుతో పెత్తందార్లు ప్రజల మధ్య చీలికలు పెట్టి తమ స్వప్రయోజనాలను కాపాడుకుంటున్నారు. వీరి ఆగడాలకు దళితులతో పాటు ఇతర తరగతుల ప్రజలు నష్టపోతున్నారు. అందుకే దళితులపై దాడుల్ని దళిత సమస్యగా కాకుండా పీడితులందరి సమస్యగా చూసి వారికి మద్దతుగా నిలబడాలి. పెత్తందార్ల ఆగడాలకు అడ్డుకట్ట వేస్తేనే గ్రామాలు ప్రశాంతంగా వుంటాయి.

డిమాండ్లు ...

(1) పెదగొట్టిపాడు దళితులపై దాడి చేసిన ప్రధాన నిందితులను వెంటనే అరెస్టు చేయాలి. ఐపిసి 307, 354 (ఎ), 509 సెక్షన్లతో పాటు ఎస్సీ, ఎస్టీ (పివోఎ) యాక్టు 3 (2) (వి)పై కేసు నమోదు చేయాలి. దళితులపై పెట్టిన అక్రమ ఎదురు కేసును ఎత్తివేయాలి. వారికి ప్రత్యేక పంచాయతీ ఇవ్వాలి.

(2) రాష్ట్ర వ్యాపితంగా దళితులపై సాగుతున్న దాడులను అరికట్టాలి. బాధితులకు పరిహారం చెల్లించాలి.

(3) రాష్ట్ర వ్యాపితంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, అత్యాచార నిరోధక చట్టాన్ని పకడ్బందీగా అమలు పరచాలి.

(5) ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను పక్కదారి పట్టించిన అధికారులపై క్రిమినల్ చర్యలు తీసుకొని, వాటిని సక్రమంగా వినియోగించాలి.

(6) ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలి. దళిత నిరుద్యోగులకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలివ్వాలి.

(7) దళిత క్రైస్తవులపై దాడులను అరికట్టాలి.

(8) గరగపర్రులో వెంటనే దళితులు కోరుకున్న చోట అంబేద్కర్ విగ్రహం నెలకొల్పాలి.

- అంద్ర మాల్యాద్రి
(కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,
సెల్ : 9490300366)

జన వాక్యం

వెలవెలబోతున్న ప్రాచీన నృత్యం



మన దేశం వివిధ కళలకు పుట్టినిల్లు. సంగీతం, సాహిత్యం, నృత్యం వంటి ఎన్నో కళలు పరిఢవిల్లేవి. కానీ పాశ్చాత్య నృత్యాల మోజులో సాంప్రదాయ నృత్యం తుడిచి పెట్టుకు పోయింది. శాస్త్రీయ నృత్యం శరీరానికి వ్యాయామం లాంటిది కూడా. భరతనాట్యం, కూచిపూడి, కథక్, కథకళి, ఒడిస్సీ, మోహినీ అట్టం వంటి ప్రసిద్ధ ప్రాచీన నృత్యాలకు నేడు ఆదరణ కరువైంది. నేర్చుకునే వారితో పాటు నేర్పించే వారి సంఖ్య కూడా తగ్గిపోయింది. పాశ్చాత్యం, పాప్ ఇలా వివిధ రకాలైన ఆధునిక నృత్యాలు వాటి స్థానాన్ని ఆక్రమించాయి. అయినా నృత్యం మొదటి నుండీ సామాన్యులకు చేరువ కాలేదు. పెద్ద కులాల నీడలో పెరిగిందనే చెప్పాలి. అందుకే దానికి ధీటుగా ఆ స్థానంలో కొన్నాళ్లు గిరిజన, జానపద నృత్యాలు రాజ్యమేలాయి. అయితే అగ్రకులాలకు చేరువైన సాంప్రదాయ నృత్యం మాటున అవి రాను రాను మరుగున పడ్డాయి. ప్రభుత్వాల బాధ్యతా రాహిత్యమే ఇందుకు కారణం. దేశంలో ప్రతి రాష్ట్రానికి ఒక సాంప్రదాయ నృత్యం ఉంది. వాటి పరిరక్షణను ఆ రాష్ట్ర ప్రభుత్వాలే తీసుకోవాలి. సంగీతంతో పాటు నృత్యం కూడా ఒత్తిడిని దూరం చేస్తుంది. అందుకే ప్రతి ఒక్కరూ తమ పిల్లలకు బాల్యం నుండే నృత్యకళల పట్ల ఆసక్తి కలిగించాలి. పిల్లలు ఇష్టపడితే నేర్పించే ప్రయత్నం చేయాలి. నృత్యం పట్ల మన వంతు బాధ్యతను నిర్వర్తించాలి.

విజ్జు, ఇమెయిల్ ద్వారా.

రాష్ట్రానికి పొంచి ఉన్న మతోన్మాద ప్రమాదం



జె ప్రభాకర్



మోడీ నాయకత్వాన ఏర్పడిన బిజెపి ప్రభుత్వం నాలుగేళ్ళ పాలనలో మతోన్మాద చర్యలు వేగవంతమయ్యాయి. 2014 ఎన్నికల్లో అభివృద్ధి నినాదంతో ప్రజల ముందుకు వచ్చిన బిజెపి, చేసిన వాగ్దానాలను ఒక్కటి కూడా నెరవేర్చలేదు. ఈ నేపథ్యంలోనే ఆర్ఎస్ఎస్, బిజెపిలు అభివృద్ధి ఎజెండా ముసుగును క్రమంగా తొలగిస్తూ తమ అసలు రంగును బయటపెడుతున్నాయి. ఎన్నికల్లో తమ అభివృద్ధి నినాదం పనిచేయడం లేదన్న అనుమానం వస్తే చాలు! వెంటనే మతపరమైన ప్రచారానికి తెరతీస్తున్నాయి. అభివృద్ధి ముసుగును క్రమంగా తొలగిస్తూ అచ్చమైన మతోన్మాద ఎజెండాను అమలు చేయడానికి పూనుకుంటున్నాయి.

ఇక మన రాష్ట్ర ముఖ్యమంత్రి గారు, మోడీతో కలిసి కేంద్రంలో అధికారం పంచుకున్నారు. రాష్ట్రంలో బిజెపిని తమ ప్రభుత్వంలో చేర్చుకున్నారు. అప్పటి నుండే మతపరమైన కార్యక్రమాల నిర్వహణకు ప్రాధాన్యత ఇవ్వడం పెరిగింది. మత పరమైన సమీకరణల ద్వారా ఉత్తరాదిలో బిజెపి రాజకీయ లబ్ధి పొందినట్లే తాను కూడా లాభ పడాలని ఆయన విశ్వ ప్రయత్నం చేస్తున్నారు. అందుకే మతపరమైన ఉత్సవాలకు రూ.వందలు, వేల కోట్లు ఖర్చు పెడుతున్నారు. రాష్ట్ర ఆర్థికస్థితి అంతంత మాత్రంగా వున్నా మత ఉత్సవాలకు పెద్ద ఎత్తున ప్రజా ధనం ఖర్చు చేస్తున్నారు. దీని వెనుక ఉన్న ఉద్దేశం రాజకీయ ప్రయోజనమే. సాంఘిక ఉద్యమాలు, కమ్యూనిస్టు ఉద్యమాల ప్రభావం మన రాష్ట్ర సంస్కృతిపై బాగా ఉంది. అందుకే ఇప్పటి వరకు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఆర్ఎస్ఎస్, బిజెపిలను రాష్ట్ర ప్రజలు దూరం పెడుతూ వచ్చారు. అయితే విద్యాలయాలు, భక్తి సంఘాల పేరుతో చాప కింద నీరులా ప్రచారం చేస్తున్న ఆర్ఎస్ఎస్ సంస్థలు రాష్ట్రంలో ఏర్పడిన సానుకూల పరిణామాలతో, తమకు దక్కిన దేవాదాయ, ధర్మాదాయ శాఖలను ఆధారం చేసుకొని విజృంభిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న మత కార్యక్రమాలు, మతోన్మాద శక్తులకు మరింత బలం చేకూరుస్తున్నాయి.

ప్రభుత్వ మత కార్యక్రమాలు

దేశంలోనూ, రాష్ట్రంలోనూ మత ఉత్సవాలు సుదీర్ఘ కాలం నుండి జరుగుతున్నాయి. అయితే పెద్ద సంఖ్యలో జనం వచ్చే ఉత్సవాలలో శాంతి భద్రతలు కాపాడటం, పౌర సదుపాయాల కల్పనకే ప్రభుత్వ పాత్ర ఉండేది. కానీ చంద్రబాబు సర్కారు ఆ సాంప్రదాయాన్ని కాదని ప్రభుత్వమే అధికారికంగా ఉత్సవాలను నిర్వహిస్తోంది. 2015లో జరిగిన గోదావరి పుష్కరాలకు వందల కోట్లు ఖర్చు చేసింది. పైగా పుష్కరాలకు తరలి రావాలని, లేకపోతే పుణ్యం దక్కదని ప్రచారం కూడా చేసింది. ఆర్‌టిసి ఉచిత బస్సులు కూడా నడపింది. మరుసటి ఏడాది జరిగిన కృష్ణ పుష్కరాల్లోనూ అదే తంతు కొనసాగించింది. మంత్రులు, అధికారులు యోగా నేర్చుకోవాలని జగ్గీబాబాను తీసుకొచ్చి మూడు రోజులు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించింది. అంతటితో ఆగక ఏకంగా ఇబ్రహీంపట్నం దగ్గర వంద ఎకరాల భూమిని ఆయనకు కట్టబెట్టేందుకు సిద్ధపడింది. పవిత్ర హారతి పేరుతో రాజమండ్రిలో గోదావరికి, రాజధాని పవిత్ర సంగమం దగ్గర అధికారికంగా నిత్య కార్యక్రమాలు నిర్వహిస్తోంది. పాలేకర్ చెబుతున్న గోవు ఆధారిత ప్రకృతి వ్యవసాయానికి అధిక ప్రచారం ఇస్తోంది. అంతేకాక ఆయనకు క్యాబినేట్ హోదా, రాజధానిలో 100 ఎకరాల భూమి కట్టబెడుతోంది. పైగా రాష్ట్రాన్ని ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని ప్రకటిస్తోంది.

మత చిచ్చు

మరోవైపు బిజెపి నేతల చేతుల్లో ఉన్న రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖను ఉపయోగించుకొని ప్రజల మధ్య మత చిచ్చు పెట్టే కార్యక్రమాలకు రాష్ట్ర ప్రభుత్వం పూనుకొంది. దేవాలయ భూములను దశాబ్దాల పాటు సాగు చేసుకుంటున్న ఇతర మతస్తులను భూముల నుండి వెళ్ళగొట్టేందుకు ప్రయత్నిస్తోంది. అందుకే హిందూ దేవాలయ భూములు ఇతర మతాల వారికి కౌలుకు ఇవ్వకూడదని జి.ఓ జారీ చేసింది. గతంలో దుర్గగుడిలో పని చేస్తున్న దళితులను ఉద్యోగానికి అనర్హులు అంటూ తొలగించింది. ఇటీవల తిరుపతిలోని తిరుమల తిరుపతి దేవస్థానంలో ఇతర మతస్థులు ఉద్యోగాలు చేయడానికి అర్హులు కాదంటూ ఆర్డర్లు జారీ చేసింది. చివరకు హైకోర్టు చివాట్లు పెట్టాల్సి వచ్చింది. టిటిడి సహకారంతో ఏటా రూ.వందల కోట్లు ఖర్చు పెట్టి దళిత, గిరిజన ప్రాంతాల్లో హిందూ దేవాలయాలు నిర్మించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.

మరోవైపు కార్పొరేట్ల చేతుల్లో ఉన్న మీడియా, సరళీకరణ ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా ప్రజల్లో ఆందోళనలు రేకెత్తకుండా తమ వంతు పాత్ర పోషిస్తున్నాయి. కొన్ని భక్తి ఛానళ్లు నిరంతరం మత ప్రచారం చేస్తుంటే మరి కొన్ని కార్తీక దీపోత్సవం వంటి ఉత్సవాలను నిర్వహిస్తున్నాయి. గతంలో గుడికి, ఇంట్లోని పూజ గదికి పరిమితమైన దేవుళ్ళను, పండగలను ఆర్ఎస్ఎస్ సంస్థలు రోడ్డు మీదకు తెస్తున్నాయి. అందుకే ఇటీవల ఉత్సవాల హోరు పెరిగింది. ప్రతి పండగ సందర్భంగా ఉత్సవ కమిటీల పేరుతో మత సమీకరణలకు పూనుకొంటున్నాయి. హిందూ సాంప్రదాయ గొప్పతనం అంటూ దేవుణ్ణి, ప్రజల భక్తిని తమ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకొంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వ అధికార ముద్ర, టిటిడి లోగోతో 'హిందువుగా జీవించు, హిందువునని గర్వించు' అంటూ స్టిక్కర్లు వేసి బహిరంగంగా మత విద్వేష ప్రచారాన్ని సాగిస్తున్నారు. మత సామరస్యత నెలకొన్న రాష్ట్రంలో దాడులు చేస్తూ మత ఉద్రిక్తతలు సృష్టిస్తున్నారు. అమలాపురంలో గో సంరక్షణ పేరుతో దళితులపై దాడి చేశారు. రాజమండ్రిలో మసీదులో జరిగిన హత్య, ఖురాన్ దగ్ధం వెనుక మతోన్మాదుల పాత్ర ఉందేమోనన్న అనుమానాలూ వ్యక్తమయ్యాయి. లౌకిక భావాలు కలిగిన రాష్ట్రంలో ప్రజల మధ్య మత విద్వేషాలను రెచ్చగొడుతున్నారు.

బిజెపి మతోన్మాద ఎజెండాతో టిడిపి రాజీ పడుతోంది. గుజరాత్ అల్లర్ల సమయంలో నరేంద్రమోడీని రాష్ట్రంలోకి అడుగుపెట్టనివ్వనన్న చంద్రబాబు గత ఎన్నికల్లో ఆయనతోటే కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించి, అధికారం పంచుకోవడం రాజకీయ అవకాశవాదానికి నిదర్శనం. అందుకే దేశ వ్యాప్తంగా జరుగుతున్న హిందూత్వ గూండాల దాడులను ఖండించడం లేదు. మరో వైపు రాష్ట్రంలోని ప్రతిపక్ష పార్టీ కూడా రాజకీయ ప్రయోజనాల కోసం బిజెపితో అంటకాగడానికి తెగ సంబరపడి పోతున్నది. ఈ విధంగా అధికార, ప్రతిపక్ష పార్టీలను పావులుగా వాడుకొని రాష్ట్రంలో బలపడాలని మతోన్మాద శక్తులు ప్రయత్నిస్తున్నాయి. బిజెపితో కలిసి సాగాలనుకుంటున్న అధికార, ప్రతిపక్ష పార్టీల రాజీ ధోరణి వల్ల రాష్ట్రంలో మతతత్వం పెరగడానికి అవకాశం ఏర్పడుతోంది. ఈ వైఖరి మున్ముందు ఆయా పార్టీలకు నష్టదాయకమే కాకుండా రాష్ట్ర భవిష్యత్తుకు కూడా ప్రమాదకరం. రానున్న మతతత్వ ప్రమాదం పట్ల అభ్యుదయ, లౌకిక శక్తులు అప్రమత్తంగా ఉండాలి. సాంప్రదాయం పేరిట, భక్తి పేరిట జరుగుతున్న విద్వేష ప్రచారాన్ని అడ్డుకొని మన లౌకిక సాంప్రదాయాన్ని కాపాడుకోవాలి.

(రచయిత సెల్ : 9490098433)

వ్యాసాలు, ఉత్తరాలు రాయవల్సిన చిరునామా
editpageps@gmail.com

జీవన the family
ప్రజాశక్తి
jeevanapageps@gmail.com



నా పేరు మహిళ. మహిళంటే ఎవరు? ఏ మహిళ.. అని అంటారా? సూటిగా చెప్పాలంటే.. నేను.. గ్లామర్ రంగానికి చెందిన మహిళను. గ్లామర్ రంగమంటే ఏమిటంటారా? చెప్తా.. సినిమా, టీవి, ఫ్యాషన్, సోషల్ మీడియా, అంటే.. ఫేస్‌బుక్, ట్విట్టర్, వాట్సప్.. యుట్యూబ్, న్యూస్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ ఇలా .. రకరకాల రూపాల్లోగల మహిళను నేను. ఈ రంగాల్లో నేను-నాపాత్ర గురించి, నేను అంతకంతకు ఎదుగుతున్న తీరు గురించి చెప్పాలనుకుంటున్నాను. ముందే చెప్పానుగా.. నేను గడిపేది గ్లామర్ ప్రపంచంలో. ఆ ప్రపంచం ఇప్పటికిప్పుడే పుట్టలేదు. మానవుడు నాగరికత నేర్చిన దగ్గర నుంచీ.. ఆ.. గ్లామర్ ప్రపంచం ఉంది. ఆ ప్రపంచాన నేనూ ఉన్నాను. నా నడకా బహుముఖీనంగా సాగుతూనే ఉంది. అందుకే.. అనాది నుంచి నేటిదాకా ఈ గ్లామర్ ప్రపంచాన.. నేనేమిటో.. నాకు నేనుగానే పరిచయం చేసుకుంటున్నా.

ఆమె పై మీడియా ఫోకస్

ముందే చెప్పాగా. నేను మహిళను. గ్లామర్ అనే పదానికి నేనొక పర్యాయపదం. నిజానికి నన్నంతా ప్రకృతితో పోలుస్తారు. ప్రకృతితో నన్ను పోలుస్తుంటే.. ఎందుకిలా నన్ను పోలుస్తున్నారంటూ.. నేను కనపడిన వాళ్ళనందరినీ అడిగా.. అందరిదీ ఒకేమాట.. ప్రకృతిలో దాగిన రమణీయతంతా మహిళల్లో ఉంది కాబట్టే.. స్త్రీని ప్రకృతితో పోలుస్తారంట. పాపం.. కొందరు మగమహారాజులు తప్పులో కాలేసినట్టున్నారు. ఆమాటకొస్తే.. కొంతమంది మహిళలదీ ఇదే భావన. ప్రకృతిలో ఉన్న రమణీయతనే చూశారుగానీ.. ఆ..ప్రకృతిలో ఉన్న అసలు ధర్మాన్ని చూడలేకపోతున్నారనేది నా భావన.

ప్రకృతి-స్త్రీ


ప్రకృతి అంటే.. రకరకాల శోభలుగల రమణీయత మాత్రమేకాదు.. శతకోటి ప్రాణకోటికి జవసత్వాలిచ్చే ఉత్పత్తి సాధకం. మానవాళి జీవనానికి అవసరమయ్యే గాలి, నీరు, ఫలాలు, వాగులు, వంకలు, పచ్చని చేలు, పశుపక్ష్యాదులు ఇలా అనేకనేకాల ఫలాల సముదాయం. మళ్ళీ చెబుతున్నా.. ప్రకృతి అంటే మానవాళి జీవననాడి. మనిషికి ఆయుష్షు పోసే జీవిక. అంతులేని ఉత్పాదన సంపత్తి. స్త్రీ కూడా ప్రకృతిలాంటిదే కనుక.. ఆమెను ప్రకృతితో పోల్చారుగానీ.. రమణీయతను చూసిమాత్రం కాదు. ఆది నుంచీ ఇలా స్త్రీని పోల్చుకోవడంలోగానీ, స్త్రీ స్వభావాన్ని అంచనా వేయడంలోగానీ నిష్కల్మషమైన వాదన ఎప్పుడూ కనపడేచావదు. ప్రకృతితో నన్ను పోల్చడం కంటే ఎక్కువ నాకేం కావాలని మురిసిపోవాలో.. దాంట్లోదాగిన తేలికపాటి భావనకు నవ్వుకోవాలో తెలియని స్థితే నాది. ఇలా నా గురించి, నా గ్లామర్ గురించి నిజాలు మాట్లాడుకోవాలంటే.. చాలానే మాట్లాడుకోవాలి. తినబోయే ముందు రుచులెందుకు? కొన్ని విషయాలు చెప్పుకునే ముందు.. ఎక్కడ తగ్గాలో అక్కడ తగ్గాలి. ఎక్కడ నెగ్గాలో అక్కడే నెగ్గాలి.

నలుపూ తెలుపు జగుత్తులో!

సినిమాతో నా అనుబంధం ఇప్పటిదికాదు.. కనీసంగా 125 సంవత్సరాలకు పైబడి.. నా సినిమా ప్రయాణం కొనసాగుతూనే ఉంది. అన్నట్టు.. సినిమా కంటే ముందే నా అందచందాల ప్రయాణం మొదలైంది నాటకంతో. నాటకం.. ఇది ఒక ప్రదర్శనకళ. అప్పట్లో.. నాటకాల్లో మహిళలు ఉండేవారు కాదు. పురుషులే స్త్రీ పాత్రలు ధరించేవారు. ఇంట్లోంచి గడపదాటని మహిళల్ని అలా ప్రదర్శనా వస్తువుగా చూపించడం తప్పు. అది భారతీయ సంప్రదాయానికి విరుద్ధం.. అని ఆడపిల్లను తెర వెనుకే ఉంచేవారు. అబ్బో స్త్రీల పట్ల ఎంత గౌరవం.. ఎంత మర్యాద.. అని నేను చాలానే మురిసిపోయాను. కానీ, అనివార్యంగా స్త్రీని నాటక రంగంలోకి ఆహ్వానించక తప్పలేదు. అలా ఇష్టంగానో, అయిష్టంగానో.. నాటకరంగాన.. కాలుడిన స్త్రీ.. ఉజ్వలంగా ఎదిగిన, వెలిగిన వైనాలు చరిత్రలో లేకపోలేదు. సినిమాకు మూలం నాటకమే కదా.. అలా నేను సినిమాల్లోకి అడుగుపెట్టా. ఇక్కడే అసలు కథ మొదలైంది.

వెండితెర తారక

మూకీ నుంచి టాకీ వరకూ.. నా భాగస్వామ్యంలేని సినిమాలేదు. నేను సినిమాలో ఓ..కథానాయికను. కథానాయకుడు హీరోచితమైన యుద్ధాలు చేస్తే.. నేను సుకుమారంగా అడుగులు వేసుకుంటూ.. ఓహోహ్హో.. పావురమా.. అంటూ.. మనసున మల్లెల మాలలు కట్టుకుంటూ.. అలా అలా హంసలా వయ్యారాలు ఒలకబోశా అంతే. వెండితెర ఆరంభంలో నా లెంగ్త్ (నిడివి) అలాంటిది. ఇలా వచ్చి అలా.. తారలా నన్ను మెరిసిపోయేలా చేయడంలో పాతతరం దర్శకులు, నిర్మాతలు చాలానే కష్టపడ్డారు. బహుశా.. అందుకేనేమో నన్ను వెండితెర తారక అని ఎంతో ప్రేమగా పిలుస్తారు. నన్ను చెంగు చెంగున గంతులు వేసే పాత్రల్లోనేకాదు.. స్త్రీ ఔన్నత్యాన్ని, నట విశ్వరూపాన్ని ప్రదర్శించే పాత్రలు చాలానే ఉన్నాయి. అందుకే నేనొక కాంచనమాల, కన్నాంబ, భానుమతి, సావిత్రి.. జమున, శ్రీదేవి, సౌందర్యలా వెండితెరపై వికసించా. అయినా సినిమాల్లో నా ఉనికి ఎప్పుడూ ప్రశ్నార్థకమే. ఎందుకంటే.. భగభగ మండే ఖరీదైన లైట్లన్నీ.. అన్ని జనరేషన్లలోనూ నామీదే పడుతుంటాయి. నాలోని గ్లామర్‌ని వెదికి చూడాలని, చూపించాలని తహతహలాడుతూ ఉంటాయి. పదే పదే గ్లామర్నే ఫోకస్ చేస్తుంటాయి. అదే నాకు నచ్చదు.



క్రియేటివిటీకో దణ్ణం

గ్లామర్ మాట పక్కన పెడితే.. సినిమారంగంలో స్త్రీ భూమిక.. పెరగాలి. కేవలం గ్లామర్ అనే మాటకే పరిమితం కాకుండా పురుషులతో సమానంగా.. ఇరవై నాలుగు విభాగాలు (24 క్రాఫ్ట్)లో తారాస్థాయిలో నేనుండాలి. అఫ్‌కోర్స్.. మాలో బ్రహ్మాండమైన టెక్నీషియన్స్ లేకపోలేదు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గొప్ప టెక్నీషియన్స్‌గా దుమ్ముదులిపిన వాళ్ళూ లేకుండా లేరు. కానీ, ఎందుకనో మేమంటే చులకన. మాకున్న సామర్థ్యంపై తక్కువ భావనతో మా కాళ్ళకు అడ్డుపడకుండా ఉంటే.. వెండితెరపై మా పాత్ర ఇంకా.. ఇంకా మరింత ఎత్తుకు ఎదగగలదనేది నా నమ్మకం. అందుకే.. యాపిల్, బత్తాయిలు, నారింజలు, ద్రాక్ష, గులాబీ గుత్తుల అలంకరణలతో నన్ను క్లోజప్ చేసి చూపించే దర్శకేంద్రులు, నగ్నత్వంలోనే స్త్రీ సాధికారత ఉందంటూ వక్రభాష్యాలు చెప్పుకునే 'క్రియేటివ్ కర్మ'లు మనోచిత్రణ మారితే.. మంచిది. గాడ్.. సెక్స్ అండ్ ట్రూత్, వ్యాంప్, ఐటమ్‌గర్ల్.. స్పెషల్ ఎపిరియన్స్‌లంటూ.. సినిమా అనే ఈ రంగుల ప్రపంచంలో నన్నొక ఆటవస్తువుగా చూడాలని ఆలోచలోంచే.. సినిమా మేథావులనేవారు బయటపడాలని కోరుకుంటూ.. నా సినిమా కథకు శుభం కార్డ్ వేస్తున్నా.

నేనొక గయ్యాళినా?!

వెండితెరకు ప్రత్యామ్నాయంగా బుల్లితెర ఎదుగుతున్నందుకు నేను మిక్కిలి సంతోషపడుతున్నాను. శతకోటి ప్రజలు చెల్లించిన సుంకంతో వేలకోట్లు పెట్టుబడిగా పెట్టి ఆకాశానకెగరేసిన శాటిలైట్ల సాక్షిగా.. ఇంటింటి మాధ్యమంగా ఎదిగిన బుల్లితెర ఆవిష్కరణకు నేనూ తెగ మురిసిపోతున్నా. నిజానికి ఇది మురిపెంకాదు.. ఏడవలేక నవ్వడం అన్నమాట. టెలివిజన్ అనే ఓ వస్తువు.. ఇంటింటి వినోద సాధనంగా మారిన క్రమంలో నన్నొక గయ్యాళిగా మలచుకున్న తీరుకు వెక్కివెక్కి ఏడుస్తున్నా. నాలోని సుకుమారం, నాలోని దాతృత్వం, నాలోని మేధస్సు, నాలోని మానవీయ వైచిత్రితో.. సంబంధం లేకుండా నేనొక గయ్యాళి అత్తగానో, కోడలిగానో.. ఇంకా అనేక రూపాల్లో ఉన్న లేడీవిలన్‌గానో చూపించడమే.. నాకు మింగుడుపడని విషయం. అయ్యా మీ.. రేటింగులు, కరెన్సీ లెక్కల కోసం.. నన్నొక కుతంత్రాల బొమ్మగా మార్చడం ఎంతవరకూ న్యాయం. సృజనాత్మక రాతల పేరుతో సమాజానికి స్త్రీ పట్ల.. వక్రభాష్యాలు చెప్పడమే బాధాకరం. ఏళ్ళ తరబడి జీడిపాకంలా సాగే.. సీరియళ్ళ బుర్రల్లో దాగిన మలినపు ఆలోచనలు మారాలి. ఇదే నేను కోరుకునేది.

సోషల్ మీడియాలో నేను!

నిజానికి భావప్రకటనా స్వేచ్ఛకు వారధి అయిన సోషల్‌మీడియాలో నా పాత్ర గణనీయంగా పెరుగుతోంది. నిర్భయ, మహిళలు దేవాలయ ప్రవేశం, వర్గపోరాటాలు, లైంగిక వేధింపులు, రుతుక్రమం, పాడ్స్ గురించి.. ఇలా అనేక విషయాలపై అరమరికలు లేకుండా మాట్లాడుకునే స్వేచ్ఛకు సోషల్ మీడియా ఒక వేదికవ్వడం శుభపరిణామమే. స్త్రీ సాధికరతకు, భావప్రకటనా స్వేచ్ఛకు, సృజనాత్మకత ఆవిష్కరణకు ఫేస్‌బుక్, ట్విట్టర్, యూట్యూబ్ అనేవి నిజంగానే నాలాంటి ఆధునిక మహిళకు అలాగే ఇంటిపట్టు నుండే గృహిణులకు సైతం దొరికిన అద్భుతమైన వేదికలనే నేను చెప్తాను. కానీ, స్వతంత్రంగా నేను మాట్లాడితే.. ఈ వేదికల ఆసరాగానే కొన్ని మగగొంతుకలు.. ఆదిలోనే మా మహిళా గొంతుల్ని నొక్కే ప్రయత్నాలు చేయడం శోచనీయం.

సోషల్ మీడియాలోనూ నాపై ప్రత్యక్ష, పరోక్షదాడులకు తెగబడటం, మా మహిళలపై నగ్నపువస్తువుతో కథలల్లడం అంతకంతకు పెరుగుతోంది. ఇలాంటి సంకుచిత ఆధిపత్యం తగ్గాలి. అప్పుడే సోషల్ మీడియాలో నాకు నిజమైన స్వేచ్ఛ ఉన్నట్టు. ఎఫ్బీ, వాట్సప్ మెసెంజర్లలో వెంటాడే అశ్లీలాలు, యూట్యూబ్ సినిమాల పేరుతో పెరుగుతున్న నగ్నత్వపు గారడీలు గురించి తలచుకుంటే గుండె తరుక్కుపోతుంది. స్త్రీ అంటే శరీరం కాదు. అమ్మకానికి ఎరవేసే వస్తువూ కాదు. స్త్రీ అంటే.. వెలకట్టలేని వ్యక్తిత్వం. స్వేచ్ఛ పేరుతో నా వ్యక్తిత్వాన్ని భంగపరచడం సమాజానికి మంచిదికాదు. న్యూస్‌పేరుతో.. రేటింగ్ పెంచుకోవడానికి నన్నొక బ్రేకింగ్ వస్తువుగా వాడుకోవడం మంచిది కాదు. లెటజ్ థింక్! లెట్ యూ థింక్!!

సినిమా, టీవి, సోషల్ మీడియా, ట్విట్టర్, వాట్సప్.. వాట్ నాట్?!. మాధ్యమాల స్వరూపం ఏదైనా.. స్త్రీ అనబడే నన్ను.. కేవలం వినియోగవస్తువుగానే చూడొద్దు. నాకొక మెదడుంది.. ఆ మెదడులో నిరంతర సంఘర్షణలూ ఉంటాయి. ఆ సంఘర్షణల్లో.. అమ్మ, అక్క, అమ్మమ్మ, నాన్నమ్మ, చెల్లి, భార్య, స్నేహితురాలు.. ఇలా బహుముఖీన రూపాలెన్నో ఉన్నాయి. మనసుపెట్టి ఆ రూపాల్లో ఉన్న గ్లామర్‌ని వెదకండి. ఇదే నేను కోరుకునేది.

- గంగాధర్ వీర్ల

జీవన సౌరభం

కళాకారిణి ని కళాదృష్టి కోణంలోనే చూడాలి.. లైంగిక దృష్టితో కాదు

మీ కోసం

అన్నం వండేటప్పుడు గంజి వార్చకుండా అత్తెసరు పెడితే పోషకాలు పోవు





జీవన చిత్రం

బిడ్డ ఆకలి తీర్చే తల్లినే చూడాలి!

ఓ భారతీయ మ్యాగజైన్‌పై ఓ తల్లి బిడ్డకు పాలిస్తున్న మోడల్ ఫోటోపై ఈ మధ్యకాలంలో సోషల్‌మీడియాలో పెద్ద చర్చే నడుస్తోంది. కేరళలో ప్రచురణ కాబోతున్న గృహలక్ష్మీ మ్యాగజైన్ కవర్ పేజీపై మాడల్ గిలుజోసఫ్ బిడ్డకు పాలు ఇస్తున్నటువంటి ఫోటో ఉంది. 'భయపడవద్దు, మేం పాలివ్వాలని అనుకుంటున్నాం' అంటూ ఓ తల్లి కేరళకు చెబుతున్నట్లు ఆ ఫోటో కింద ఉంది. మొదటిసారి ఓ భారతీయ మ్యాగజైన్‌లో ఓ మహిళ బిడ్డకు పాలిచ్చే ఫోటోను కవర్ పేజీపై పెట్టారు. కానీ, ఈ మోడల్ తల్లికాదు. ఈ విషయంపై సోషల్‌మీడియాలో పెద్ద చర్చే నడుస్తుంది. 'ఈ మ్యాగజైన్ బహిరంగ ప్రదేశాలలో ఓ తల్లి బిడ్డకు పాలివ్వొచ్చు అనే విషయంపై మహిళల్లో జాగృతి పెంచడానికి చేస్తున్నాం' అని గృహలక్ష్మి సంపాదకులు అంటున్నారు.



నెల క్రితం ఓ వ్యక్తి తన భార్య బిడ్డకు పాలిస్తున్న ఫోటోను ఫేస్‌బుక్‌లో పోస్టు చేశారు. బహిరంగ ప్రదేశాల్లో ఓ తల్లి బిడ్డకు పాలివ్వొచ్చు అనే ఉద్దేశ్యం ఆ వ్యక్తిది. అయితే, ఆ పోస్ట్‌పై కొంతమంది పురుషులు, మహిళలు విమర్శనాత్మకంగా పోస్టులు చేశారు. అందుకనే, ఈ విషయంపై ప్రజల్లో అవగాహన పెంచాలనే ఇలాంటి మ్యాగజైన్ వేశామని మోన్సీ జోసెఫ్ అంటున్నారు. మనదేశంలో చీర కట్టుకునే మహిళలంతా పబ్లిక్ ప్రదేశాల్లో పాలిస్తారు. బ్లౌజ్ సహాయంతో ఇలా చేస్తారు. ఆధునిక సమాజంలో చాలామంది మహిళలు వారికినచ్చిన వస్త్రధారణను ఎంచుకుంటున్నారు. కాబట్టి అలాంటివారికి పిల్లలకు పాలివ్వడం అనేది కష్టతరమే. చాలామంది సోషల్ మీడియాలో ఈ మోడల్‌ను సమర్థించారు.

అదే సమయంలో ఓ తల్లికి ఉండాల్సిన లక్షణాలు ఆమెలో కనపడటంలేదు అంటూ మరికొందరు విమర్శించారు.



అయితే పెళ్లికాని ఓ మోడల్ తో బిడ్డకు పాలిస్తున్నట్లు ఫొటోతీసి వేయడంపై ఇంకొందరు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

మరి ఆ పెళ్లికాని మోడల్స్‌తో బైక్ ఆమె శరీరమన్నట్లు.. పెళ్లి చేసుకునేవాడిని వదిలేసి.. ఓ కంపెనీ షేవింగ్ బ్లేడ్ వాడినవాడినీ.. బ్రాండ్ చెడ్డీ వేసుకున్న వాడినీ చూసి.. వెంటబడి వెళ్లిపోతున్నట్లు.. ఎయిడ్స్ నివారణకు వాడే వాణిజ్య ప్రకటనల్ని ఏమనాలి?

అలాంటివాటిపై విప్పని నోళ్లు ఇప్పుడెందుకు అభ్యంతరం చెప్తున్నాయి? ఇందులోనే బూతు... తప్పు కనిపిస్తున్నాయా? ఒక్కసారి ఆలోచించండి..

పబ్లిక్ ప్రదేశాల్లో ఓ తల్లి బిడ్డకు పాల్విడం అనేది ఓ వివాదస్పదమైన అంశంగా చర్చించారు. అదే సమయంలో 'ఓ తల్లి బిడ్డకు పాల్విడం అనే విషయాన్ని కేవలం బిడ్డ ఆకలి తీరుస్తుందన్న అంశాన్ని మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలి. కానీ, మనదేశంలో దాన్నీ లైంగిక కోణంలోనే చూస్తున్నారు' అంటూ చాలామంది ఆవేదనను వ్యక్తం చేశారు.

గత ఏడాది బ్రెజిల్ పార్లమెంటులో ఓ మహిళా సభ్యురాలు అందరి ముందూ తన బిడ్డకు పాలిచ్చింది. అందులో ఈ లైంగిక కోణాన్ని ఎవ్వరూ చూడలేదు. ఆమె మాతృత్వాన్నే చూశారు. ఎలాంటి పరిస్థితుల్లోనైనా బిడ్డ ఆకలి తీర్చాలనే తల్లిని బాధ్యతనే చూశారు. అదే మనదేశంలో మ్యాగజైన్‌పై బొమ్మ వేసినందుకే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇది దేనికి సంకేతం. మనదేశంలో బహిరంగ ప్రదేశాల్లో పిల్లలకు పాలివ్వాలంటే తల్లులు సంకోచిస్తారు. ఎందుకంటే ఎలాంటి చూపులు ఎదుర్కోవాలో అనే భయం వారిని వెంటాడుతుంది. కానీ, చాలాదేశాల్లో బహిరంగ ప్రదేశాల్లో పాలివ్వడం అనేది మహిళల హక్కు. వెనెజులా, బ్రెజిల్, అమెరికా, ఆస్ట్రేలియా, నేపాల్, ఆఫ్రికా వంటి దేశాలు తల్లిపాలు బహిరంగంగా ఇవ్వొచ్చని చట్టాలూ చేశాయి. ★

సెన్సెక్స్ ⬇ 137
34,046

నిఫ్టీ ⬇ 35
10,458

రూపాయి ⬆ 01 పై॥
అమెరికా డాలరుకు రూ.
65.6



క్రియేటర్స్‌పై యూట్యూబ్ దృష్టి

తెలుగు కంటెంట్ క్రియేటర్స్‌ను ప్రోత్సహించనున్నట్లు యూట్యూబ్ హామీ ఇచ్చింది. హైదరాబాద్‌లోని ఆన్‌లైన్ క్రియేటర్స్‌ను గుర్తించి శనివారం ప్రశంసించింది. ముఖ్యంగా ద్వితీయ శ్రేణి నగరాల నుంచి మరింత మంది ఆన్‌లైన్‌లోకి వస్తున్నారని యూట్యూబ్ ఎంటర్‌టెయిన్‌మెంట్ హెడ్ సత్యరాఘవన్ పేర్కొన్నారు. వీరి కోసం మరింత సమాచారాన్ని పెంచాల్సి ఉందన్నారు.



టాటా 'ఉక్కు' దినోత్సవం

జంషెడ్‌పూర్‌లో టాటా స్టీల్ 179వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టాటా గ్రూపు ఛైర్‌పర్సన్ రతన్ టాటా, టాటా సన్స్ ఛైర్‌పర్సన్ ఎన్ చంద్రశేఖరన్, టాటా స్టీల్ ఎండి, సిఇఒ టివి నరేంద్రన్ హాజరయ్యారు.

అమెరికాలో సంక్షోభం తథ్యమే..!

బిల్‌గేట్స్ హెచ్చరిక



న్యూయార్క్ : అగ్రరాజ్యం అమెరికా ఆర్థిక సంక్షోభ దిశలో ఉందని మైక్రోసాఫ్ట్ అధినేత బిల్‌గేట్స్ అన్నారు. 2008లో వచ్చిన సంక్షోభం లాంటిదే మళ్లీ తలెత్తే అవకాశాలున్నాయన్నారు. "ఆస్క్ మి ఏనీథింగ్" అనే కార్యక్రమంలో బిల్‌గేట్స్ ఈ విషయాన్ని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా పేదరికాన్ని తగ్గించడానికి బిల్ అండ్ మిలిండా గేట్స్ ఫౌండేషన్‌లో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 2008లో వచ్చిన ఆర్థిక సంక్షోభం లాంటిది సమీప భవిష్యత్తులో తలెత్తే అవకాశం ఉందా? అని వినియోగదారుడు ప్రశ్నించగా.. అవును అని చెప్పడం కష్టంగానే ఉన్నప్పటికీ.. సంక్షోభం తలెత్తడం తథ్యమని అన్నారు. అయితే ఆర్థిక సంక్షోభం తలెత్తే అవకాశం ఉందని గేట్స్ చెప్పినప్పటికీ, ఇన్నోవేషన్, క్యాపిటలిజం మరింత మెరుగైతే దాన్ని నుంచి బయటపడటం సాధ్యమవుతుందని గేట్స్ చెప్పారు. ఈ వ్యాఖ్యలను ప్రముఖ పెట్టుబడిదారు వారెన్ బఫెట్ కొట్టిపారేశారు. 2008లో వచ్చిన సంక్షోభంతో 88 లక్షల మంది అమెరికన్లు తమ ఉపాధి కోల్పోయారు. దీంతోపాటు 19 లక్షల కోట్ల డాలర్ల సంపద నష్టపోగా, గహాలు లేనివారి సంఖ్య గణనీయంగా పెరిగింది.

భారీగా ఫేస్‌బుక్ షేర్ల విక్రయం



న్యూయార్క్ : ఫేస్‌బుక్ వ్యవస్థాపకుడు, సిఇఒ మార్క్ జుకర్‌బర్గ్ భారీ ఎత్తున షేర్లను విక్రయించారు. ఫేస్‌బుక్‌లోని సుమారు 500 మిలియన్ డాలర్ల (రూ.31,500 కోట్ల) విలువ చేసే షేర్లను అమ్మేశారు. డిసెంబర్ 2015లో తన భార్య ప్రిస్సిల్లా చాన్ ఏర్పాటు చేసిన ఫౌండేషన్ చాన్ జుకర్‌బర్గ్ ఇనిషియేటివ్ (సీజెడ్‌ఐ)కు విరాళాలు అందించే నిమిత్తం జుకర్ బర్గ్ ఈ నిర్ణయం తీసుకున్నారని తెలుస్తోంది. రాబోయే 18 నెలలో దాదాపు 35 నుంచి 75 మిలియన్ ఫేస్‌బుక్ షేర్లను విక్రయించనున్నట్టు గత సంవత్సరం సెప్టెంబర్‌లోనే జుకర్‌బర్గ్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఫిబ్రవరి చివరి మూడు రోజుల్లో 125.4 మిలియన్ డాలర్ల విలువైన 685,000 షేర్లను విక్రయించారని రాయిటర్స్ ఒక రిపోర్టు వెల్లడించింది. దీంతో మొత్తం ఫిబ్రవరిలో 482.2 మిలియన్ డాలర్ల విలువైన 2.7 మిలియన్ షేర్లను ఆయన విక్రయించారు.

వాణిజ్య యుద్ధానికి దారి..

ట్రంపు నిర్ణయంపై అంతర్జాతీయ సంస్థలు

స్టీల్‌పై భారీ దిగుమతి సుంకంతో నష్టం

అమెరికాకు మంచిది కాదు

డబ్ల్యుటిఒ, ఐఎంఎఫ్‌ల ఆందోళన

జెనీవా : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంపు స్టీల్, అల్యూమినియం దిగుమతులపై భారీ సుంకం విధింపు ప్రతిపాదనపై అంతర్జాతీయ సంస్థల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తోంది. ఈ వ్యవహారంపై అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్), ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఒ) రెండూ ఆందోళన వ్యక్తం చేశాయి. ఈ నిర్ణయం అమెరికా ఆర్థిక వ్యవస్థకు కూడా అంత మంచిది కాదని హెచ్చరించాయి. ట్రంపు యోచన అమెరికా బయటి దేశాలను మాత్రమే కాకుండా ఆ దేశానికి నష్టం చేస్తుందని ఐఎంఎఫ్ అధికార ప్రతినిధి గెర్రీ రైస్ అన్నారు. దీని వల్ల తయారీ, నిర్మాణ రంగాలు దెబ్బ తింటాయని హెచ్చరించారు. తాము వివిధ దేశాల మధ్య ఉన్న వ్యాపార అడ్డంకులు తొలగిపోవాలని కోరుకుంటున్నామన్నారు. వాణిజ్యానికి కావాల్సిన పరిష్కారాలు అవసరమన్నారు. ఈ ప్లాన్‌పై డబ్ల్యుటిఒ కమిటీ అంతకముందే విమర్శలు చేసింది. తాజాగా మరోమారు అంతర్జాతీయంగా చర్చనీయాంశమైంది. ట్రంప్ చేసిన ఈ ప్రకటనతో డౌజోన్స్ ఇండస్ట్రియల్ సూచీ 400 పాయింట్లకు పైగా పడిపోయింది. తాజా వాణిజ్య యుద్ధం సంకేతాలతో ప్రపంచ స్టాక్ మార్కెట్లు మరింత పడిపోయే అవకాశం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ఉక్కు, అల్యూ మినియం ఉత్పత్తులపై దిగుమతి సుంకాలను విధిస్తున్నట్లు అమెరికా ప్రభుత్వం ప్రకటించింది. స్థానిక కంపెనీలు, కార్మికులకు లబ్ధి చేకూర్చే ఆలోచనతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. స్టీల్ దిగుమతులపై 25 శాతం, అల్యూమినియం ఉత్పత్తులపై 10 శాతం సుంకాలను విధించనున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంపు ప్రకటించారు. గురువారం ఉక్కు, అల్యూమినియం కంపెనీల ప్రతినిధులతో భేటీ అయిన అనంతరం విలేకరుల సమక్షంలో ట్రంప్ మాట్లాడుతూ ఇది దీర్ఘకాలం కొనసాగనుందని స్పష్టం చేశారు. సుంకాల విధింపునకు సంబంధించి వచ్చే వారం అధికారిక ఉత్తర్వులు జారీ చేయనున్నామన్నారు. పారిశ్రామిక రంగంలో అమెరికాను మళ్లీ అగ్రస్థానంలో నిలిపేందుకు తాము అన్ని రకాలైన చర్యలు తీసుకుంటామన్నారు. ఇందులోభాగంగానే అల్యూమినియం, ఉక్కు పరిశ్రమలను వెనక్కు తీసుకురావాలని నిర్దేశించుకున్నామని ట్రంపు పేర్కొన్నారు. అంతర్జాతీయ వాణిజ్య యుద్ధాన్ని ఎదుర్కొనలేక ట్రంప్ ఆందోళనతో ఇలాంటి నిర్ణయం తీసుకున్నారని వాల్‌స్ట్రీట్ జర్నల్ వ్యాఖ్యానించింది. ఈ నిర్ణయంపై యూరోపియన్ యూనియన్‌లోని దేశాలతో పాటు చైనా కూడా అభ్యంతరం తెలిపాయి. ఇది అంతర్జాతీయ వాణిజ్యానికి గండి కొట్టే విధంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యవహరించారని యూరో పియన్ స్టీల్ అసోసియేషన్ విమర్శించింది.

డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనపై డబ్ల్యుటిఒ డైరెక్టర్ జనరల్ రాబర్టో అజెవెడో ఆందోళన వ్యక్తం చేశారు. సాధారణంగా డబ్ల్యుటిఒ వాణిజ్య విధానాల్లో జోక్యం చేసుకోదు. కాని ట్రంప్ చేసిన ప్రకటనతో వాణిజ్య యుద్ధం జరిగే ప్రమాదం ఉందంటూ హెచ్చరించింది. ట్రేడ్ వార్ జరుగాలని ఎవరూ కోరుకోవడం లేదని రాబర్టో పేర్కొన్నారు. ఈ పరిస్థితిని తాము సున్నితంగా పరిశీలిస్తున్నామన్నారు. ట్రంప్ నిర్ణయాలపై ఇతరుల స్పందన కోసం వేచి చూస్తున్నామన్నారు.



జియో ప్లాన్లపై క్యాష్‌బ్యాక్ పొడిగింపు


న్యూఢిల్లీ : రిలయన్స్ జియో తన వినియోగదారులకు ఆఫర్ చేస్తున్న '100 శాతం పైగా క్యాష్‌బ్యాక్' తుది గడువును ఆ కంపెనీ పొడిగించింది. మార్చి 15 వరకు ఈ ఆఫర్‌ను ఉపయోగించుకోవచ్చని పేర్కొంది. ఈ ఆఫర్ కింద రూ.398, ఆపై మొత్తాల రీఛార్జ్‌లపై 700 రూపాయల వరకు క్యాష్‌బ్యాక్ యూజర్లకు లభించనుందని తెలిపింది. ఈ క్యాష్‌బ్యాక్ కేవలం జియో ప్రైమ్ మెంబర్లకు మాత్రమే వర్తిస్తుందని తెలిపింది. రూ.398 ఆపై మొత్తాల ప్రతి రీఛార్జ్‌పై 400 రూపాయల విలువైన ఎనిమిది ఓచర్లను కంపెనీ ఆఫర్ చేయనున్నట్లు తెలిపింది.

చేతులు కలిపిన నిప్పన్ స్టీల్, ఆర్సెలర్ మిట్టల్



న్యూఢిల్లీ : ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న ఎస్సార్ స్టీల్‌ను కొను గోలు చేయడానికి జపాన్‌కు చెందిన నిప్పన్ స్టీల్ అండ్ సుమిటోమో మెటల్ కార్పొరే షన్‌తో ఆర్సెలర్ మిట్టల్ భాగస్వామ్యం కుదుర్చు కుంది. నిప్పన్‌తో జాయింట్ వెంచర్ ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఆర్సెలర్ మిట్టల్ తెలిపింది. ఎస్సార్ స్టీల్ భారీ మొండిబాకీలతో దివాలా చట్టం కింద చర్యలు ఎదుర్కొంటుంది. కంపెనీని గాడిలో పెట్టేందుకు ప్రత్యేక ప్రణాళికను ఆర్సెలర్ మిట్టల్ ఇండియా ఫిబ్రవరి 12న అందజేసింది. తమ ప్రణాళికకు గానీ ఎన్‌సిఎల్‌టి ఆమోద ముద్ర వేస్తే నిప్పన్‌తో కలసి ఎస్సార్ స్టీల్‌ను కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు ఆర్సెలర్ మిట్టల్ చైర్మన్ లక్ష్మీ నివాస్ మిట్టల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

క్విజ్



కె.ఎస్ లక్ష్మణరావు,
శాసనమండలి మాజీ సభ్యులు
సెల్ : 9440262072

సామ్రాజ్య నగరం అని దేనికి పేరు?

ఆర్‌ఆర్‌బి/డిఎస్సీ పరీక్షల ప్రత్యేకం

1. నిశ్శబ్ద లోయ (సైలెంట్ వ్యాలీ) ఈ రాష్ట్రంలో ఉంది?
ఎ. అస్సోం బి. అరుణాచల్‌ప్రదేశ్
సి. తమిళనాడు డి. కేరళ

2. ఈ రాష్ట్రం పేరుకు అర్థం బౌద్ధ సన్యాసుల విహారం?
ఎ. అస్సోం బి. బీహార్
సి. ఒరిస్సా డి. బెంగాల్

3. 'యూరప్ ఆట స్థలం' అని పిలిచే దేశం?
ఎ. ఫ్రాన్స్ బి. జర్మనీ
సి. ఇటలీ డి. స్విట్జర్లాండ్

4. 'హెర్మిట్ కింగ్‌డమ్' అని దీనిని పిలుస్తారు?
ఎ. భూటాన్ బి. కెనడా
సి. స్కాట్‌లాండ్ డి. కొరియా

5. 'ప్లే గ్రౌండ్ ఆఫ్ యూరోప్'గా పిలిచే దేశం?
ఎ. స్వీడన్ బి. ఇటలీ
సి. స్విట్జర్లాండ్ డి. యుగోస్లేవియా

6. 'సిటీ ఆఫ్ ప్యాలెసెస్' అని దేనికి పేరు?
ఎ. బెంగుళూరు బి. మైసూరు
సి. గ్వాలియర్ డి. కోల్‌కతా

7. 'స్పైస్ గార్డెన్ ఆఫ్ ఇండియా'గా పిలిచే రాష్ట్రం?
ఎ. ఆంధ్రప్రదేశ్ బి. కేరళ
సి. కర్ణాటక డి. తమిళనాడు

8. ఎటర్నల్ సిటీగా పిలిచే నగరం?
ఎ. న్యూయార్క్ బి. రోమ్
సి. వెనిస్ డి. పారిస్

9. ప్రపంచ పైకప్పు అని దేనిని పిలుస్తారు?
ఎ. రంగూన్ బి. పామీర్స్
సి. కౌలాలంపూర్ డి. ఏథెన్స్

10. 'ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్' అని ఏ భాషను అంటారు?
ఎ. హిందీ బి. తమిళం
సి. తెలుగు డి. సంస్కృతం

11. ది ల్యాండ్ ఆఫ్ మిడ్‌నైట్ సన్ అని ఏ దేశాన్ని అంటారు?
ఎ. జపాన్ బి. నార్వే
సి. థాయిలాండ్ డి. రోమ్

12. బీహార్ దుఃఖదాయనిగా ఏ నదిని పిలుస్తారు?
ఎ. దామోదర్ బి. గోమతి
సి. కోసి డి. యమున

13. 'ల్యాండ్ ఆఫ్ హమ్మింగ్ బర్డ్' అని దేనిని అంటారు?
ఎ. ట్రినిడాడ్ బి. న్యూజిలాండ్
సి. జాంబిబార్ డి. గ్రెనెడా

14. 'రూర్ ఆఫ్ ఇండియా' అని ఏ పీఠభూమిని అంటారు?
ఎ. దక్కన్ బి. ఛోటానాగపూర్
సి. పశ్చిమ కనుమలు డి. గోండ్వానా

15. వ్యాలీ ఆఫ్ ఫ్లవర్స్ అని ఏ రాష్ట్రానికి పేరు?
ఎ. గోవా బి. ఉత్తరాఖండ్
సి. జమ్ము-కాశ్మీర్ డి. మహారాష్ట్ర

16. వెనిస్ ఆఫ్ ద నార్త్ అని దేనినంటారు?
ఎ. బెల్జియం బి. స్వీడన్
సి. ఓస్లో డి. స్టాక్‌హోం

17. కింది వాటిలో తప్పుగా జతపరిచినది ఏది?
ఎ. ఆఫ్రికా కొమ్ము-సోమాలియా
బి. సూర్యుడు అస్తమించే దేశం - అమెరికా
సి. సామ్రాజ్య నగరం - రోమ్
డి. ఏకాంత ద్వీపం- ట్రిస్టాన్ డి కలాన్హా

18. నీలగిరి కొండలను ఇలా కూడా పిలుస్తారు?
ఎ. రాక్ హిల్స్ బి. బ్లాక్ మౌంటెన్స్
సి. బ్లూ మౌంటెన్స్ డి. కోల్డ్ మౌంటెన్స్

19. 'సిటీ ఆఫ్ సెవెన్ ఐలాండ్స్' అని ఏ నగరానికి పేరు?
ఎ. ముంబయి బి. పారిస్
సి. కోచి డి. వార్సా

20. 'బ్రిటన్ ఆఫ్ ద సౌత్' అని దేనిని పిలుస్తారు?
ఎ. ఆస్ట్రేలియా బి. స్వాజిలాండ్
సి. ఫ్రాన్స్ డి. న్యూజిలాండ్

21. భారతదేశపు బుడాపెస్ట్
ఎ. ముంబయి బి. చెన్నయి
సి. బెంగళూరు డి. హైదరాబాద్

22. కింది వానిలో 'వైట్‌సిటీ' అని దేనినంటారు?
ఎ. న్యూయార్క్ బి. ఓస్లో
సి. స్టాన్‌హోం డి. బెల్‌గ్రేడ్

23. 'ల్యాండ్ ఆఫ్ రైజింగ్ సన్' అని దేనినంటారు?
ఎ. డెన్మార్క్ బి. స్వీడన్
సి. జపాన్ డి. నార్వే

24. 'సిటీ ఆఫ్ ఎటర్నల్ స్ప్రింగ్స్' అని దేనినంటారు?
ఎ. కైరో బి. క్విటో
సి. న్యూయార్క్ డి. బెల్‌గ్రేడ్

25. 'టోంగా'ను ఇలా కూడా పిలుస్తారు?
ఎ. క్రిస్టియన్ ఐలాండ్
బి. హవాయ్ ఐలాండ్స్
సి. ఫ్రెండ్లీ ఐలాండ్స్
డి. ఎనిమి ఐలాండ్స్


26. ఎడ్రియాటిక్ మహారాణి అని ఏ నగరానికి పేరు?
ఎ. వెనిస్ బి. న్యూయార్క్
సి. లాసా డి. రోమ్

27. కర్ణాటక సింహద్వారం అని ఏ నగరాన్ని పిలుస్తారు?
ఎ. న్యూ మంగళూరు బి. మైసూర్
సి. షిమోగా డి. బెల్గాం

28. మినీ లండన్ అని ఏ నగరాన్ని పిలుస్తారు?
ఎ. కోల్‌కతా బి. షిల్లాంగ్
సి. చెన్నయ్ డి. రోమ్

29. శ్వేతఖండం అని దేనిని అంటారు?
ఎ. గ్రీన్‌లాండ్ బి. అంటార్కిటికా
సి. ఆస్ట్రేలియా డి. న్యూజిలాండ్

30. 'కీ టుది సౌత్' అని ఏ రాష్ట్రానికి పేరు?



ఎ. తమిళనాడు బి. కర్ణాటక
సి. ఆంధ్రప్రదేశ్ డి. కేరళ

31. 'ల్యాండ్ ఆఫ్ థండర్ డ్రాగన్' అని దేనికి పేరు?
ఎ. భూటాన్
బి. థాయిలాండ్
సి. డెన్మార్క్
డి. హాలెండ్

32. సామ్రాజ్య నగరం అని ఏ నగరానికి పేరు?
ఎ. లండన్ బి. అలెగ్జాండ్రియా
సి. న్యూయార్క్ డి. కైరో

33. 'ల్యాండ్ ఆఫ్ సెట్టింగ్ సన్' అని ఏ దేశానికి పేరు?
ఎ. జపాన్ బి. నార్వే
సి. స్వీడన్ డి. అమెరికా

34. 'బ్యాటిల్ ఫీల్డ్ ఆఫ్ యూరప్' అని దేనికి పేరు?
ఎ. డెన్మార్క్ బి. బెల్జియం
సి. బ్యాంకాక్ డి. ఫ్రాన్స్

35. ఆంధ్రప్రదేశ్‌ను ఈ విధంగా కూడా పిలుస్తారు?
ఎ. ఇండియా యొక్క నారింజ పాత్ర
బి. ఇండియా యొక్క ధాన్యపు పాత్ర
సి. ఇండియా యొక్క అత్యున్నత పాత్ర
డి. ఇండియా యొక్క గోధుమ పాత్ర

36. రోజ్ పింక్ సిటీ అని దేనికి పేరు?
ఎ. జోద్‌పూర్ బి. జైపూర్
సి. కాశ్మీర్ డి. బెంగళూర్

37. సిటీ ఆఫ్ స్కైస్క్రేపర్స్ అని దేనికి పేరు?
ఎ. శాన్‌ఫ్రాన్సిస్కో బి. చికాగో
సి. న్యూయార్క్ డి. వాషింగ్టన్

38. మే 2008లో మయన్మార్ దేశంలో ప్రళయం సృష్టించిన పెను తుఫాను?
ఎ. నిషా బి. నర్గీస్
సి. కత్రినా డి. ఆయెషా

సమాధానాలు : 1.డి, 2.బి, 3.డి, 4.డి, 5.సి, 6.డి, 7.బి, 8.బి, 9.బి, 10.సి, 11.బి, 12.సి, 13.ఎ, 14.బి, 15.బి, 16.డి, 17.సి, 18.సి, 19.ఎ, 20.డి, 21.డి, 22.డి, 23.సి, 24.బి, 25.సి, 26.ఎ, 27.ఎ, 28.బి, 29.బి, 30.సి, 31.ఎ, 32.సి, 33.డి, 34.బి, 35.బి, 36.బి, 37.సి, 38.బి. ★

1. భారత నూతన సొలిసిటర్ జనరల్ పేరేమిటి?
జ : రోహింగ్టన్ నారిమన్.

2. మనదేశంలో అత్యధిక సంఖ్యలో ఉన్న గిరిజన తెగ ఏది?
జ : గోండులు. (వీరి సంఖ్య 40 లక్షలు)

3 యూరప్ ఖండంలో నదిపై లేని ఏకైక రాజధాని నగరం ఏది?
జ : స్పెయిన్ రాజధాని మాడ్రిడ్.

4. దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు పొందిన మొదటి తెలుగు వ్యక్తి ఎవరు?
జ : డా. అక్కినేని నాగేశ్వరరావు

5. ప్రపంచంలో అతి పొడవైన తీర రేఖ కలిగిన దేశం ఏది?
జ : కెనడా. (దీని తీరరేఖ పొడవు 2,02,080 కి.మీ.)

6. బ్రహ్మపుత్ర నదిని అరుణాచల్ ప్రదేశ్‌లో ఏ పేరుతో పిలుస్తారు?
జ : ది హాంగ్

7. గంగానదిని బంగ్లాదేశ్‌లో ఏ పేరుతో పిలుస్తారు?
జ : పద్మానది

8. గంగానది పొడవు ఎంత?
జ : 2,523 కి.మీ.

తెలుసుకోండి..

9. ప్రపంచంలో కెల్లా అతిపెద్ద ఇతిహాసం ఏది?
జ : మహాభారతం. (ఇందులో 74 వేల పద్యాలు, 1.8 లక్షల పదాలు ఉన్నాయి)

10. మహిళలకు ఓటు హక్కు కలిపించిన తొలి దేశం ఏది?
జ : న్యూజీలాండ్.

11 భారతదేశంలో మొదటి 'మున్సిపల్ కార్పొరేషన్'ను ఎక్కడ స్థాపించారు?
జ : మద్రాసులో

12 భారతదేశంలో మొట్టమొదటి 'పట్టణాభివృద్ధి సంస్థ'ను ఎక్కడ ఏర్పాటు చేశారు?
జ : ఢిల్లీలో. (1964)

13 శ్రీహరికోటలోని అంతరిక్ష ప్రయోగ కేంద్రం నుంచి ప్రయోగించిన మొదటి ఉపగ్రహం ఏది?
జ : రోహిణి.

14 భారత అంతరిక్ష పరిశోధనా కేంద్రం (ఇస్రో) మొదటి ఛైర్మన్ ఎవరు?
జ : విక్రం సారభాయ్

15 స్వదేశీ పరిజ్ఞానంతో మనదేశం నిర్మించనున్న అంతరిక్ష నౌక పేరేమిటి?
జ : అవతార్

ఉద్యోగాలు

ఎంఆర్‌పీఎల్‌లో 17 ఖాళీలు

కర్ణాటకలోని మంగళూరులో ఉన్న మంగళూరు రిఫైనరీ అండ్ పెట్రో కెమికల్స్ లిమిటెడ్ (ఎంఆర్‌పీఎల్). 17 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ఇది షెడ్యూల్ 'ఎ' మినీరత్న సెంట్రల్ పబ్లిక్ సెక్టార్ సంస్థ.

పోస్టు-ఖాళీలు: లేబొరేటరీ సూపర్‌వైజర్-7, ఇంజనీర్ (ఫైర్)-1, ఎగ్జిక్యూటివ్-9 (ఫైనాన్స్-8 + ఇంటర్నల్ ఆడిట్-1).

వేతనశ్రేణి: రూ.60,000-రూ.1,80,000.

అర్హతలు: లేబొరేటరీ అసిస్టెంట్‌కు.. ఎంఎస్సీ (కెమిస్ట్రీ)/ తత్సమాన విద్య. అలాగే కెమిస్ట్రీ అనుబంధ (అనలిటికల్/ ఫిజికల్) విభాగాల్లో ఏదో ఒకటి స్పెషలైజేషన్‌గా ఉండాలి, ఇంజనీర్ (ఫైర్)కు.. ఇంజనీరింగ్ బ్యాచిలర్ డిగ్రీ (ఫైర్/ ఫైర్ అండ్ సేఫ్టీ), ఎగ్జిక్యూటివ్‌కు.. డిగ్రీతోపాటు సీఏ/ ఐసీడబ్ల్యూఏ/ ఎంబీఏ (ఫైనాన్స్).

వయసు: 28 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి.

ఎంపిక: రాతపరీక్ష, గ్రూప్ డిస్కషన్/గ్రూప్ టాస్క్, ఇంటర్వ్యూ.

రాతపరీక్ష విధానం: దీన్ని ఆబ్జెక్టివ్ విధానంలో 150 మార్కులకు నిర్వహిస్తారు. ప్రశ్నపత్రంలో మూడు విభాగాలు ఉంటాయి. మొదటి విభాగంలో జనరల్ అవేర్‌నెస్ నుంచి 30, రెండో విభాగంలో సంబంధిత సబ్జెక్టు నుంచి 100, మూడో విభాగంలో ఆప్టిట్యూడ్ (రీజనింగ్, కాంప్రెహెన్షన్, వెర్బల్, నాన్ వెర్బల్..) నుంచి 20 చొప్పున మొత్తం 150 ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష వ్యవధి మూడు గంటలు.

దరఖాస్తు ఫీజు : జనరల్/ ఓబీసీ-రూ.750, మిగిలిన కేటగిరీలకు ఫీజు లేదు. **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్.

దరఖాస్తు చివరి తేదీ: మార్చి 24, 2018.

పూర్తి వివరాలు : వెబ్‌సైట్‌లో చూడొచ్చు

వెబ్‌సైట్: mrpl.co.in

ఐఐఎం లక్నోలో 10 పోస్టులు

లక్నోలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎంఎల్). 10 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు-ఖాళీలు: అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఏవో)-1, ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ ఆఫీసర్ (ఎఫ్ఏఏవో)-1, అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ)-1 (సివిల్), అసిస్టెంట్-2, లోయర్ డివిజన్ క్లర్క్ (ఎల్‌డీసీ)-5.

వేతనం: ఏవో, ఎఫ్ఏఏవో, ఏఈ- రూ.56,100, అసిస్టెంట్-రూ.29,200, ఎల్‌డీసీ- రూ.19,900.

అర్హతలు: సంబంధిత పోస్టులను అనుసరించి ఎంబీఏ/ ఏసీఏ/ ఏఐసీడబ్ల్యూఏ/ ఎంబీఏ/ బీటెక్/ బీఈ/ డిగ్రీ/ మాస్టర్స్ డిగ్రీ. అలాగే నిబంధనల మేర మార్కుల శాతం, ఉద్యోగానుభవం తదితర అర్హతలు ఉండాలి.

వయసు: ఎల్‌డీసీకి 18-30 ఏళ్లు, అసిస్టెంట్-21-35 ఏళ్ల లోపు, మిగిలిన పోస్టులకు 45 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి.

ఎంపిక: పోస్టులను బట్టి రాతపరీక్ష/ స్కిల్ టెస్ట్/ రాతపరీక్ష + ఇంటర్వ్యూ.

దరఖాస్తు ఫీజు: రూ.500, ఎస్సీ/ ఎస్టీ/ వికలాంగులు/ మహిళ అభ్యర్థులకు ఫీజు లేదు. **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్.

దరఖాస్తు చేరడానికి చివరి తేదీ: మార్చి 19, 2018.

పూర్తి వివరాలు : వెబ్‌సైట్‌లో చూడొచ్చు

వెబ్‌సైట్: www.iiml.ac.in

శ్మశాన వాటిక ఆక్రమణను నిరసిస్తూ ధర్నా

ప్రజాశక్తి-భీమవరం రూరల్

పశ్చిమగోదావరి జిల్లా భీమవరం మండలం రాయలంలో దళితుల శ్మశాన వాటికను ఆక్రమించుకోవడం, వ్యతిరేకించిన వారిని అణగదొక్కడానికి 144 సెక్షన్ అమలు చేయడాన్ని నిరసిస్తూ కెవిపిఎస్ ఆధ్వర్యాన దళితులు స్థానిక తహశీల్దార్, ఎంపిడిఒ, ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయాల వద్ద శనివారం ధర్నాలు నిర్వహించారు. అనంతరం తహశీల్దారుకు, ఎంపిడిఒకు, ఎమ్మెల్యేలకు వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కారుమంచి క్రాంతిబాబు మాట్లాడుతూ దళితుల శ్మశాన భూమిని అధికారికంగా వారికే కేటాయించాలని డిమాండ్ చేశారు.

రౌండ్‌టేబుల్ కడపలో శనివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నారాయణ



సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించరా?

రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తల ప్రశ్న

ప్రజాశక్తి - కడపఅర్బన్

రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 8న ప్రవేశపెడుతున్న బడ్జెట్‌లో రాయలసీమ ప్రాజెక్టులకు అధిక నిధులు కేటాయించి పూర్తి చేయాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.నారాయణ డిమాండ్ చేశారు. శనివారం సిపిఎం జిల్లా కార్యాలయంలో రైతు సంఘం ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలసీమలో గాలేను-నగరి, హంద్రీ-నీవా, తెలుగుగంగ, కెసికెనాల్ స్థిరీకరణ, ప్రాజెక్టులకు సరిపడిన నిధులు కేటాయించకపోవడంతో నత్తనడకన పనులు సాగుతున్నాయని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోలవరం, పట్టిసీమ ప్రాజెక్టులపై పెట్టిన శ్రద్ధ సీమలోని పెండింగ్ ప్రాజెక్టులపై పెట్టకపోవడం దారుణమని చెప్పారు. రాయలసీమలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులకు రూ.10 వేలు కోట్లు నిధులు కేటాయించి పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రైతు సంఘం (సిపిఐ అనుబంధం) జిల్లా కార్యదర్శి జి.చంద్ర, రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.దస్తగిరిరెడ్డి, రైతు స్వరాజ్య వేదిక జిల్లా కన్వీనర్ సి.హెచ్.శివారెడ్డి, వ్యవసాయ కార్మి సంఘం జిల్లా కార్యదర్శి అన్వేష్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సునీల్, ఐద్వా నాయకులు జమీల, సుబ్బమ్మ, సిపిఎం నాయకులు సావంత్‌సుధాకర్, పాపిరెడ్డి, రామకృష్ణారెడ్డి, హేతువాద సంఘం జిల్లా కార్యదర్శి సి.ఆర్.వి.ప్రసాద్ పాల్గొన్నారు.

మా గోడు పట్టదా?

- చిత్తూరులో సెల్‌టవర్ ఎక్కిన విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు
- కొనసాగుతున్న నిరవధిక, రిలే దీక్షలు, ఆందోళనలు
- విశాఖలో సమ్మెలోకి దిగిన మీటర్ రీడర్లు




కర్నూలులో దీక్షలనుద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు జిల్లా నాయకులు ఇ.పుల్లారెడ్డి

ప్రజాశక్తి-యంత్రాంగం

12 రోజులుగా సమ్మె చేస్తున్నా, ఆందోళనలు చేస్తున్నా మా గోడు పట్టదా? అంటూ విద్యుత్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, రెగ్యులరైజ్ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ కార్మికులు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఆందోళనలు శనివారం మరింత ఉధృతమయ్యాయి. విశాఖలో మీటర్ రీడర్లు కూడా సమ్మెను ప్రారంభించారు.

చిత్తూరులో కార్మికులు సెల్‌టవర్ ఎక్కారు. తమ సమస్యలు పరిష్కరించేవరకూ కిందకు దిగేది లేదని హెచ్చరించారు. తిరుపతిలో సమ్మె చేస్తున్న కార్మికులకు శ్రామిక మహిళా కార్యదర్శి లక్ష్మి సంఘీభావం ప్రకటించారు. కడప కలెక్టరేట్ ఎదుట నిరవధిక నిరాహార దీక్షలు ఏడోరోజుకు చేరుకున్నాయి. కార్మికుల సమస్యలు పరిష్కరించి సమ్మెను విరమింపజేసేవిధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని విద్యుత్ కాంట్రాక్టు కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు విజయనగరంలో ఎమ్మెల్యే మీసాల గీతను కోరారు. బొబ్బిలిలో సమ్మె శిబిరాన్ని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి టివి రమణ సందర్శించారు. 132 కెవి సబ్‌స్టేషన్ నుంచి బొబ్బిలి కోట వరకు ర్యాలీగా వెళ్లి రాష్ట్ర గనులశాఖా మంత్రి సుజయ్‌కృష్ణ రంగారావు పిఎ వేణుకు లేఖను అందజేశారు. సమ్మెకు మద్దతుగా మీటర్ రీడర్లు విశాఖలో శనివారం నుంచి సమ్మెలో చేరారు. స్థానిక ఎల్ఐసి కార్యాలయం నుంచి జివిఎంసి గాంధీ విగ్రహం వరకూ అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. ఎపిఇపిడిసిఎల్ మీటర్ రీడర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన నిర్వహించిన ఈ కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షులు జిఎస్.రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. తూర్పుగోదావరి జిల్లా కాకినాడ కలెక్టరేట్ వద్ద సమ్మె శిబిరాన్ని సిపిఎం, సిపిఐ, సిపిఎంఎల్ నాయకులతోపాటు, సిఐటియు, మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు సందర్శించి, మద్దతు తెలిపారు. ఈ నెల 4 నుంచి నిరవధిక దీక్షలను ప్రారంభిస్తామని కార్మికులు తెలిపారు. అమలాపురంలో విద్యుత్ శాఖ కార్యాలయాన్ని కార్మికులు ముట్టడించారు. డిఇకి వినతిపత్రం అందజేశారు. రాజమహేంద్రవరం విద్యుత్ శాఖ ప్రధాన కార్యాలయం వద్ద, రాజమహేంద్రవరం రూరల్ బొమ్మూరు సబ్‌స్టేషన్ వద్ద సమ్మె శిబిరాన్ని ప్రజా, కార్మిక సంఘాల నాయకులు సందర్శించి మద్దతు తెలిపారు. మోతుగూడెం ఎపి జెన్‌కో ముఖ్య ఇంజినీరు కార్యాలయం వద్ద రిలే దీక్షలు 11వ రోజుకు చేరాయి. విజయవాడ ధర్నాచౌక్ వద్ద కార్మికులు చీపుర్లు చేతబట్టి రోడ్లు ఊడుస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. గుంటూరు కలెక్టరేట్ ఎదుట దీక్షా శిబిరాన్ని ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు ఆతుకూరి ఆంజనేయులు, షాప్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు సందర్శించి మద్దతు తెలిపారు. సమ్మెలో పాల్గొంటున్న కార్మికుల స్థానంలో కొత్త వారిని నియమించాలనే ప్రయత్నాలు విరమించుకోవాలని లేబర్ జాయింట్ కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఒంగోలులో రిలే దీక్షలు 12వ రోజుకు చేరాయి. దీక్షలకు సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు మద్దతు తెలిపి, మాట్లాడారు. కర్నూలులో ట్రాన్స్‌కో కార్యాలయం ఎదుట 12వ రోజు రిలే నిరాహార దీక్షలను సిపిఎం జిల్లా ఉపాధ్యక్షులు ఇ.పుల్లారెడ్డి ప్రారంభించారు. అనంతపురం జిల్లాలో సమ్మెకు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్ వెంకటేశ్ మద్దతు తెలిపారు.



తిరుపతిలో విద్యుత్ టవర్ ఎక్కిన విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు

కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ జెఎసి మద్దతు

విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమ్మెకు మద్దతుగా ఆందోళన కార్యక్రమాల్ని నిర్వహించాలని రాష్ట్రప్రభుత్వ కాంట్రాక్టు,ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ జెఎసి పిలుపునిచ్చింది. ఈ నెల 5న జిల్లా కలెక్టరేట్ల వద్ద, మున్సిపల్ పట్టణాల్లో నిరసన, ప్రదర్శనలు నిర్వహించాలని ఉద్యోగులకు, సంఘాల నాయకులకు జెఎసి ఛైర్మన్ ఎవి నాగేశ్వరరావు, సెక్రటరీ జనరల్ ఎం బాలకాశీ శనివారం ఒక ప్రకటనలో కోరారు. విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు ఈ నెల 7న నిర్వహించే విద్యుత్ సౌధ ముట్టడిలో పాల్గొని మద్దతు తెలపాలన్నారు. సిఎం చంద్రబాబు వెంటనే జోక్యం చేసుకొని విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల న్యాయమైన సమస్యల్ని పరిష్కరించాలని కోరారు. డిమాండ్ల పరిష్కారం కోసం సమ్మె తీవ్రంగా జరుగుతున్నా విద్యుత్ యాజమాన్యం మొండిగా వ్యవహరించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు.

సమ్మె విరమిస్తేనే చర్చలు

ట్రాన్స్‌కో సిఎండి విజయానంద్

విద్యుత్ కార్మికులు సమ్మె విరమిస్తేనే మరోమారు చర్చలకు అవకాశం ఉందని ట్రాన్‌కో, జన్‌కో సిఎండి విజయానంద్ తెలిపారు. కార్మికులు సమ్మె ప్రారంభించి 12 రోజులు పూర్తవడంతో సమస్య పరిష్కారానికి యాజమాన్యం తీసుకుంటున్న చర్యలపై 'ప్రజాశక్తి' వివరణ కోరగా కార్మికులతో మంత్రి కళా వెంకట్రావు సమక్షంలో గతంలో చర్చలు జరిగాయన్నారు. కార్మికులు ఇప్పటికైనా సమ్మె విరమిస్తే చర్చలు జరిపేందుకు యాజమాన్యం సిద్ధంగా ఉందన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్లను ముట్టడిస్తాం

ఏలూరు రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చకపోతే విద్యుత్ సబ్ స్టేషన్లను ముట్టడిస్తామని పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులో శనివారం జరిగిన అఖిలపక్ష రాజకీయ పార్టీల రౌండ్‌టేబుల్ సమావేశం హెచ్చరించింది. కలెక్టరేట్ ప్రాంగణంలో విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమ్మె శిబిరం వద్ద ఐక్య వేదిక ఆధ్వర్యాన వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలతో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం అప్‌ల్యాండ్ జిల్లా కార్యదర్శి చింతకాయల బాబూరావు, సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ నెక్కంటి సుబ్బారావు, వైసిపి నియోజకవర్గ కన్వీనర్ మధ్యాహ్నపు ఈశ్వరీబలరాం, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి ప్రసాద్ మాట్లాడుతూ 5 నుంచి ఐక్యవేదిక ఆధ్వర్యాన నిరవధిక నిరాహార దీక్షలను చేపట్టనున్నట్లు తెలిపారు.



బుద్ధవరం శివారు రాజీవ్ కాలనీలో ఆందోళన చేస్తున్న నిరుపేదలు

రాజధానిలో స్థలాలివ్వాలని రైతుల ఆందోళన

ప్రజాశక్తి-గన్నవరం (కృష్ణా)

విమానాశ్రయ విస్తరణలో పోరంబోకు, బంజరు భూములు కోల్పోతున్న సాగుదార్లకు భూసమీకరణలో భాగంగా రాజధానిలో స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శనివారం కృష్ణాజిల్లా గన్నవరంలోని బుద్ధవరం శివారు రాజీవ్‌కాలనీ వద్ద రైతులు ఆందోళన చేశారు. అర్‌అండ్‌బి రోడ్డుపై బైఠాయించి, వాహనాలను నిలిపివేసి రెవెన్యూ అధికారుల వైఖరి పట్ల నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సాగుదార్లకు సిపిఎం, సిపిఐ, వైసిపి నాయకులు మద్దతు తెలిపారు. అనంతరం సిపిఐ జిల్లా కార్యదర్శి అక్కినేని వనజ మాట్లాడుతూ.. రాష్ట్రంలో చంద్రబాబు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పేదలు, దళితుల సాగు భూములను బలవంతంగా లాక్కునే పనిలో ఉన్నారన్నారు. బంజరు, చెరువు భూములు సాగు చేసుకుని బతికే వారికి పరిహారం ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బుద్ధవరం పంచాయతీలో రైతులు చాలా కాలం పోరాటం చేయడం వల్లే ఎకరానికి రూ.కోటి వరకు పరిహారం పొందగలిగారని చెప్పారు. సిపిఎం మండల నాయకులు బడుగు మరియదాసు మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములు సాగు చేసుకునే వారికి ఎలాంటి పరిహారమూ ఇవ్వబోమని రెవెన్యూ అధికారులు చెప్పడం చట్ట వ్యతిరేకమన్నారు. కార్యక్రమంలో వామపక్ష, వైసిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



కడపలో ధర్నా నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజలను మోసం చేసిన బిజెపి, టిడిపి

సిపిఎం రాయలసీమ సబ్‌కమిటీ కన్వీనర్ ఓబులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (కడప)

కేంద్రం, రాష్ట్రంలో అధికారంలో ఉన్న బిజెపి, తెలుగుదేశం కలిసి ఆంధ్ర రాష్ట్ర ప్రజలను మోసం చేశాయని సిపిఎం రాయలసీమ సబ్ కమిటీ కన్వీనర్ ఓబులు విమర్శించారు. ప్రత్యేక హోదా కోసం తహశీల్దార్ కార్యాలయం ఎదుట అఖిలపక్షం ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విభజన చట్టంలో కడపలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని, రాష్ట్రానికి రైల్వేజోన్, రాయలసీమకు ప్రత్యేక నిధులు ఇస్తామని ఇచ్చిన ఏ ఒక్క హామిని నిలబెట్టుకోలేదన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఐదేళ్లు సరిపోదని, పదేళ్లు ఇవ్వాలని ఆ నాడు చెప్పిన రెండు ప్రభుత్వాలు ఇప్పుడు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది ప్రజల్ని మోసం చేయడమేనని పేర్కొన్నారు. అభివృద్ధి విషయంలో రాష్ట్రం 15 సంవత్సరాలు వెనక్కినెట్టవేయబడిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు మేల్కొని మోసపూరితమైన ప్రకటనలు ఆపి ప్రత్యేక హోదా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో సిపిఎం ప్రొద్దుటూరు డివిజన్ కార్యదర్శి సత్యనారాయణ, బిఎస్‌పి కన్వీనర్ గుర్రప్ప, లోక్‌సత్తా నాయకుడు మనోహర్, మాలమహానాడు నాయకులు ఇమ్మానుయేల్ తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడి చేస్తే తెలంగాణ, మహారాష్ట్ర మార్కెట్లకు వెళ్తాం

ఈ-నామ్‌పై సమావేశంలో స్పష్టం చేసిన వ్యాపారులు

ప్రజాశక్తి-గుంటూరు సిటీ ప్రతినిధి

గుంటూరు మిర్చి యార్డులో ఈ-నామ్ అమలుపై ప్రతిష్టంభన కొనసాగుతోంది. ఈ-నామ్‌ను అమలు చేయాల్సిందేనని జిల్లా కలెక్టర్ కోన శశిధర్ శుక్రవారం స్పష్టం చేసిన నేపథ్యంలో మిర్చి ఎగుమతి, దిగుమతి అసోసియేషన్లు, లైసెన్స్ వ్యాపారులతో జెడి రామాంజనేయులు, సెక్రటరీ శ్రీనివాస్ శనివారం సమావేశమయ్యారు. అయితే ఈ-నామ్‌పై ఏ నిర్ణయమూ తీసుకోకుండానే సమావేశం ముగిసింది. కాగా రాష్ట్ర ప్రభుత్వం గట్టిగా ఒత్తిడి చేస్తే ఈ-నామ్ లేని తెలంగాణ, మహారాష్ట్ర మార్కెట్లకు వెళతామని వ్యాపారులు స్పష్టం చేశారు. ఈ-నామ్ అమలుకు తాము వ్యతిరేకం కాదని, ముందు అందుకు అవసరమైన సదుపాయాలన్నీ కల్పించాలని వ్యాపారులు కోరారు. ఆసియాలోనే అతిపెద్ద మార్కెట్ యార్డు అయిన మిర్చియార్డులో ఈ-నామ్ అమలు వల్ల చాలా ఇబ్బందులు తలెత్తుతాయని, ఏ రోజుకు ఆరోజు రైతుకు డబ్బులు చెల్లించాలంటే చాలా కష్టమని వ్యాపారులు చెప్పారు. ఈ-నామ్ అమలు చేసేటట్లయితే తమ దగ్గర డబ్బు ఉన్నంతవరకే కొనగలమని, ప్రతిరోజూ యార్డుకు రూ.40 కోట్ల సరుకు వస్తుందని, ఈ-నామ్‌లో రూ.10 కోట్ల సరుకు కంటే ఎక్కువ కొనలేమని వ్యాపారులు పేర్కొన్నారు. ఈ అంశాలన్నీ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి మరోసారి సమావేశమవుతామని చెప్పి అధికారులు సమావేశాన్ని ముగించారు.

ప్రజా రవాణాను ధ్వంసం చేసే కుట్ర

ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో/ఒంగోలుటౌన్

మోటారు వాహనాల చట్ట సవరణ బిల్లు పేరుతో ప్రజా రవాణా వ్యవస్థనే ధ్వంసం చేసేందుకు కేంద్రం కుట్ర పన్నుతోందని ఆర్టీసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు ఎస్‌కె జిలానీ బాషా, ప్రధాన కార్యదర్శి సిహెచ్ సుందరయ్య, ప్రచార కార్యదర్శి ఎం అయపరెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బడ్జెట్‌లో 58 ఆర్టీసిలకు రూ.30 వేల కోట్లు కేటాయించాలని కోరితే ఒక్క రుపాయి కూడా కేటాయించలేదన్నారు. ఇబ్బందుల్లో ఉన్న ఆర్టీసిని ఆదుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని, మంత్రి చెప్పినట్లుగా బడ్జెట్‌లో రూ.900 కోట్లు ఆర్టీసికి కేటాయించినా అవి ఏ మాత్రమూ సరిపోవన్నారు. తొలగించిన కండక్టర్లు, డ్రైవర్లను విధుల్లోకి తీసుకోవాలని, గతంలో ఇచ్చిన హామీ మేరకు సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా రవాణా వ్యవస్థ సక్రమంగా నడిచేందుకు, ప్రయాణికులకు మెరుగైన సేవలందించేందుకు వెంటనే నియామకాల్ని చేపట్టాలన్నారు. ఎంవి చట్ట సవరణ బిల్లు ఆర్టీసిలకు ఉన్న ప్రత్యేక హక్కుల్ని హరించి వేస్తుందని, ఇది ప్రజా వ్యతిరేకమని, కార్పొరేట్ల కోసమేనని వారు తెలిపారు. సంస్థలో ఉద్యోగ భద్రత కొరవడిందని, విధి నిర్వహణలో డ్రైవర్లు మృతి చెందుతున్నారని పేర్కొన్నారు. సర్వీసు నిబంధనల్ని సవరించి ఆర్టీసిలో ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. వేతన ఒప్పందంతో పాటు సర్వీసు కండీషన్ల ఒప్పందం జరిగేందుకు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

దీక్షల భగ్నం అప్రజాస్వామికం

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

రాష్ట్రానికి ప్రత్యేకహోదా సాధన కోరుతూ వామపక్షాలు, ప్రజాసంఘాలు చేపట్టిన రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని ప్రభుత్వ యంత్రాంగం భగ్నం చేయడం అప్రజాస్వామికమని వామ పక్షాల నాయకులు అన్నారు. ప్రజాస్వామ్య బద్ధంగా, శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును కాలరాసే అధికారం పోలీసులకు ఎవరి చ్చారని ప్రశ్నించారు. శ్రీకాకుళంలో శనివారం విలేకరుల సమావేశంలో సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు భవిరి కృష్ణమూర్తి, సనపల నర్సింహులు, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు ఎన్.నీలంరాజు మాట్లాడారు.

ప్రజ్ఞ

జవాబులు

1.ఉత్తరాఖండ్‌లోని రిషికేశ్ (మార్చి 1న)
2.చండీఘర్
3.కర్ణాటక
4. హైదరాబాద్ ఐఐటీలో
5. 2018 మార్చి 1న

హోదా కోసం రెండోరోజూ దీక్షలు

జిల్లా, మండల కేంద్రాల్లో సాగిన నిరసనలు, రాస్తారోకోలు, ధర్నాలు

ప్రజాశక్తి-యంత్రాంగం

రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని, విభజన చట్టంలోని హామీలను అమలు చేయాలని రాష్ట్ర వ్యాప్తంగా వామపక్షాలు చేపట్టిన రిలే నిరాహారదీక్షలు శనివారం నాటికి రెండోరోజుకు చేరాయి. అన్ని జిల్లా, మండల కేంద్రాల్లో దీక్షలు నిర్వహించారు. రాస్తారోకోలు, ధర్నాలు, ప్రదర్శనలు, రౌండ్‌టేబుల్ సమావేశాలు నిర్వహించారు. ఆయా జిల్లాల్లో వైసిపి, కాంగ్రెస్ పార్టీలు, ప్రజాసంఘాలు సంఘీభావం తెలిపాయి. విశాఖ జిల్లాలో. పలుచోట్ల రాస్తారోకోలు, ధర్నాలు నిర్వహించారు. అరకులోయలో సిపిఎం నేతలు అర్ధనగ్నంగా దీక్ష శిబిరంలో కూర్చున్నారు. దేవరాపల్లిలో మోకాళ్లపై నిరసన చేపట్టారు. తూర్పుగోదావరి జిల్లా తాళ్లరేవులో తహశీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన సామూహిక నిరాహార దీక్షలను డిసిసిబి ఉపాధ్యక్షులు దున్నా జనార్ధనరావు ప్రారంభించారు. స్థానిక ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు మద్దతు తెలిపి మాట్లాడారు. ఏలేశ్వరంలో సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ ఆధ్వర్యంలో భారీ మోటార్‌సైకిల్ ర్యాలీ నిర్వహించారు. పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులో రెండో రోజు రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి. దీక్షలను సిపిఎం అప్‌ల్యాండ్ జిల్లా కార్యదర్శి చింతకాయల బాబూరావు, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ అధికార ప్రతినిధి యు.వెంకటేశ్వరరావు, ఎంసిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజు, సిపిఐ నగర కార్యదర్శి పి.కన్నబాబు సంయుక్తంగా ప్రారంభించారు. వైసిపి నేతలు మద్దతు తెలిపారు. కృష్ణా జిల్లాలో వామపక్షాల ఆధ్వర్యంలో రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. విజయవాడలో ఎన్ఎఫ్ఐడబ్ల్యు, ఐద్వా నగర కమిటీల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు దోనేపూడి శంకర్, మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి, ఐద్వా జిల్లా కార్యదర్శి శ్రీదేవి, కార్పొరేటర్ గాదె ఆదిలక్ష్మి పాల్గొన్నారు. గుంటూరు జిల్లాలోని మండల కేంద్రమైన నూజెండ్లలో సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ప్రధాన కూడలిలో విద్యార్థులతో మానవహారం ఏర్పాటు చేశారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో అఖిలపక్షం ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద డివైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి జయచంద్ర ఆధ్వర్యంలో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. సిపిఎం, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో కడప జిల్లాలోని ప్రొద్దుటూరు, మైదుకూరు, రైల్వేకోడూరు, పోరుమామిళ్లలో ర్యాలీలు నిర్వహించారు. శ్రీకాకుళం, విజయనగరం, కర్నూలు జిల్లాల్లోని అన్ని మండల కేంద్రాల్లోనూ దీక్షలు చేశారు.



దీక్షలనుద్దేశించి మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర నాయకులు రామాంజనేయులు

విషజ్వరాలు

పడగవిప్పిన విషజ్వరాలు

- తూర్పు మన్యంలో నెల రోజుల్లో 8 మంది గిరిజనుల మృతి
- వైద్య సిబ్బంది పనితీరుపై ఎమ్మెల్యే రాజేశ్వరి ఆగ్రహం

ప్రజాశక్తి-మారేడుమిల్లి/రాజమహేంద్రవరం ప్రతినిధి

తూర్పు మన్యంలో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. గతేడాది జూన్‌లో వై.రామవరం మండలం ఎగువ ప్రాంతమైన బొడ్డగండి పంచాయతీ చాపరాయిలో ఒకే నెలలో 16 మంది గిరిజనులు మలేరియా బారినపడి మృతి చెందడం దేశవ్యాప్తంగా కలకలం రేపింది. తాజాగా వై.రామవరం మండలం కానివాడ పంచాయతీ పరిధిలో ఎనిమిది మంది గిరిజనులు నెల రోజుల వ్యవధిలోనే విషజ్వరాలతో మృతిచెందారు. సుమారు 200 మందికిపైగా విషజ్వరాలతో బాధపడుతున్నారు. ఊట్లబందకు చెందిన పల్లాల పండురెడ్డి(50), పల్లాల బున్నమ్మ(39), పల్లాల తెల్లమ్మ(40), పల్లాల కొమ్మిరెడ్డి(70), పెదమళ్ల పల్లాల కురసారెడ్డి(40), పల్లాల పాప(2), గొప్పులతోటమామిడికి చెందిన సందుల కామేశ్వరరెడ్డి(45)తోపాటు మరొకరు మృత్యువాతపడ్డారు. ప్రతి ఇంటిలో ఇద్దరు నుంచి ముగ్గురు విషజ్వరాలతో బాధపడుతున్నారు.

వైద్య సిబ్బందిపై ఎమ్మెల్యే రాజేశ్వరి ఆగ్రహం

మలేరియా, విషజ్వరాల బారినపడి గిరిజనులు మృతి చెందుతున్నా వైద్య సిబ్బంది పనితీరు సక్రమంగా లేదని ఎమ్మెల్యే రాజేశ్వరి ఆగ్రహం వ్యక్తం చేశారు. కానివాడ పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో శనివారం ఆమె పర్యటించారు. మృతుల కుటుంబాలను పరామర్శించిన అనంతరం జ్వరాలతో బాధపడుతున్న వారిని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గతేడాది చాపరాయిలో సంఘటన మరువకముందే మరొక ఘటన చోటు చేసుకోవడం బాధాకరమన్నారు. ఎప్పటికప్పుడు సమాచారం అందజేసేందుకు అప్పట్లో ఎపి ఫైబర్ గ్రిడ్ సమాచార వ్యవస్థను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. అయినప్పటికీ గిరిజనులు మృత్యువాత పడుతున్నా సంబంధిత వైద్యసిబ్బంది సమాచారం అందించకపోవడం పట్ల ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదనపు జిల్లా వైద్యాధికారి అప్పారావుకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం అక్కడ వైద్య సిబ్బంది మూడు బృందాలుగా ఏర్పడి ఆయా గ్రామాల్లో పర్యటించి సర్వే చేశారు. జ్వరపీడితులను గుర్తించి, రక్తపరీక్షలు నిర్వహించారు. జ్వరాలతో బాధ పడుతున్న వారిని మారేడుమిల్లి, రంపచోడవరం ఏరియా ఆసుపత్రులకు తరలించి మెరుగైన వైద్యసేవలను అందిస్తామని వైద్యులు తెలిపారు.



ఊట్లబందలో జ్వరపీడితులను పరామర్శించిన ఎమ్మెల్యే, అదనపు జిల్లా వైద్యాధికారి

మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి : బాబూరావు

తూర్పుగోదావరి జిల్లా వై.రామవరం మండలం ఊట్లబంద తదితర గ్రామాల్లో విషజ్వరాల బారినపడి మృతి చెందిన ఒక్కో ఆదివాసీ కుటుంబానికి రూ.10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు మిడియం బాబూరావు, సిపిఎం రాజమహేంద్రవరం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. మన్యంలో తక్షణం వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలన్నారు. ఆదివాసీలందరికీ రక్షిత, తాగునీరు, పౌష్టికాహారం అందించాలన్నారు.

సంక్షిప్తం

టిడిపి దుష్ప్రచారాన్ని తిప్పికొడతాం

బిజెపి రాష్ట్ర శాసన సభాపక్షం నిర్ణయం

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సహా ఆ పార్టీ ఎంపిలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని బిజెపి రాష్ట్ర కోర్ కమిటీ నిర్ణయించింది. విశాఖలోని ఓ హోటల్‌లో బిజెపి శాసన సభాపక్ష నేతల సమావేశం శనివారం జరిగింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపి కంభంపాటి హరిబాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశం పలు నిర్ణయాలను తీసుకుంది. బిజెపిపై బురద చల్లేందుకు టిడిపి చేస్తున్న ప్రయత్నాలపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇప్పటి వరకు బిజెపి రాష్ట్రానికి ఏం చేసిందీ, ఇంకా చేయబోయే విషయాలను అసెంబ్లీలో ప్రస్తావించనున్నారు. కేంద్రం నుంచి ఏ రాష్ట్రం సాధించనన్ని నిధులు తెచ్చినట్లు గతంలో చంద్రబాబు చేసిన విషయాలను ప్రస్తావించాలని బిజెపి భావిస్తోంది. దాదాపుగా నాలుగు గంటలపాటు రాష్ట్ర రాజకీయ పరిణామాలు, మిత్రపక్షంగా ఉన్న టిడిపి చేస్తున్న వ్యాఖ్యలను ఎలా తిప్పికొట్టాలన్న విషయమై చర్చించారు.

మెగా జాబ్‌మేళాలో 501 మంది ఎంపిక

ప్రజాశక్తి-పెద్దాపురం (తూర్పుగోదావరి)

తూర్పుగోదావరి జిల్లా పెద్దాపురం మండలం దివిలి కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాలో 501 మంది అభ్యర్థులు ఎంపికయ్యారు. జాబ్‌మేళాను కళాశాల ఛైర్మన్ బేతినీడి శ్రీనివాసరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. సభలో జిల్లాపరిషత్ ఛైర్మన్ జ్యోతుల నవీన్‌కుమార్ మాట్లాడుతూ ఉన్నత చదువులు చదివిన ప్రతి ఒక్కరికీ ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఈ జాబ్‌మేళాలు దోహదపడతాయన్నారు. అనంతరం ఎంపికైన అభ్యర్థులకు ఆయన నియామక పత్రాలు అందజేశారు. వికాస్ పిడి వివిఎన్ రావు, హెచ్‌ఆర్ లచ్చారావు, కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ రామకృష్ణ, శ్రీకాంత్, ఎఒ సందీప్, ఇఒ జెన్నీబాబు తదితరులు పాల్గొన్నారు.

ముంబయిలో భారీ అగ్ని ప్రమాదం

ముంబయి : ముంబయిలోని పలు వస్త్రాల, రసాయనాల తయారీ కర్మాగారాలకు కేంద్రమైన సబర్బన్ అంధేరి ప్రాంతంలో అగ్ని ప్రమాదం సంభవించినట్లు సీనియర్ అధికారి శనివారం వెల్లడించారు. ఈ ప్రమాదంలో భారీగా నష్టం సంభవించిందని భావిస్తున్నారు. శుక్రవారం రాత్రి 11.45 సమయంలో అసల్ఫా గ్రామంలోని ఒక కర్మాగారం లోని ఒక యూనిట్లో రేగిన మంటలు పక్కనే ఉన్న పలు యూనిట్లకు వ్యాపించడంతో పెద్ద ఎత్తున ప్రమాదం చోటుచేసుకుందని అధికారులు తెలిపారు. మంటలను అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని ముంబయి మునిసిపల్ కార్పోరేషన్ అధికారులు తెలిపారు. ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదని, అయితే ఎన్ని యూనిట్లు మంటల్లో చిక్కుకున్నాయో ఇప్పుడే చెప్పలేమని విపత్తు నిర్వహణ అధికారి ప్రకటించారు.

అగ్నికి ఆహుతి

ముంబయి శివారు ప్రాంతంలోని అంధేరిలో సంభవించిన అగ్ని ప్రమాదంతో ఎగిసిపడుతున్న మంటలు, అలుపుకున్న పొగ



రాజస్తాన్‌లో ఇద్దరు దళితుల హత్య

జైపూర్ : రాజస్తాన్‌లో శనివారం వేరువేరు ఘటనల్లో ఇద్దరు దళితలు హత్యకు గురయ్యారు. ఇందులో ఒక టీనేజ్ బాలుడు కూడా వున్నాడు. అల్వార్‌జిల్లా భివాడి పట్టణంలో హోళి సందర్భంగా శుక్రవారం 16 ఏళ్ళ నీరజ్ జతవ్ అనే దళిత బాలుడ్ని కొట్టి చంపారు. హోలీ వేడుకల్లో రెండు వర్గాల మధ్య హోళి రంగు పులుముకునే విషయమై ప్రారంభమైన ఘర్షణ జతవ్‌పై దాడికి దారితీసిందని భివాడి అడిషనల్ పోలీసు సూపరింటెండెంట్ పుష్పేంద్ర సింగ్ సోలంకి తెలిపారు. మధ్యాహ్నం 3 గంటల సమ యంలో తోటి దళితులతో కలిసి హోలీ ఉత్సవాలు జరుపుకుంటున్న జతవ్‌పై మరో వర్గానికి చెందిన వారు దాడి చేశారని ఆయన చెప్పారు. ఒక వర్గం వారు అవతలి వారిపై రంగులు చిమ్మడంతో వివాదం చోటు చేసుకున్నదని ఆయన చెప్పారు. ఈ ఘటనలో నిందితుడు జతవ్ తోటి వాడేనని తెలిపారు. నిందితుడు తన వర్గం వారితో కలిసి జతవ్‌పై దాడి చేయడంలో అతనికి తీవ్ర గాయా లయ్యాయి. వెంటనే జతన్‌ను అసుపత్రిగా తరలించగా అక్కడ చని పోయినట్లు వైద్యులు చెప్పారని పోలీసులు తెలిపారు. జతవ్ కుటుంబ సభ్యులు మాత్రం అతనిపై కర్రలతో దాడి చేసినట్లు చెప్పారన్నారు. జతవ్ మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించిన వెంటనే అతని కుటుంబ సభ్యులు ఆసుపత్రిని ధ్వంసం చేశారు. ఈ సంఘటనపై పోలీసులు తక్షణమే చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. భరత్‌పూర్ జిల్లాలో కుంహెర్ వద్ద జస్వంత్ జాతవ్ (26) అనే దళిత కూలిని కొట్టి చంపడమే కాకుండా, అతని ఇంటిను కూడా తగలపెట్టారు. పాత కక్షలతో ముగ్గురు-నలుగురు వ్యక్తులు ఈ దారుణానికి ఒడిగట్టారు. తీవ్రగాయాలతో జస్వంత్ మృతి చెందాడు.

మేఘాలయలో అతిపెద్ద పార్టీగా కాంగ్రెస్

21 స్థానాల్లో విజయం - రెండు స్థానాలకే పరిమితమైన బిజెపి

న్యూఢిల్లీ : మేఘాలయలో హంగ్ అసెంబ్లీకి అవకాశాలు కనిపిస్తున్నాయి. 60 స్థానాలున్న మేఘాలయలో 59 స్థానాలకు పోలింగ్ జరిగింది. 60 స్థానాలున్న మేఘాలయలో 59 స్థానాలకు ఎన్నికలు జరగగా 21 స్థానాలు గెలుచుకున్న కాంగ్రెస్ ఏకైక పెద్ద పార్టీగా అవతరించింది. బిజెపి 2, నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సిపి) ఒక స్థానంలో, హిల్‌స్టేట్ పీపుల్స్ డెమక్రటిక్ పార్టీ (హెచ్‌ఎస్‌పిడిపి) 2, నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పిపి) 19, యునైటెడ్ డెక్రమటిక్ పార్టీ (యుడిపి) 6, ఖన్ హైన్నిట్రే నేషనల్ ఎవేకనింగ్ మువ్‌మెంట్ (కెహెచ్‌ఎన్‌ఎఎమ్) 1, పీపుల్స్ డెమక్రటిక్ ఫ్రంట్ (పిడిఎఫ్) 4, స్వతంత్రులు 3 స్థానాలలో గెలుపొందారు. కేంద్రంలో బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎలో భాగస్వామిగా ఉన్న నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పిపి), రాష్ట్రంలో దానితో పొత్తు పెట్టుకోలేదు. బిజెపికి ఎన్‌పిపితో ఉన్న సంబంధాలను పరిశీలిస్తే అది ప్రభుత్వంలో భాగస్వామ్యం అయ్యే అకాశముంది. బిజెపి పాలిత కేంద్ర ప్రభుత్వాన్ని తమ పక్షాన ఉంచుకునేందుకు ప్రాంతీయ పార్టీలు మొగ్గు చూపే అవకాశాలుండంతో ప్రాంతీయ పార్టీలతో చేతులు కలిపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు బిజెపి ప్రయత్నాలు ముమ్మరం చేస్తోంది.

నాగలాండ్‌లో అయోమయం

న్యూఢిల్లీ : ఏ పార్టీకి స్పష్టమైన మెజార్టీ రాకపోవడంతో నాగలాండ్‌లో అయోమయ పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం అధికారంలో ఉన్న నాగా పీపుల్స్ ఫ్రంట్ (ఎన్‌పిఎఫ్) లో బిజెపి భాగస్వామి. అయితే, ఎన్నికల ముందు ఆ పార్టీ నుండి చీలిపోయి నూతనంగా ఏర్పాటైన ఎన్‌డిపిపి తో బిజెపి కలిసింది. అయితే, బిజెపికి చెందిన ఇద్దరు మంత్రులు ఇప్పటికీ ప్రభుత్వంలోనే కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా విడుదలైన ఫలితాల్లో పాలక ఎన్‌పిఎఫ్‌కు 27 సీట్లు వచ్చాయి. బిజెపి పొత్తు పెట్టుకున్న ఎన్‌డిపిపికి 16, బిజెపికి 11 స్థానాలు వచ్చాయి. కూటమిగా 27 స్థానాలు సాధించినా ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మ్యాజిక్ ఫిగర్‌ను మాత్రం ఎన్‌డిపిపి కూటమి చేరుకోలేకపోయింది. ఈ నేపథ్యంలో నాగలాండ్‌లో ఆసక్తికరమైన పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. బిజెపి ఇప్పటికీ తమ ప్రభుత్వంలోనే కొనసాగుతోందని, తమకు పాత స్నేహం ఉందని రాష్ట్ర ముఖ్యమంత్రి టిర్ జియాంగ్ ప్రకటించారు. బిజెపితో కలిసి ప్రభుత్వం ఏర్పాటుకు ఆయన సంసిద్ధత వ్యక్తం చేశారు. మరోవైపు సొంతగా ప్రభుత్వం ఏర్పాటుకు ప్రయత్నాలు ప్రారంభించారు. రెండు సీట్లు గెలుచుకున్న నేషనలిస్ట్ పీపుల్స్ పార్టీ, ఒక్క స్థానం గెలుచుకున్న జెడియు జియాంగ్‌కు మద్దతు ప్రకటించాయి. దీంతో ఆ పార్టీకి మొత్తం 30 మంది సభ్యులు మద్దతు లభించినట్టైంది. రాష్ట్ర గవర్నర్‌ను కలిసి ప్రభుత్వ ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని కోరనున్నాయి. మరోవైపు ఎన్‌డిపిపి కూడా ప్రభుత్వ ఏర్పాటు పట్ల ధీమా వ్యక్తం చేస్తోంది. బిజెపితో కలిసి పోటీ చేసినందున, ఆ పార్టీ మద్దతు తమకే ఉందని ఎన్‌డిపిపి చెబుతోంది. ఒక స్థానంలో గెలిచిన ఇండిపెండెంట్ అభ్యర్థితో మంతనాలు సాగిస్తున్నట్లు సమాచారం. దీంతో రాజకీయంగా ఉత్కంఠ పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితి కొనసాగుతుండగానే బిజెపి సీనియర్ నేత కిరణ్ రిజు నాగాలాండ్‌లో తామే ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని, ఇతర పార్టీల సహకారం తీసుకుంటామని ప్రకటించడం ఆసక్తికరంగా మారింది.


ఓట్ల వ్యత్యాసం 0.3 శాతమే

- బిజెపికి 43 శాతం, సిపిఎంకు 42.7 శాతం ఓట్లు
- ధన ప్రవాహంతో బిజెపి అనైతిక విజయం
- విజయగర్వంతో రెచ్చిపోయిన సంఘ్ పరివార్, బిజెపి గూండాలు
- పలుచోట్ల వామపక్ష కార్యకర్తలపై దాడులు, కార్యాలయాల ధ్వంసం

ప్రజాశక్తి ప్రతినిధి - కొల్‌కతా

త్రిపురలో 25 ఏళ్ల పాటు నిరంతరాయ పాలన అందించిన వామపక్ష కూటమి (లెఫ్ట్‌ఫ్రంట్) ఈ సారి అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి చవిచూసింది. అయితే వామపక్ష ప్రజాపునాధి మాత్రం చెక్కు చెదరలేదని సిపిఎంకు లభించిన ఓట్ల శాతాన్ని బట్టి అర్థమవుతోంది. శనివారం వెలువడిన త్రిపుర ఎన్నికల ఫలితాల్లో బిజెపికి 43 శాతం ఓట్లు లభించగా..సిపిఎం 42.7 శాతం ఓట్లను పొందింది. బిజెపి తన వేర్పాటువాద భాగస్వామి ఐపిఎఫ్‌టితో కలిసి 42 సీట్లను గెలుచుకోగలిగింది. సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు, ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ తన ప్రత్యర్థి కన్నా 5441 ఓట్ల ఆధిక్యతతో విజయం సాధించారు. వాస్తవానికి మాణిక్ సర్కార్ పోటీ చేసిన ధన్‌పూర్ స్థానానికే ఉదయమే లెక్కింపు పూర్తయినా బిజెపి కార్యకర్తలు కౌంటింగ్‌ను అడ్డుకోవడంలో మూడు కేంద్రాల్లో కౌంటింగ్ నిలిపివేసింది. దీనిపై వెంటనే స్పందించిన సిపిఎం ఈ విషయాన్ని ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లి బిజెపి కారణమేదీ లేకుండానే కౌటింగ్‌ను అడ్డుకుందని ఫిర్యాదు చేసింది. దీంతో రాత్రి 9 గంటల ప్రాంతంలో రీకౌంటింగ్ నిర్వహించి ఫలితాన్ని ప్రకటించారు.

60 స్థానాలున్న త్రిపుర అసెంబ్లీలో 59 స్థానాలకు పోలింగ్ జరిగింది. మరొక స్థానంలో మార్చి 13న పోలింగ్ నిర్వహించనున్నారు. సిపిఎం 16 స్థానాల్లో విజయం సాధించింది. బిజెపి 35 స్థానాల్లోనూ, దాని మిత్రపక్షమైన ఐపిఎఫ్‌టి 8 స్థానాల్లోనూ విజయం సాధించాయి.



అగర్తల సమీపంలో బిజెపి, సంఘ్ పరివార్ కార్యకర్తలు ధ్వంసం చేసిన సిపిఎం కార్యాలయం

విజయోన్మాదంతో రెచ్చిపోయిన సంఘ్ పరివార్, బిజెపి గూండాలు

ఎన్నికల ఫలితాలు వెలువడినప్పటి నుండి బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ గూండాలు రెచ్చిపోయి అగర్తలాలో విధ్వంసాన్ని సృష్టిస్తున్నారు. పలు ప్రాంతాల్లో వామపక్ష కార్యకర్తలపై దాడులకు దిగుతున్నారు. రాత్రికి ఇళ్ళలో వుంటే తీవ్ర పర్యవసానాలు ఎదుర్కొంటారని వారిని బెదిరిస్తున్నారు. ఈ మేరకు ధన్‌పూర్ (ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ నియోజకవర్గం), ఖొవాయి, అగర్తలా, ప్రతాప్‌నగర్, ఇంకా అనేక పట్టణ ప్రాంతాల్లోనూ సంఘ్ పరివార్ దాడులకు తెగబడినట్లు వార్తలు అందాయి.

మాణిక్.. రాష్ట్రం విడిచి వెళ్ళిపో : బిజెపి నేత హిమంత బిస్వా

త్రిపురలో బిజెపి కూటమి విజయం సాధించడంతో ఆ పార్టీ శ్రేణులు రెచ్చిపోతున్నాయి. 20 ఏళ్లు ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వర్తించిన మచ్చలేని ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్‌ను రాష్ట్రం విడిచి వెళ్ళిపోవాలంటూ బిజెపి నేత, అసోం మంత్రి హిమంత బిస్వా శర్మ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. బిస్వా శనివారం ఇక్కడ మాట్లాడుతూ 'మాణిక్ సర్కార్ కావాలంటే సిపిఎం కొద్దో గొప్పో ఉన్న పశ్చిమ బెంగాల్ వెళ్లొచ్చు. లేదా మరో మూడేళ్ల అధికారంలో ఉండే కేరళకు, చివరకు పొరుగున ఉన్న బంగ్లాదేశ్‌కైనా వెళ్లొచ్చు' అని బిస్వా అన్నారు. 'ప్రస్తుతం ఆయనకు ఆ మూడే ఆప్షన్లున్నాయి. ఎంచుకునే అవకాశం కూడా ఆయనకే ఇస్తున్నాం' అంటూ వ్యాఖ్యానించారు. మాణిక్‌సర్కార్ నియోజకవర్గంలోని ధన్‌పూర్‌లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న శర్మ గత నెలలో ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. ఎన్నికల తర్వాత మాణిక్‌ను బంగ్లాదేశ్‌కు సాగనంపుతామన్నారు.

త్రిపుర తదుపరి సిఎం బిప్లాబ్ దేబ్ ?

అగర్తల : త్రిపుర తదుపరి ముఖ్యమంత్రిగా బిప్లాబ్ కుమార్ దేబ్ ఎన్నికయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీనిపై తుది నిర్ణయాన్ని బిజెపి పార్లమెంటరీ బోర్డు తీసుకోవాల్సి వుంది. ప్రస్తుతం బిజెపి రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న బిప్లాబ్ దేబ్ గతంలో జిమ్ నిర్వహకుడిగా పనిచేశారు. అక్కడి నుంచి రాజకీయాల్లోకి ప్రవేశించారు. అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపిని గెలిపించిన త్రిపుర ప్రజలకు బిప్లాబ్ కృతజ్ఞతలు తెలిపారు. అధిష్టానం ఆదేశిస్తే ఏ బాధ్యతలు స్వీకరించడానికైనా సిద్ధంగా ఉన్నాయని ఆయన తెలిపారు. ప్రస్తుత ఎన్నికల్లో 48 ఏళ్ల బిప్లాబ్ దేబ్ అగర్తలలోని బనమలిపుర్ నియోజకవర్గం నుంచి విజయం సాధించారు.

డబ్బు, అధికారం అండతోనే బిజెపి గెలుపు : ఏచూరి



త్రిపుర ఎన్నికల్లో విజయం సాధించేందుకు బిజెపి అనైతిక చర్యలకు పాల్ప డిందని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి విమర్శించారు. డబ్బు, కేంద్రంలో అధికార మందబలాన్ని ఉపయోగించి ప్రలోభాలకు గురి చేయడం ద్వారా వామపక్షేతర శక్తులను ఒక తాటిపైకి తీసుకొచ్చిందని అన్నారు. 'డబ్బును భారీ స్థాయిలో పంచి లెఫ్ట్ వ్యతిరేకులందరినీ ఒక వేదిక మీదకు తీసుకురావడంలో విజయం సాధించింది. బిజెపి అనైతిక రాజకీయాలను ప్రదర్శించింది. దాని పర్యవసానమే ఈ ఫలితం. ఎన్నికల్లో డబ్బు ఉపయోగిం చడంవల్ల ప్రజలకు అననుకూలమైన పరిస్థితులు ఎదురుకావచ్చు. ఈ కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి' అని త్రిపుర ప్రజలను ఏచూరి హెచ్చరిం చారు. 'బిజెపి మోసపూరిత రాజకీయాలకు వ్యతిరేకంగా ఒక్క త్రిపురలోనే కాదు.. దేశవ్యాప్తంగా మా పోరాటం కొనసాగిస్తాం. భారత రాజ్యాంగ సిద్ధాంతాలపై నమ్మకం ఉన్నవారికి బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌ల దుర్మార్గ నమూనాలను ఓడించడం అత్యవసరం. ఆ యుద్ధాన్ని మేం కొనసాగిస్తాం' అని ఏచూరి ట్వీట్ చేశారు. త్రిపుర ప్రజలిచ్చిన తీర్పును ఆమోదిస్తున్నాం. '25 ఏళ్లుగా తమకు అవకాశం ఇచ్చిన ప్రజలకు ధన్యవాదాలు. ప్రస్తుతం 45శాతం మంది త్రిపుర ప్రజలు వామపక్ష కూటమికి ఓటువేశారు. త్రిపుర ప్రజల ప్రయోజనాలను కాపాడేందుకు, వారి సంక్షేమ కోసం, ముఖ్యంగా ఈశాన్య రాష్ట్రానికి అతి ముఖ్యమైన గిరిజన, గిరిజన వర్గాల ఐక్యత కోసంమా కృషి కొనసాగుతుంది' అని ఏచూరి పేర్కొన్నారు. ఎన్నికల ఫలితాలను అధ్యయనం చేసి, విశ్లేషించుకుంటామని, ఆ తర్వాత తీసుకోవాల్సిన చర్యలను నిర్ణయించుకుంటామని ఏచూరి తెలిపారు.

రఫెల్ ఒప్పందం.. మరో భోఫోర్స్ కాదు

నిర్మలా సీతారామన్

న్యూఢిల్లీ : రఫెల్ యుద్ధ విమానాల కొనుగోలు ఒప్పందంలో ఎలాంటి అవినీతి చోటు చేసుకోలేదని కేంద్ర రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. బోఫోర్స్ తుపాకీల కుంభకోణం తరహా కుంభకోణం ఇక్కడ జరగలేదని అన్నారు. 'బోఫోర్స్‌తో రఫెల్‌ను పోల్చవద్దు. ఇక్కడ కుంభకోణం జరగలేదు' అని విలేకరులతో సీతారామన్ అన్నారు. సోమవారం నుంచి జరిగే పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో రఫెల్ అంశాన్ని కాంగ్రెస్ ప్రస్తావిస్తే ఎదుర్కొంటామని అమె తెలిపారు. 36 రఫెల్ యుద్ధవిమానాల కోసం రూ. 58 వేల కోట్లతో ఫ్రాన్స్‌తో ఒప్పందం కుదుర్చుకోవడంపై బిజెపి ప్రభుత్వంపై కాంగ్రెస్ ఆరోపణలు చేస్తుంది. అధిక ధరలకు ఈ యుద్ధ విమానాలను ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని కాంగ్రెస్ విమర్శిస్తోంది. ఈ ఒప్పందంలో అవినీతి ఉన్న కారణంగానే 2012లో అప్పటి రక్షణ శాఖ మంత్రి ఎకె అంటోని అంగీకరించలేదని కాంగ్రెస్ పేర్కొంటోంది.

తమిళ ఎంపీలు రాజీనామా చేయాలి

డిఎంకె సూచన

చెన్నై : కావేరి జల నిర్వహణ బోర్డుపై అఖిల పక్ష బృందాన్ని ప్రధాని మోడీ కలుసుకోకపోతే తమిళనాడు ఎంపిలు రాజీనామా చేయాలని డిఎంకె సూచించింది. కావేరి అంశంపై రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి కె పళనిస్వామితో జరిగిన సమావేశంలో డిఎంకె వర్కింగ్ ప్రెసిడెంట్, అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు ఎంకె స్టాలిన్ ఈ ప్రతిపాదన చేశారు. అఖిల పక్ష బృందంతో సమావేశం కావడానికి మోడీ నిరాకరించారని ముఖ్యమంత్రి తెలిపినట్లు స్టాలిన్ పేర్కొన్నారు. అయితే తమిళబృందంతో సమావేశానికి మోడీ నిరాకరించలేదని రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి డి జయకుమార్ తెలిపారు.

మూడు ఎంఓయులపై భారత్-వియత్నాం సంతకాలు



న్యూఢిల్లీ : భారత్, వియత్నాంలు శనివారం మూడు అవగాహన ఒప్పంద పత్రాల (ఎంఓయు)పై సంతకాలు చేశాయి. ప్రధానంగా భారత్‌కు చెందిన గ్లోబల్ సెంటర్ ఫర్ న్యూక్లియర్ ఎనర్జీ పార్టనర్‌షిప్ (జిసిఎన్‌ఇపి), వియత్నాంకు చెందిన వియత్నాం అటోమిక్ ఎనర్జీ ఇన్‌స్టిట్యూట్ (విఐఎన్‌ఎటిఓఎమ్) మధ్య సహకారంతో సహా మూడు ఎంఓయులపై రెండు దేశాలు సంతకాలు చేశాయి. శాంతియుత కార్యక్రమాలే లక్ష్యంగా అణు ఇంధన రంగంలో సాంకేతిక సహకారాన్ని బలోపేతం చేసుకునే లక్ష్యంతో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, వియత్నాం అధ్యక్షుడు ట్రాన్ డయ్ క్వాంగ్ మధ్య చర్చలు జరిగిన అనంతరం ఓఎంఓయులపై సంతకాలు జరిగాయి. దీంతో పాటు ఆర్థిక, వాణిజ్య సహకారమే లక్ష్యంగా పురోభివృద్ధి దిశగా తగిన కార్యాచరణను రూపొందించ డానికి సంబంధించిన ఎంఓయుపై కూడా సంతకాలు జరిగాయి. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రిసెర్చ్ (ఐసిఎఆర్), మినిస్ట్రి ఆఫ్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ ఆఫ్ వియత్నాం ల మధ్య 2018-2022 సంవత్సరాలకు గాను కార్యాచరణ ప్రణాళికపై కూడా సంతకాలు జరిగాయి. ఎంఓయూలపై సంతకాలు పూర్తయిన తరువాత వియత్నాం అధ్యక్షుడు ట్రాన్ డయ్ క్వాంగ్, ప్రధాన మంత్రి మోడీ ఒక ఉమ్మడి ప్రకటన చేస్తూ రక్షణ రంగంలో కూడా సహకారాన్ని పెంపొందించుకోవాలని, సాంకేతికత బదిలీ అవకాశాలను అన్వేషించాలని నిర్ణయించినట్లు తెలిపారు.

ఎస్‌ఎస్‌సి కుంభకోణంపై సిబిఐ దర్యాప్తు నిర్వహించాలి

ఎస్‌ఎఫ్‌ఐ డిమాండ్

ఇండియా న్యూస్ నెట్‌వర్క్ (ఐఎన్‌ఎన్), న్యూఢిల్లీ : స్టాఫ్ సెలెక్షన్ కమిటీ (ఎస్‌ఎస్‌సి) నిర్వహించే కంబైన్డ్ గ్రాడ్యుయట్ స్థాయి పరీక్షలో వెలుగు చూసిన కుంభకోణంపై సిబిఐ దర్యాప్తు నిర్వహించాలని ఎస్‌ఎఫ్‌ఐ కేంద్ర కార్యనిర్వహణ కమిటీ డిమాండ్ చేసింది. న్యూఢిల్లీలో లోధి రోడ్‌లోని ఎస్‌ఎస్‌సి ప్రధాన కార్యాలయం ముందు ఫిబ్రవరి 27 నుంచి నిరసనలు చేస్తున్న విద్యార్థులకు సంఘీభావం ప్రకటించింది.

సుమారు 9,372 ఖాళీల భర్తీ కోసం ఫిబ్రవరి 17 నుంచి 22 వరకూ 206 కేంద్రాల్లో నిర్వహించిన ఈ పరీక్షలో ఎంతో శ్రమించి పాల్గొన్న లక్షల మంది విద్యార్థులపై ఈ కుంభకోణం తీవ్ర ప్రభావం చూపిస్తుందని ఎస్‌ఎఫ్‌ఐ ఆందోళన వ్యక్తం చేసింది. పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరిగినట్లు వార్తలు రావడంతో పాటు, సమాధానాలతో సహా ప్రశ్నాపత్రాలు సోషల్ మీడియాలో దర్శనమిచ్చాయి. దీంతో ఫిబ్రవరి 21న జరిగిన పరీక్షను ఎస్‌ఎస్‌సి రద్దు చేసింది. ఈ నెల 9న ఈ పరీక్షను మరోసారి నిర్వహిస్తామని ఎస్‌ఎస్‌సి తెలిపింది. వివిధ విభాగాల్లో ఎస్‌ఎస్‌సి పరీక్షలను నిర్వహిస్తుంది. కంబైన్డ్ గ్రాడ్యుయేట్ స్థాయి పరీక్షలో మాత్రమే ఈ కుంభకోణం వెలుగులోకి వచ్చింది.

నిరవ్ మోడీ, చోక్సిలపై నాన్ బెయిలబుల్ వారెంట్లు

ముంబయి : పంజాబ్ నేషనల్ బ్యాంక్‌ను మోసగించిన కేసులో వజ్రాల వ్యాపారి నిరవ్ మోడి, ఆయన సన్నిహిత బంధువు మెహుల్ చోక్సిలకు మనీ లాండరింగ్ నిరోధక చట్టం కింద ఏర్పడిన ప్రత్యేక కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్లను జారీ చేసింది. నిందితులిద్దరూ దర్యాప్తును తప్పించుకుంటున్నారని, పలుమార్లు సమన్లు జారీ చేసినా తమ ఎదుట హాజరు కావడం లేదని తెలియచేస్తూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) తెలియచేస్తూ వారిపై వారెంట్లు జారీ చేయాలని ఇటీవల కోర్టును కోరింది. నిరవ్ మోడికి మూడు సమన్లు జారీ చేశామని, అందులో రెండింటిని ఇ మెయిల్ ద్వారా జారీ చేసినట్లు ఇడి తెలిపింది. ఇడి జారీ చేసిన సమన్లకు మోడి సమాధానమిస్తూ వ్యాపార పనుల నిమిత్తమై విదేశాలలో ఉన్నానని తెలిపారు. ఇ మెయిల్ ద్వారా దర్యాప్తుకు సహకరిస్తానని చెప్పారు. ఈ కేసులో మీడియా కవరేజ్ నేపథ్యంలో తన భద్రతపై ఆందోళనను వ్యక్తం చేశారు. సిబిఐ జనవరి 31న ఫిర్యాదు నమోదు చేసిన తరువాత మోడీపై దర్యాప్తు ప్రారంభమైంది.

గూడు ఘోష


200 కోట్లకు పైగా గృహాలు

- ప్రపంచ వ్యాప్తంగా పెరగనున్న గృహావసరాలు
- భవిష్యత్‌ను కలవరపర్చేలా జనాభా పెరుగుదల
- జనాభాకు అనుగుణంగా వృద్ధి చెందని నివాసాలు

ఐక్యరాజ్య సమితి : రానున్న ఎనిమిది దశాబ్దాల కాలంలో ప్రపంచ వ్యాప్తంగా 2 వందల కోట్లకు పైగా కొత్త గృహాలను నిర్మించాల్సిన అవసరమేర్పడ బోతుందని, దీనికి సంబంధించిన జాగ్రత్తలు తీసుకుని సమస్యను ఇప్పుడే పరిష్కరించుకోవాలని ఎడిన్‌బర్గ్‌లోని నాపియర్ యూనివర్సిటికి చెందిన ద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సస్టైయనబుల్ కన్‌స్ట్రక్షన్ డైరెక్టర్ సేన్ స్మిత్ పేర్కొంటున్నారు.

ఈ శతాబ్దాంతానికి ప్రపంచ జనాభా మరో 360 కోట్ల మేర పెరగనున్నది. అదే ఐక్యరాజ్య సమితి గణాంకాల మేరకు 2100 సంవత్సరం నాటికి ప్రపంచ జనాభా 112 కోట్లకు చేరుకోనున్నది. అంటే 2017 సంవత్సరాంతానికి అంచనా వేయబడిన ప్రస్తుత జనాభా 760 కోట్లు. దీనిని మధ్యతరహా వృద్ధిగా పరిగణించ వచ్చు. ఇలా పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక సౌర్యాల కల్పన, అభివృద్ధి కూడా జరగాల్సి ఉంది. బ్రెగ్జిట్‌కు ముందు యూరోపియన్ దేశాలలో ఉన్న జనాభాకు ఏడు రెట్లకు సమానంగా అభివృద్ధి జరగాల్సి ఉంది. ప్రపంచ జనాభా ఏడాదికి 45 మిలియన్ల చొప్పు పెరుగుతున్నది. ఇది అనివార్యమైన పెరుగుదల. దీనికి అనుగుణంగా ఆహారం, నీరు, వస్తు, పదార్థాలు అన్నిటికి మించి గృహ సదుపాయాలను పెంచుకోవలసిన ఆవశ్యకతను ఈ గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

ఇదే సందర్భంలో గృహావసరాలు మారుతున్న అంశాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలి. గృహ పరిమాణాలు (సైజు) పరిశీలిస్తే ఒక ఖండానికి మరొక ఖండానికి, ఒక దేశానికి మరో దేశానికి స్పష్టమైన వ్యత్యాసం కనిపిస్తోంది. ఐక్యరాజ్య సమితి నివేదిక మేరకే గడిచిన 50 ఏళ్లలో గృహ పరిమాణాలు తగ్గిపోయాయి. ఇందుకు సంబంధించిన గణాంకాలను ఒకసారి పరిశీలిస్తే ఫ్రాన్స్‌లో 1968లలో ఒక మోస్తరు గృహంలో 3.1 వ్యక్తులు నివసించేవారు, అదే గృహంలో 2011 నాటికి వారి సంఖ్య 2.3కు తగ్గిపోయింది. ఇదే సమయంలో సంతానోత్పత్తి రేటు కూడా 2.6 నుంచి 2.0కు పడిపోయింది. అలాగే కెన్యాలో ఒక మోస్తరు నివాసంలో 1969 ప్రాంతంలో 5.3 వ్యక్తులు నివసించే వారు. 2014నాటికి వీరి సంఖ్య 4.0కు పడిపోయింది. సంతానోత్పత్తి రేటు కూడా 8.1 నుంచి 4.4కు పడిపోయింది.



ప్రత్యేకించి అభివృద్ధి చెందున్న దేశాలలో వృద్ధ జనాభా పెరగడం, భవిష్యత్‌లో వారి సంరక్షణ అవసరాలలోని జనాభా మార్పుకు దారి తీస్తోంది. అంటే దాని అర్థం ప్రజలు ఎక్కువ కాలం తమ సొంత నివాసాలలో జీవించాలనుకుంటున్నారు.ఇది ప్రతి సంవత్సరం అందుబాటులో ఉన్న గృహాలను ప్రభావితం చేస్తుంది. ప్రస్తుతానికి ప్రత్యేకంగా చెప్పుకోవలసిన మార్పు ఏదైనా ఉందంటే బ్రిటన్‌లోనూ, ఇతర అభివృద్ధి చెందిన దేశాలలోనూ ఒకరు లేదా ఇద్దరు నివాసాల సంఖ్య పెరుగుతున్నది. స్కాట్‌లాండ్, ఇంగ్లాండ్‌లలో ఇప్పటికి, 2030-41ల నాటికి గృహ నిర్మాణాల సంఖ్యను పెంచుతున్నారు.

ప్రస్తుతమున్న జనాభాకు అనుగుణంగా ముందస్తు అంచనాలతో వృద్ధి రేటును గణించి గృహ నిర్మాణాలు చేపడుతున్నారు. భవిష్యత్‌లో పెరుగుతున్న జనాభా కన్నా వేగంగా గృహ నిర్మాణాలు జరగాల్సినఅవసరం కనిపిస్తోంది. అభివృద్ధి చెందుతున్న అత్యధిక దేశాలలో అభివృద్ధి చెందిన దేశాలతో సమానంగా మౌలిక సదుపాయాలు జీవన ప్రమాణాలను మెరుగు పరిచేవిగా ఉంటున్నాయి. జీవిత కాలాన్నికూడా పొడిగిస్తున్నాయి. గృహ పరిమాణాలు తగ్గనున్నాయి. కొత్త గృహాల సరఫరా డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని గృహ పరిమాణాలు తగ్గుతున్నాయి. రానున్న 80 ఏళ్ళలో ప్రపంచ వ్యాప్తంగా జనాభా వృద్ధికి, గృహాల డిమాండ్‌కు మధ్య 7-8 శాతం గా మాత్రమే కనిపిస్తోంది. ఇది మరో 800 మిలియన్ల అదనపు నివాసాల ఆవశ్యకతను తెలియచేస్తోంది. కొత్త గృహాలకు సంబంధించి ప్రస్తుత, భవిష్యత్ డిమాండ్‌కు అనుగుణంగా సంబంధిత ప్రభుత్వాలు మరిన్ని ఆవిష్కరణలకు అవకాశం కల్పించాలి. జనాభాకు అనుగుణంగా కొత్త గృహాలను అందించేందుకు వేగవంతమైన నిర్మాణాలను చేపట్టాలి. అందుకు తగిన సాంకేతికతను అందిపుచ్చుకోవాలి. చాలా దేశాల ప్రభుత్వాలు ఇందుకు అవసరమై ఒక విధానపరమైన వ్యూహాన్ని అనుసరించడంపై చర్చిస్తున్నాయి.

సంక్షిప్తం

ఫారెస్ట్ అధికారిని తొక్కి చంపిన ఏనుగులు

బెంగళూరు : స్థానిక నాగర్‌హోల్ టైగర్ రిజర్వ్ అటవీ ప్రాంతంలో ఏనుగు దాడి చేయడంతో సీనియర్ అటవీశాఖ అధికారి మృతి చెందాడు. డిబి కోరే రేంజ్‌లోని తటిగుండి కరే వద్ద 1.30 గంటల సమయంలో ఈ సంఘటన జరిగిందని అధికారులు తెలిపారు. నాగర్‌హోల్ టైగర్‌రిజర్వు ఫారెస్ట్‌లో అగ్ని ప్రమాదం జరిగిందని సమాచారం రావడంతో ఫీల్డ్ డైరెక్టర్ ఎస్.మణికందన్ పరిశీలించేందుకు తన సిబ్బందితో కలిసి అక్కడకు వెళ్లినట్లు ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ పుణతి శ్రీధర్ తెలిపారు.

ఆ సమయంలో వారి జీపుపై ఏనుగులు వెనుకవైపు నుండి దాడిచేశాయని, ఈ దాడిలో మణికందన్‌ను ఏనుగులు తొక్కడంతో మృతి చెందాడని అన్నారు. మిగిలిన వారు తప్పించుకున్నారు. అనంతరం ఆయన మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. ఉత్తమ అధికారిగా పేరు తెచ్చుకున్న ఆయన రెండేళ్ల క్రితమే నాగర్‌హోల్ టైగర్‌రిజర్వ్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు.

జమ్ము- కాశ్మీర్‌లో భారీ మంచు తుఫాను

శ్రీనగర్ : జమ్ము- కాశ్మీర్‌లో మంచు తుఫాను కారణంగా కురుస్తున్న భారీ హిమపాతం శనివారం కూడా కొనసాగినట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. రెండురోజులుగా కాశ్మీర్‌లోయలో వర్షాలు కురుస్తున్న సంగతి తెలిసిందే. బారాముల్లా జిల్లాలో గుల్మార్గ్‌లోని ప్రఖ్యాత స్కై రిసార్ట్ ప్రాంతంలో రికార్డు స్థాయిలో మంచు కురవడంతో, శనివారం ఉదయానికి మూడు అడుగుల మేర మంచు పేరుకుపోయిందని అన్నారు. కుప్వారా, జొజిలా, షొపెయిన్, గురెజ్ వంటి పలు ప్రాంతాలలో కూడా ఇదే పరిస్థితి కొనసాగుతోందని అన్నారు. కాశ్మీర్‌లోని మైదాన ప్రాంతాలలో అడపాదడపా వర్షాలు కురుస్తున్నట్లు తెలిపారు. ఉత్తర కాశ్మీర్‌లోని కుప్వారా జిల్లాలో రికార్డు స్థాయిలో 51 మి.మి వర్షపాతం నమోదైంది. అలాగే జమ్ము-కాశ్మీర్‌కు వేసవి రాజధాని అయిన శ్రీనగర్‌లో 4.2మి.మి వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖా అధికారులు వెల్లడించారు.

హెచ్-1బీ భాగస్వాములకు తాత్కాలిక ఊరట

వాషింగ్టన్: హెచ్-1బీ వీసాదారుల భాగస్వాములను ఉద్యోగాల నుంచి తొలగించే విషయంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని ట్రంప్ యంత్రాగం వెల్లడించింది. "హెచ్4 వీసాల మీద వివిధ కంపెనీల్లో పనిచేస్తున్న హెచ్-1బీ వీసా దారుల భాగస్వాములను ఉద్యోగాల నుంచి తొలగించే నిర్ణయంపై జూన్ వరకు ఎటు వంటి నిర్ణయమూ తీసుకోబోం. వాళ్లని తొలగించాలని తీసుకునే నిర్ణయం దేశంపై ఆర్థికంగా ఎటువంటి ప్రభావం చూపుతుందనే దాన్ని పరిశీలించాల్సి ఉంది" అని తెలిపింది.



తుపాను

అమెరికా తూర్పు తీరంలోని మసాచుసెట్స్ ప్రాంతంలో తుపాను భీభత్సం

అమెరికా తూర్పు తీరాన్ని కుదిపేసిన తుపాను

- ఐదుగురు మృతి
- అంధకారంలో 17లక్షల గృహాలు

బోస్టన్ : అమెరికా తూర్పు తీరాన్ని శుక్రవారం అత్యంత శక్తివంతమైన తుపాను కుదిపివేయడంతో ఐదుగురు మరణించారు. శీతాకాలంలో చెలరేగిన ఈ తుపాను తీవ్రత కారణంగా బలమైన గాలులు, భారీ వర్షాలతో పరిస్థితి అస్తవ్యస్థంగా తయారైంది. మంచు కూడా విపరీతంగా కురుస్తుండడంతో రహదారులు మూసుకుపోయాయి. ఓహియో, న్యూయార్క్‌లో కొన్ని ప్రాంతాల్లో ఒక అడుగు మేరా, బోస్టన్, రోడ్ ఐల్యాండ్‌ల్లో రెండు నుండి ఐదు అంగుళాల మేర మంచు పేరుకుపోయింది. వేలాది విమానాల రాకపోకలకు ఆటంకం కలిగింది. వాషింగ్టన్ డిసిలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు కూడా మూతపడ్డాయి. తుపాను కారణంగా అమెరికాలోని ఈశాన్య ప్రాంతంలో, మధ్య పశ్చిమ ప్రాంతంలో దాదాపు 17లక్షల ఇళ్ళు, వ్యాపార సంస్థలు అంధకారంలో మగ్గుతున్నాయి. న్యూజెర్సీ నుండి మసాచుసెట్స్ వరకు తూర్పు తీరమంతా వరద హెచ్చరికలు జారీ చేశారు. ఈశాన్య ప్రాంతం నుండి మధ్య అట్లాంటిక్ ప్రాంతాల వరకు ప్రచండమైన గాలులు వీస్తాయని వాతావరణ శాఖ తెలియచేసింది. కాగా తుపాను ధాటికి పెద్ద పెద్ద వృక్షాలు నేలకూలాయి. వర్జీనియాలో చెట్టు కూలి 44ఏళ్ళ వ్యక్తి మరణించాడు. మేరీల్యాండ్‌లోని బాల్టిమోర్ సిటీలో 77ఏళ్ళ మహిళ మృతి చెందింది. రోడ్ ఐల్యాండ్‌లో ఒకరు, న్యూయార్క్‌లో ఒక బాలుడు(11) చనిపోయారు. రిచ్‌మండ్‌లో ఇంట్లో నిద్రపోతుండగా ఇంటిపై చెట్టు కూలడంతో ఆరేళ్ళ బాలుడు చనిపోయాడు. 3వేలకు పైగా దేశీయ, అంతర్జాతీయ విమానాలు రద్దయ్యాయి. మరో 2500 విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. ముందు జాగ్రత్త చర్యగా రైళ్ళ రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేశారు. బాధితులకు సాయపడేందుకు నేషనల్ గార్డ్ సభ్యులు రంగంలోకి దిగారు. న్యూయార్క్ నగరం మొత్తంగా జన జీవనం స్తంభించింది. కాలిఫోర్నియాపై విరుచుకుపడిన మంచు తుపాను ఒక వ్యక్తి మరణించగా, నెవడా రాష్ట్రంలో స్కై రిసార్ట్ వద్ద మంచు పెళ్ళలు విరిగిపడడంతో ఇద్దరు గాయపడ్డారు.

వెస్ట్ బ్యాంక్, గాజాల్లో ఘర్షణలు

గాజా/రమల్లా : వెస్ట్ బ్యాంక్, గాజాల్లో ఇజ్రాయిల్ సైనిక బలగాలతో జరిగిన ఘర్షణల్లో డజన్ల సంఖ్యలో పాలస్తీనియన్లు గాయపడ్డారని వైద్య వర్గాలు, ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. శుక్రవారం ప్రార్ధనలు ముగిసిన తర్వాత ఘర్షణలు చెలరేగాయి. జెరూసలేంను ఇజ్రాయిల్ రాజధానిగా ట్రంప్ ప్రకటించిన నేపథ్యంలో శుక్రవారం నిరసన దినంగా పాటిస్తూ పాలస్తీనీయులు ప్రదర్శన నిర్వహించారు. రమల్లాకు ఉత్తరంగా బెలిన్ గ్రామంలో ప్రదర్శకులు, ఇజ్రాయిలీ సైనికుల మధ్య భీకరంగా ఘర్షణలు జరిగాయని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. నిరసనకారులు రాళ్లు విసరగా, సైనికులు బాష్పవాయు గోళాలను, రబ్బర్‌తూటాలను ప్రయోగించారు. వెస్ట్ బ్యాంక్ పట్టణాలు, నగరాల్లో పలు చోట్ల ఘర్షణలు చోటు చేసుకున్నాయి. ప్రదర్శకులను చెల్లాచెదురు చేయడానికి కొన్ని చోట్ల సైనికులు కాల్పులు కూడా జరిపారు. ఇస్లామిక్ హమస్ మూవ్‌మెంట్ నిర్వహించిన ప్రదర్శనలో వందలాదిమంది పాల్గొన్నారు. తూర్పు గాజా, ఇజ్రాయిల్ మధ్య సరిహద్దులకు సమీపంలో ఘర్షణలు చోటు చేసుకోగా, మొత్తంగా 19మంది పాలస్తీనియన్లు గాయపడ్డారు.

ప్రజలు ద్వేషించే ఐదు ప్రముఖ కంపెనీల్లో ఆపిల్, మెక్‌డోనాల్డ్స్

న్యూయార్క్ : తమ వ్యాపార కార్యకలాపాలతో అంతర్జాతీయ స్థాయికి వెళ్ళిన కంపెనీలు, పారిశ్రామిక సంస్థలు మంచి పేరు ప్రతిష్టలను సంపాదించుకోవచ్చు. అయితే, అన్నిసార్లు, అన్ని కంపెనీలు అలా వుండవు. ప్రజలు అత్యంత ఎక్కువగా విద్వేషించే కంపెనీలుగా ఇంటర్‌నెట్‌లో ఐదు ప్రముఖ కంపెనీలు ట్రెండ్ అవుతున్నాయి. అవి-మాన్‌శాంటో, ఆపిల్, నెస్లే, ఫిలిప్ మారిస్, మెక్‌డొనాల్డ్స్.

మాన్‌శాంటో : ఈ కంపెనీని అస్సలు పరిచయం చేయాల్సిన పనే లేదు. ప్రపం చంలోనే అత్యంత పెద్దదైన క్రిమిసంహారక, జన్యు మార్పిడి విత్తన తయారీ కంపెనీల్లో ఇదొకటి. పురుగు మందులను ప్రతిఘటించగల జన్యుపరంగా మార్పిడి చేసిన విత్తనాన్ని తయారుచేసిన మొదటి కంపె నీగా అందరికీ సుపరిచితం. ఈ సంస్థ తయారుచేసిన కలుపు సంహారకాల వల్ల లక్షలాది ఎకరాల పంటలు దెబ్బ తిన్నాయని సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. ఈ సంస్థ వాడే రసాయనాలతో కేన్సర్, ఇతర అనేక రకాల ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని ఆందోళనలు నెలకొన్నాయి.

ఆపిల్ : ఒకప్పుడు మైక్రోసాఫ్ట్‌ను ద్వేషించే వారికి అత్యంత ప్రియతమ బ్రాండ్ అయిన ఆపిల్ ఇటీవలే తన ఉద్యోగుల పట్ల సరిగా వ్యవహరించడం లేదని, తక్కువ వేతనాలు చెల్లిస్తోందని ఆరోపణలు వచ్చాయి. విదేశాల్లో డబ్బు దాచుతోందని, పన్నులు చెల్లించడం లేదని విమర్శలు వచ్చాయి. ఆరోగ్య, పర్యావరణ చట్టాలను ఉల్లంఘిస్తోందని, మార్కెట్‌లో తనకున్న గుత్తాధిపత్యాన్ని దుర్వినియోగం చేస్తోందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నెస్లే : ఆరోగ్యమైన భవిష్యత్ తరాన్ని పెంచేందుకు కట్టుబడి వున్నామంటూ చెప్పుకునే నెస్లే కంపెనీ ఇటీవల కాలంలో వరుసగా పలు కుంభకోణాల్లో ఇరుక్కుంది. ప్రపంచంలో బహిష్కరణకు గురైన కంపెనీల్లో ఇది ఒకటి. కార్మిక హక్కుల ఉల్లంఘనలకు పాల్పడింది.

ఫిలిప్ మారిస్ : అమెరికన్ పొగాకు ఉత్పత్తుల తయారీ సంస్థ అయిన ఫిలిప్ మారిస్ ఉత్పత్తులు 180దేశాల్లో విక్రయించబడతాయి. పొగ తాగడం చెక్ రిపబ్లిక్ ఆర్థిక వ్యవస్థకు ఎంత మేలు చేస్తోందో వివరిస్తూ ఒక నివేదికను ప్రచురించి ఈ కంపెనీ ఆ ప్రభుత్వాన్ని ఇబ్బందుల పాల్జేసింది.



మెక్‌డొనాల్డ్స్ : అమెరికన్ ఫాస్ట్ ఫుడ్ కంపెనీ అయిన మెక్‌డొనాల్డ్స్‌లో కార్మికుల హక్కులు తీవ్రంగా ఉల్లంఘించబడిన చరిత్ర వుంది. పైగా జంక్ ఫుడ్ వల్ల ఆరోగ్య సమస్యలు ఎక్కువవుతున్నాయని విమర్శలు వస్తూనే వుంటాయి.


ఇతర దేశాలకు చైనా ఆదర్శప్రాయం

కంబోడియా నిపుణుడు కిన్ ఫె

నాంఫెన్ : ఆర్థిక వ్యవస్థకు ద్వారాలు తెరవడంతో, అవినీతిపై పోరు సల్పడంలో తీసుకున్న చర్యలతో చైనా ఇతర దేశాలకు 'రోల్ మోడల్'గా నిలిచిందని కంబోడియా నిపుణుడు కిన్ ఫె వ్యాఖ్యానించారు. చైనీస్ పీపుల్స్ పొలిటికల్ కన్సల్టేటివ్ కాన్ఫరెన్స్ (సిపిపిసిసి) జాతీయ కమిటీ సమావేశం శనివారం నుండి, నేషనల్ పీపుల్స్ కాన్ఫరెన్స్ (ఎన్‌పిసి) సోమవారం నుండి ప్రారంభమవుతున్న తరుణంలో కంబోడియాలోని రాయల్ అకాడమీలో అంతర్జాతీయ సంబంధాల సంస్థ డైరెక్టర్ జనరల్‌గా వున్న కిన్ ఫె ఒక ఇంటర్వ్యూలో పై వ్యాఖ్యలు చేశారు. గత 40ఏళ్ళ కాలంలో చైనా అమలు చేస్తున్న సంస్కరణలు, ఆర్థిక వ్యవస్థ ద్వారాలు తెరుస్తూ తీసుకున్న చర్యల వల్ల కేవలం చైనా ప్రజలకే కాకుండా మొత్తంగా ప్రపంచ పురోగతికి చోదక శక్తిగా ఉపయోగపడ్డాయని ఆయన పేర్కొన్నారు. చైనా విజయవంతంగా అనుసరిస్తున్న ఆర్థికాభివృద్ధి నమూనా ఇతర దేశాలకు కూడా ఆదర్శంగా వుండాలని అన్నారు.

దేశ అభివృద్ధి కోసం చాలా స్పష్టమైన రాజకీయ వైఖరిని నిర్దేశించడానికి దోహదపడిందని అన్నారు. దేశ ప్రభావాన్ని మరింత విస్తరించేందుకు, ప్రాంతీయ,అంతర్జాతీయ రాజకీయాల్లో చైనా పాత్రను పెంచేందుకు ఉపయోగపడిందని కిన్ ఫె పేర్కొన్నారు. జిన్‌పింగ్ నేతృత్వంలోని చైనా గత ఐదేళ్ళ కాలంలో అంతర్జాతీయ వేదికపై అత్యున్నత ప్రతిష్టను సంపాదించిందని ప్రశంసించారు. అవినీతిపై సాగిస్తున్న పోరులో భాగంగా అనేకమంది అవినీతి అధికారులను కటకటాల వెనక్కి పంపిందని, ఈ విషయంలో చైనాకు గల ఉక్కు సంకల్పం వెల్లడవుతోందని అన్నారు. మానవాళి ప్రయోజనాలకు, అభివృద్ధికి పాటుపడే ప్రపంచాన్ని నిర్మించాలన్న చైనా నిబద్ధతను ఆయన ప్రశంసించారు. శాంతి,సుస్థిరతలు, అభివృద్ధి గల ప్రపంచాన్ని చైనా కోరుకుంటోందని దీని కోసం పాటుపడుతోందని అన్నారు.

లూనార్, రోదసీ ప్రాజెక్టులకై ఉమ్మడి డేటా సెంటర్



రష్యా, చైనా ఒప్పందం

మాస్కో/బీజింగ్ : చంద్రుడు, రోదసీలపై లోతుగా పరిశోధనలు చేపట్టే ప్రాజెక్టులకు ఉమ్మడిగా డేటా సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు రష్యా, చైనాల మధ్య అంగీకారం కుదిరిందని రష్యా రోదసీ సంస్థ రస్కోమాస్ ప్రకటించింది. ఈ ప్రాజెక్టుల్లో రష్యా, చైనా శాస్త్ర, పారిశ్రామిక సంస్థలు, కంపెనీల ప్రమేయం వుంటుందని పేర్కొంది. ఇందుకు సంబంధించి ఇరు దేశాలు పరస్పరం సహకరించుకునేందుకు ఒప్పందంపై రస్కోమాస్, చైనా నేషనల్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్ (సిఎన్ఎస్ఎ) సంతకాలు చేశాయి. ఇరు దేశాల లూనార్ కార్యక్రమాలకు పరస్పరం సాయం అందించుకునే అవకాశాలను కూడా ఈ దేశాలు పరిశీలిస్తాయి. 2022లో రష్యన్ లూనా-26 ఆర్బిటర్‌ను ప్రయోగించే ప్రాజెక్టు, అలాగే 2023లో చంద్రుని దక్షిణ ధృవంపై దిగాలన్న చైనా ప్రతిపాదిత ప్రాజెక్టులపై రెండు దేశాలు పరస్పరం సహకరించుకుంటాయి.

పొరబాటుగా...మరో రోగికి బ్రెయిన్ సర్జరీ

నైరోబీ: ఆపరేషన్ చేసి కత్తెర కడుపులోనే మర్చిపోవడం.. కుడికాలికి బదులుగా ఎడమకాలికి శస్త్రచికిత్స చేయడం.. ఇలాంటి వార్తలు అప్పుడప్పుడూ వింటుంటాం. వైద్యుల నిర్లక్ష్యం కారణంగా ఇలాంటివి జరుగుతుంటాయి. ఇదంతా ఒక ఎత్తయితే.. ఏకంగా ఒకరికి బదులుగా మరో రోగికి ఆపరేషన్ చేశారు కెన్యాలోని కొందరు వైద్యులు. అది కూడా బ్రెయిన్ సర్జరీ(మెదడు శస్త్రచికిత్స). నాలుగు గంటల పాటు ఆపరేషన్ చేసిన తర్వాత తాము పొరబాటు చేశామని వైద్యులు గుర్తించడం గమనార్హం. గత ఆదివారం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కెన్యాలోని అతిపెద్ద ఆసుపత్రి అయిన కెన్యట్ట నేషనల్ హాస్పిటల్‌లో గతవారం ఇద్దరు రోగులు చేరారు. ఒకరు మెదడులో గడ్డతో, మరొకరు తల వాపుతో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి వచ్చారు. మెదడులో గడ్డ ఉన్న వ్యక్తికి సర్జరీ చేసి దాన్ని తొలగించాల్సి రావడంతో అక్కడి సిబ్బంది ఆ ఏర్పాట్లు చేశారు. అయితే ఆపరేషన్ గదిలోకి ఆ వ్యక్తిని కాకుండా పొరబాటుగా తల వాపుతో బాధపడుతున్న వ్యక్తిని తీసుకొచ్చారు. డాక్టర్లు కూడా చూసుకోకుండా రెండో వ్యక్తికే సర్జరీ మొదలుపెట్టారు. నాలుగు గంటల పాటు ఆపరేషన్ చేసి పుర్రెను తెరవగా.. అందులో ఎలాంటి గడ్డ కనబడలేదు. కంగు తిన్న వైద్యులు తాము తప్పు చేశామని గ్రహించి వెంటనే అతడికి తిరిగి కుట్లు వేసి అబ్జర్వేషన్‌లో పెట్టారు. ఇది కాస్తా మీడియాకు తెలియడంతో విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో సదరు ఆసుపత్రిపై సోషల్‌మీడియాలో విమర్శలు వెల్లువెత్తాయి. వెంటనే స్పందించిన వైద్యాధికారులు ఒక డాక్టర్, ఇద్దరు నర్సులు, అనస్థీటిస్ట్‌ను సస్పెండ్ చేశారు. ఆసుప్రతి సీఈవోను కూడా విధుల నుంచి తొలగించారు. అయితే ప్రస్తుతం ఆపరేషన్ చేసిన రోగి కోలుకున్నట్లు ఆసుపత్రి ఓ ప్రకటనలో తెలిపింది.

మొదటి పేజీ తరువాయి

ప్రజా ఐక్యతకు పోరాటం కొనసాగిస్తాం : సిపిఎం

పాటు ప్రభుత్వంలో ఉన్న వామపక్ష కూటమి ఓటమి చవిచూసిందని తెలిపింది. ఎన్నికలను ప్రభావితం చేసేందుకు భారీ మొత్తంలో ధనాన్ని వెచ్చించడమే గాక అనేక ప్రలోభాలకు బిజెపి పాల్పడిందని సిపిఎం విమర్శించింది. ప్రధాన ప్రతిపక్ష పార్టీ అయిన కాంగ్రెస్‌తో సహా వామపక్ష వ్యతిరేక ఓట్లన్నింటినీ బిజెపి తనకు అనుకూలంగా సంఘటితం చేసుకోగలిగిందని పేర్కొంది. సిపిఎంకు, వామపక్ష సంఘటనకు మద్దతుగా నిలిచిన 45 శాతం మంది ఓటర్లకు పొలిట్‌బ్యూరో కృతజ్ఞతలు తెలియచేసింది. ఎన్నికల్లో వెనుకబాటుకు దారితీసిన కారణాలను నిశితంగా సమీక్షించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలను తీసుకుంటామని తెలిపింది.

నేడు చలో గుంటూరు

జిల్లా నేతలు హాజరుకానున్నారు. దళితులు, మైనార్టీలు, ఆదివాసీలపై పెత్తందార్ల దాడులను అరికట్టడంలో ప్రభుత్వ వైఫల్యానికి చలో గుంటూరు నిదర్శనమని నాయకులు పేర్కొన్నారు. ప్రధానంగా గొట్టిపాడు దళితులపై దాడికి పాల్పడిన వారిలో ప్రధాన నిందితులను ఇప్పటికీ అరెస్ట్ చేయలేదు. ప్రధాన నిందితుల్ని అరెస్ట్ చేయాలని, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద వారిపై కేసులు నమోదు చేయాలని, గొట్టిపాడు కేసును పోలీసు విచారణ నుండి తప్పించి, సిబిసిఐడికి అప్పగించాలని, జన్మభూమి కమిటీలు రద్దు చేయాలని, గరగపర్రులో దళితులు కోరుకున్న ప్రాంతంలో అంబేద్కర్ విగ్రహం నెలకొల్పాలని, బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ తదితర డిమాండ్లతో సభ నిర్వహిస్తున్నారు. జి.శాంతకుమార్, సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు, కాంగ్రెస్ నాయకులు కొరివి వినయ్‌కుమార్, విసికె పార్టీ నాయకులు విద్యాసాగర్, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి టి.కృష్ణమోహన్, కెఎన్‌పిఎస్ నాయకులు కృష్ణ తదితరులు ఉల్ఫ్‌హాల్ గ్రౌండ్‌ను సందర్శించి ఏర్పాట్లు పరిశీలించారు.

త్రిపురలో బిజెపి గెలుపు

ఎగురవేసింది. బిజెపి 11 స్థానాల్లోనూ, దాని తాజా మిత్రపక్షమైన ఎన్‌డిపిపి 16 స్థానాల్లోనూ విజయం దక్కించుకున్నాయి. మరో నాలుగు స్థానాల్లో ఇతరులు విజయం సాధించారు. తాజా, మాజీ మిత్రులకు పోటాపోటీ ఫలితాలు వెలువడినా ఇక్కడ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేం దుకు కమలం పార్టీ కసరత్తు ముమ్మరం చేసింది.

మేఘాలయలో కాంగ్రెస్ పార్టీ ఆధిక్యాన్ని సాధించింది. 60 స్థానాలకుగానూ 59 స్థానాల్లో పోలింగ్ జరగ్గా కాంగ్రెస్ 21 స్థానాల్లో విజయభేరి మోగించింది. బిజెపి కేవలం రెండు స్థానాలనే దక్కించుంది. నేషనల్ పీపుల్స్ పార్టీ 19 స్థానాల్లో గెలుపొందింది. యునైటెడ్ డెమొక్రటిక్ పార్టీ (యుడిపి) 6 స్థానాల్లో విజయం సాధించాయి. ఇతరులు 11 స్థానాలు కైవసం చేసుకున్నారు. అతిపెద్ద పార్టీగా కాంగ్రెస్ అవతరించినా ఇక్కడ కూడా ప్రాంతీయ పార్టీలను కలుపుకొని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి తీరుతామని బిజెపి ప్రకటించింది.

జర్నలిస్టులకు ఇళ్లు సాధించేవరకు పోరాటం : ఎపియుడబ్ల్యూజె

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో జర్నలిస్టులందరికీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించిన మూడు పడకల ఇళ్ల నిర్మాణ పథకాన్ని సాధించే వరకు పోరాటం చేస్తామని ఎపియుడబ్ల్యూజె వెల్లడించింది. ఇందులో భాగంగా ఈ నెల 6న అన్ని జిల్లా, నియోజకవర్గ కేంద్రాల్లో ప్రదర్శనలు నిర్వహించాలని సూచించింది. యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు నల్లి ధర్మారావు అధ్యక్షతన శ్రీకాకుళంలో కార్యవర్గ సమావేశం జరిగింది. అనంతరం సమావేశ నిర్ణయాల్ని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐవి సుబ్బారావు వెల్లడించారు. ఇళ్లకు సంబంధించి ఇంతవరకు స్పష్టమైన నిర్ణయాలు వెల్లడికాకపోవడంతో జర్నలిస్టులు గందరగోళంలో ఉన్నారన్నారు. సిఎం చంద్రబాబు, సమాచారశాఖ మంత్రి కాలువ శ్రీనివాసులు సానుకూలంగా స్పందించారే తప్ప ఇప్పటికీ ఏ నిర్ణయమూ తీసుకోలేదన్నారు. కొత్త అక్రిడియేషన్లు ఏప్రిల్ 1 లోగా ఇవ్వాలని కోరారు. జర్నలిస్టుల పిల్లలకు అన్ని విద్యాసంస్థల్లో ఫీజులో 50శాతం రాయితీ ఇవ్వాలని, సంక్షేమానికి రూ.50 కోట్లు కేటాయించాలని కోరారు. జర్నలిస్టుల సంక్షేమానికి అనుగుణంగా రాష్ట్ర బడ్జెట్‌లో నిర్ణయాలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఐజెయూ ఉపాధ్యక్షులు అంబటి ఆంజనేయులు, కార్యవర్గ సభ్యులు ఆలపాటి సురేష్, రాజేంద్ర, అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.

లెక్కలు తేల్చారు

(మొదటి పేజీ తరువాయి)

ముందుకొచ్చింది. సుదీర్ఘంగా చర్చించిన కమిటీ ఎట్టకేలకు లెక్కలు తేల్చింది. జెఎఫ్‌సి తన నివేదికలో రాష్ట్ర ప్రభుత్వ కంటే కేంద్రాన్నే ఎక్కువ టార్గెట్ చేసినట్లుగా ఉంది.

విభజన హామీల అమలులో కేంద్రం బాధ్యత ఎంత ఉందో, వాటిని సాధించుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపైనా అంతే ఉందని జెఎఫ్‌సి నివేదిక స్పష్టం చేసింది. ప్రభుత్వ పెద్దలు రోజుకో ప్రకటన చేస్తూ ప్రజలను గందరగోళానికి గురి చేశారని, సమస్యల పరిష్కారానికి అటు కేంద్రం, ఇటు రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో కృషి చేయలేదని పేర్కొంది. శనివారం హైదరాబాద్‌లో జెఎఫ్‌సి కమిటీ సభ్యులు సమావేశమై తుది నివేదికను మీడియా ముందుంచారు. న్యాయంగా రావాల్సిన నిధుల్ని రాబట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని జెఎఫ్‌సి తేల్చి చెప్పింది. కేంద్రం ప్రకటించిన స్పెషల్ ప్యాకేజీ కింద రావాల్సిన నిధుల్లో నయాపైసా రాలేదని స్పష్టం చేసింది. లోటు బడ్జెట్ కింద ఇవ్వాల్సిన రూ.14,333గాను రూ.4118 కోట్లే ఇచ్చారని చెప్పింది. అలాగే వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు రూ.24,350 కోట్ల మేర ప్రతిపాదనలు పంపగా, అందులో రూ.2110 కోట్లు ఇచ్చి చేతులు దులుపుకుందని నివేదికలో పేర్కొంది. విభజన చట్టం ప్రకారం రూ.3820 కోట్ల ట్యాక్స్ రియంబర్స్‌మెంట్, విశాఖ-చెన్నై కారిడార్‌కు అవసరమైన రూ. 6000 కోట్లు, కాకినాడ పెట్రో కాంప్లెక్స్‌కు అవసరమైన రూ.5000 కోట్లు నేటికీ విడుదల చేయలేదని స్పష్టం చేసింది. ఇక విభజన చట్టం ప్రకారం రాష్ట్రానికి కేటాయించిన 11 జాతీయ విద్యా సంస్థలకు రూ.11,673 కోట్ల అంచనా వ్యయంలో ఇప్పటి వరకు కేవలం రూ.853 కోట్లు మాత్రమే ఇచ్చారని పేర్కొంది. పోలవరం ప్రాజెక్టుకు ఇచ్చిన నిధులు మినహాయించినా ఇంకా కేంద్రం ఇవ్వాల్సింది రూ.74,542 కోట్లని లెక్క తేల్చింది. ముఖ్యంగా విభజన చట్టం, పార్లమెంటు సాక్షిగా ప్రధాని మన్మోహన్ సింగ్ ఇచ్చిన ప్రత్యేక హోదా హామీని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయని కమిటీ అభిప్రాయపడింది. లోటు బడ్జెట్‌లో భాగంగా ఉన్న రుణ విమోచన, పెన్షన్, డిస్కంల నష్టాల సర్దుబాటు, వేతన సంఘం బకాయిలపై రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ప్రతిపాదనల్ని బుట్టదాఖలు చేసిందని పేర్కొంది. వ్యవసాయ ఉత్పత్తిలోటు వ్యయం రూ.3,068.35 కోట్లు, రైతు సాధికార సమితి ఏర్పాటుకు రూ. 4001.32 కోట్లు, డిస్కం నష్టాల లోటు పూడ్చుడానికి రూ.1500 కోట్లు, పెన్షన్‌ల కోసం రూ.3391.20 కోట్లు ఇవ్వాల్సి ఉండగా, వాటిని పక్కన పెట్టి కేవలం రూ.4117 కోట్లు ఇచ్చి చేతులు దులుపుకుందని పేర్కొంది.

హోదాతోనే ఏపీకి న్యాయం : పవన్ కల్యాణ్

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తేనే నూటికి నూరు శాతం న్యాయం జరుగుతుదని జనసేన అధినే పవన్ కల్యాణ్ అన్నారు. జెఎఫ్‌సి సమావేశం అనంతరం కమిటీ సభ్యులతో కలిసి మీడియాతో మాట్లాడిన ఆయన విభజన చట్టంలో తక్షణం ప్రజలకు ఉపయోగపడే 11 అంశాలను జెఎఫ్‌సి ముందుకు తెచ్చిందన్నారు. ప్రజలను గందరగోళానికి గురిచేయడంలో బిజెపి, టిడిపిలకు సమాన వాటా ఉందన్నారు. సమస్యల పరిష్కారానికి అటు కేంద్రం, ఇటు రాష్ట్ర ప్రభుత్వం బాధ్యతతో పని చేయలేదన్నారు. ఇలాంటి పరిణామాలు మంచిది కాదని, సామాజిక అనిశ్చితికి, అస్థిరతకు దారితీసే ప్రమాదముందని హెచ్చరించారు. 2014లో రావాల్సిన బకాయిలపై ఇంకా అవగాహన రాలేదని అరుణ్‌జైట్లీ చెప్పడంలో అర్థమేంటని ప్రశ్నించారు. కేవలం నలుగురు ఐఏఎస్ అధికారులను సాయం చేయమని అడిగితే, వందల పేజీలను పరిశీలించి నిగ్గు తేల్చితే, ప్రజలు కష్టపడి పన్నులు కడుతూ ఇంతపెద్ద యంత్రాంగాన్ని పోషిస్తుంటే, 2014-15 బకాయిలపైనే ఇంకా స్పష్టత రాలేదని చెబుతున్నారంటే ఎలా అర్థం చేసుకోవాలని నిలదీశారు. 11 జాతీయ స్థాయి విద్యా సంస్థలకు సంబంధించి నిధులు రూ. 11 వేలు కోట్లు ఇవ్వాల్సి ఉండగా రెండు విడతలుగా రూ.853 కోట్లు మాత్రమే ఇచ్చారన్నారు. నాలుగేళ్లలో 5 శాతం నిధులిస్తే విద్యార్థులు, యువత ఎప్పటికి ప్రయోజనం పొందుతారని నిలదీశారు. పైగా బిజెపి, టిడిపిలు పుండుమీద కారం చల్లినట్లు పరస్పర విరుద్ధ ప్రకటనలతో మరింత గందరగోళంలోకి నెట్టేశాయని మండిపడ్డారు. హోదానో, ప్యాకేజో సిఎం చంద్రబాబు తేల్చుకోలేకపోయారని, అంతటి అనుభవజ్ఞుడు అయోమయానికి గురైతే, ప్రజలకు ఎలా తెలుస్తుందన్నారు. నాలుగేళ్లుగా కేంద్రాన్ని ఎందుకు నిలదీయలేదని ప్రశ్నించారు. షెడ్యూల్ ప్రకారం పోలవరంను కేంద్రమే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. నిధులు, పనుల బాధ్యతను కేంద్రమే చూసుకోవాలని, పోలవరం ప్రాజెక్టు ముందుకెళ్లకపోతే ఆ బాధ్యత రాష్ట్రానిదేనన్నారు. రైల్వే జోన్ విషయంలోనూ ఇలాగే వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రం నుంచి ఏడడిగినా సాధ్యం కాదని చెబుతున్నారని, అలాంటప్పుడు రాష్ట్రాన్ని ఎలా విభజించారని నిలదీశారు. రాంవిలాస్ పాశ్వన్ సొంత ఊరు హాజీపూర్‌ను రైల్వే జోన్‌గా చేయగలిగినప్పుడు విశాఖను ఎందుకు చేయలేరని ప్రశ్నించారు. పార్లమెంట్‌లో ఇచ్చిన మాటను వెనక్కి తీసుకుంటే ప్రజల్ని పాలించే నైతిక హక్కు కోల్పోతారన్న సర్దార్ వల్లభాయిపటేల్ మాటల్ని ఒకసారి గుర్తు చేసుకోవాలని సూచించారు. దుగ్గరాజపట్నం పోర్టుకు పర్యావరణ సమస్యలు, భద్రతాసమస్యలు ఉన్నాయని కేంద్రం చెబుతోందని, ప్రత్యామ్నాయ ప్రదేశాన్ని చూపాలని రాష్ట ప్రభుత్వాన్ని అడిగితే ఇంత వరకు ఎందుకు చూపలేకపోయారో సమాధానం చెప్పాల్సిన అవసరముందన్నారు. కేంద్రంలో రాష్ట్రంలో బిజెపి, టిడిపిలే ప్రభుత్వాన్ని పంచుకుంటున్నాయని, అలాంటప్పుడు విభజన హామీలు నెరవేర్చడంలో ఉన్న సమస్యలేంటో అర్థం కావడం లేదన్నారు. సమస్యల పరిష్కారంలో అన్యాయం జరిగిందని ప్రజల్లో క్లారిటీ ఉన్నప్పుడు మీకెందుకు కనబడటంలేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గందరగోళ పరిస్థితులకు చరమగీతం పాడి స్పష్టత ఇవ్వాలని కోరారు. తాను ప్రజల పక్షమని, అవిశ్వాస తీర్మానం మార్చి 5న పెడితేనే నిబంధనల ప్రకారం పార్లమెంటులో చర్చకు వస్తుందన్నారు. మార్చి21న వైఎస్ఆర్ సిపి అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెడితే టిడిపి కచ్చింతంగా మద్దతు ఇవ్వాల్సిందేనని స్పష్టం చేశారు.

ఉన్నంతలో స్పష్టత ఇచ్చాం : జయప్రకాశ్ నారాయణ

జెఎఫ్‌సి ఇచ్చిన లెక్కలే తుది లెక్కలు కావని, తమకు సమాచారం ఉన్నంతలో స్పష్టత ఇచ్చే ప్రయత్నం చేశామని లోక్‌సత్తా వ్యవస్థాపక అధ్యక్షులు జయప్రకాశ్ నారాయణ అన్నారు. విభజన చట్టంలో తక్షణం ప్రజలకు అవసరమైన 11 అంశాల్లో 7 అంశాలు మాత్రమే చర్చకొచ్చాయని తెలిపారు. హక్కుగా రావాల్సినవి చాలా ఉన్నాయని, అందరం కలిసి రాష్ట్ర హక్కుల్ని కాపాడుకుందామని పిలుపునిచ్చారు. ప్రత్యేక హోదాతో రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని తేల్చి చెప్పారు. హోదా వస్తే కేంద్రం వాటా 90 శాతం, రాష్ట్ర వాటా 10 శాతంగా ఉంటుందని, మిగిలినవి కూడా బాండ్ల రూపంలో ఇస్తారని చెప్పారు. వెనుకబడిన ప్రాంతాలకు న్యాయంగా ఇవ్వాల్సిన నిధులు ఇవ్వడం లేదని, ఏటా రూ.350 కోట్లు ఇస్తే...ఎప్పటికవి అభివృద్ధి చెందుతాయన్నారు. విభజన చట్టాన్ని పద్ధతి ప్రకారం రూపొందించకపోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని ఆరోపించారు.

కాంగ్రెస్ బిజెపి దొందూ దొందే

(మొదటి పేజీ తరువాయి)

నిజమైన మార్పును తెచ్చే అటువంటి మార్పునకు త్వరలో బీజం పడనుంది. ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇప్పటికే పలువురితో మాట్లాడాను. వారు సానుకూలంగా స్పందించారు' అని తెలంగాణ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావు అన్నారు. హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో శనివారం టిఆర్ఎస్ పార్లమెంటరీ సమావేశం జరిగింది. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఏపికి ప్రత్యేక హోదా, కేంద్ర బడ్జెట్, జిఎస్‌టి, నోట్ల రద్దు అంశాలపై వేసిన ప్రశ్నలకు కెసిఆర్ సమాధానాలిచ్చారు. రాజకీయాల్లో మార్పు కోసం థర్డ్ ఫ్రంటో, మరొకటో వస్తుందని చెప్పారు. అవసరమైతే దానికి తానే నాయకత్వం వహిస్తానని ఒక ప్రశ్నకు జవాబిచ్చారు. ఈ ఫ్రంట్‌లోకి చంద్రబాబు వస్తే తీసుకుంటారా.? అని ప్రశ్నించగా.. ఎందుకు అహ్వానించం? ఆయనతో పాటు ఎవరొచ్చినా ఆహ్వానిస్తామన్నారు. బడ్జెట్ సమావేశాల్లో విభజన హామీలపై కేంద్రాన్ని నిలదీస్తామన్నారు. మన దేశం కంటే పెద్దదైన చైనా అభివృద్ధిలో ముందుకు దూసుకెళ్తుంటే.. మనం మాత్రం ఇంకా ముందుకు పోవడం లేదని, కాంగ్రెస్, బిజెపిలు అనుసరిస్తున్న విధానాలే దీనికి కారణమని చెప్పారు. పంటలకు కనీస మద్దతు ధర కూడా ప్రకటించలేక పోతున్నారని విమర్శించారు. వరికి మద్దతు ధర మరో రూ.500 పెంచమని కోరినా. పెంచడం లేదన్నారు. రాష్ట్రాలపై పెత్తనం ఒదులుకోకూడదన్న విధంగా కేంద్ర నిర్ణయాలు ఉంటున్నాయని పేర్కొన్నారు. అందుకే రాజకీయాల్లో మార్పు కోసం కొత్త ప్రయత్నాలు జరుగుతున్నట్టు చెప్పారు.

తాను దేశ రాజకీయాల వైపు చూస్తున్నాన్న భయంతోనే స్థానిక బిజెపి నాయకులు లేని అంశాలను, మాట్లాడని అంశాలను తెరమీదకు తెస్తున్నారని విమర్శించారు. ఇందులో భాగంగానే ప్రధాని మోడీని తాను 'గారు' అని సంబోధించినా మరో విధంగా అన్నట్టు దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. తాను ఎవరికీ వ్యతిరేకంగా మాట్లాడనని, సిస్టం గురించే మాట్లాడుతానని చెప్పారు. ప్రధానమంత్రిని విమర్శించవద్దని రాజ్యాంగంలో ఎక్కడైనా ఉందా.? అని నిలదీశారు. ప్రశ్నిస్తే అరెస్టులు చేస్తారా.? అని ప్రశ్నించారు. 'నన్ను ముట్టుకొని చూడండి.. భస్మమై పోతారు' అని ఆయన హెచ్చరించారు. అంశాల వారిగా బిజెపికి మద్దతిచ్చామని, ఎన్‌డిఏలో భాగస్వామ్యం కాదని ఒక ప్రశ్నకు ఆయన సమాధానిమిచ్చారు.

'అవిశ్వాస తీర్మానం' చీప్ పాలిటిక్స్

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదాపై పెడుతున్న అవిశ్వాస తీర్మానానికి మద్దతిస్తారా.? అన్న ప్రశ్నకు అవన్నీ చీప్ పాలిటిక్స్ అని తోసిపుచ్చారు. 'అవిశ్వాసం దేశ రాజకీయాల్ని మారుస్తుందా?' అని ప్రశ్నించారు. ఏపికి ప్రత్యేక హోదాపై ఆ రాష్ట్రానికి చెందిన అధికార, ప్రతిపక్షాలు స్పష్టంగా లేవన్నారు. కేంద్రానికి కూడా స్పష్టత లేదన్నారు. ప్రత్యేక హోదా ఇస్తానని మోడీ ప్రకటించినప్పుడు ఇచ్చి తీరాలే కానీ, ఇలా వాయిదాలు వేయడం సరికాదన్నారు. హోదాపై టిడిపి, బిజెపి వైఖరిపై మాట్లాడుతూ 'నేను కొట్టినట్టు చేస్తా. నీవు ఏడ్చినట్టు చేయాలి.' అన్నట్టుగా రాజకీయాలు ఉన్నాయని విమర్శించారు.

పొలిటికల్ బడ్జెట్

(మొదటి పేజీ తరువాయి)

వెళతారని వైసిపి అధినేత జగన్మోహన్‌రెడ్డి ప్రకటించారు. అయితే నాలుగేళ్లుగా ఆంధ్రప్రదేశ్‌కు చేయాల్సిందంతా చేశామని, అయినా తమను విమర్శించడం సరికాదని, దీనిపై అసెంబ్లీలోనే మాట్లాడతామని బిజెపి పక్షనేత విష్ణుకుమార్‌రాజు వెల్లడించారు. సోమవారం మొదలయ్యే సమావేశాల్లో ప్రభుత్వం ఏవిధంగా వ్యవహరించనుందనే అంశం చర్చనీయాంశంగా మారింది. ఇప్పటివరకూ కేంద్రాన్ని వెనకేసుకొచ్చిన టిడిపి, ఇప్పుడు అనూహ్యంగా దానికి వ్యతిరేకంగా మాట్లాడుతోంది. మరోవైపు ఇప్పటి వరకూ ప్రవేశపెట్టిన బడ్జెట్లన్నీ ఒకెత్తయితే, ఈ బడ్జెట్ మాత్రం కీలకం కానుంది. ముఖ్యంగా పోలవరం, రాజధాని అంశాలకే ప్రభుత్వం ఎక్కువ ప్రాధాన్యత ఇస్తోంది. ఇటీవల జరిగిన ప్రీ బడ్జెట్ సమావేశాల్లోనూ పోలవరంపై ఎక్కువ దృష్టి సారించారు. నిర్మాణ వ్యవహారం కేంద్రం పరిధిలో ఉన్నా పునరావాసం చేయాల్సిన బాధ్యత రాష్ట్రంపైనే ఉంది. దీనికి కేంద్రం నిధులు ఎంతివ్వాలనేది ఇంతవరకు స్పష్టం కాలేదు. తాత్కాలికంగా ఈ ప్రాజెక్టును పూర్తి చేయడం ద్వారా కీలకప్రచార అంశంగా మార్చుకోవాలనే ప్రయత్నాలు చేస్తోంది. దీంతోపాటు సంక్షేమ రంగాలపైనా ప్రభుత్వం దృష్టిపెట్టినట్లు తెలిసింది. మరోవైపు ప్రతిపక్ష వైసిపి కూడా గత అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించిన వ్యూహాన్నే ఈసారి కూడా అనుసరిస్తోంది. సమావేశాలకు వెళ్లకూడదని పార్టీపరంగా నిర్ణయించినట్లు ఇప్పటికే జగన్ ప్రకటించారు. బిజెపి మాత్రం ఈసారి తీవ్ర ఆగ్రహంతో ఉంది. కేంద్రం నుండి నాలుగేళ్లలో ఏ రాష్ట్రానికీ ఇవ్వనంత ఇచ్చామని, అయినా టిడిపి తమను రాజకీయంగా ఇబ్బందులు పెడుతోందని ఆ పార్టీ ఎమ్మెల్యేలు చెబుతున్నారు. రాజకీయంగా నష్టం కలిగించాలనుకుంటే తాము చేయాల్సింది చేస్తామని మంత్రి మాణిక్యాలరావు తెలిపారు. గత బడ్జెట్లో కేటాయింపులు, వాటి ఖర్చు తదితర అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని చెబుతున్నారు. మొత్తంగా ఈ బడ్జెట్ సమావేశాలు టిడిపి ప్రభుత్వ ఐదేళ్ల కాలానికి పూర్తిస్థాయి చివరి బడ్జెట్ కావడంతో చర్చనీయాంశంగానే మారింది. రాజకీయ మైలేజీపైనే అధికార, ప్రధాన ప్రతిపక్షాలు దృష్టిసారించాయి.

నేడు మన్యం బంద్

(మొదటి పేజీ తరువాయి)

విజయవంతం చేయాలని కోరుతూ గిరిజన సంఘం ఆధ్వర్యాన శనివారం విశాఖ జిల్లా పెదబయలు మండల కేంద్రంలో జీపుజాతా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు బొండా సన్నిబాబు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, దీన్ని నిరసిస్తూ 50 గిరిజన సంఘాల మద్దతుతో మన్యం బంద్‌కు పిలుపునిచ్చామని చెప్పారు. ఈ బంద్‌లో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్రానికి, గిరిజనులకు న్యాయం జరిగేవరకు పోరాటాలు కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు శరభన్న, కొమటి, గంగాధర్, సిపిఐ నాయకులు కూడా నర్సింగరావు, జుంబు దేవరాజు పాల్గొన్నారు.

ప్రేమే ఉంది ఏ వారం


'ఛల్ మోహన్ రంగ'లో నితిన్

నితిన్, మేఘా ఆకాష్ జంటగా నటించిన చిత్రం 'ఛల్ మోహన్ రంగ'. ఇటీవల ఈ చిత్రంలో 'గ ఘ మేఘ..' అనే పల్లవితో సాగే ఓ గీతాన్ని విడుదల చేశారు. దానికి మంచి స్పందన లభించింది. తాజాగా శనివారం మాత్రం సినిమా టీజర్‌లో ఏ విషయాన్ని అయితే చెప్పారో అదే విషయాన్ని పాట రూపంలో వారం వారం ప్రేమికుల మధ్య జరిగే సంఘర్షణను చెప్పారు. 'ఫస్ట్‌లుక్ సోమవారం.. మాట కలిపె మంగళవారం.. బుజ్జిగుంది బుధవారం.. గొడవైంది గురువారం.. సారీ అంది శుక్రవారం.. సెన్సార్ కట్ శనివారం.. రెస్ట్ లేదు ఆదివారం.. ప్రేమే ఉంది ఏ వారం..' అంటూ సాగే ఈ పాట ఆకట్టుకుంటోంది. వారంలో ఏడు రోజులు ఉంటే, ఒక్కో రోజుకి ఒక్కో ప్రత్యేకత ఉందంటూ తనదైన చమత్కారాన్ని వాడి కేదారనాథ్ ఈ పాటకు సాహిత్యమందించారు. నాకాష్ అజీజ్ తన స్వరంతో పాటను శ్రోతలకి మరింత చేరువుగా తీసుకొచ్చారు. సంగీత, సాహిత్యాల కలబోత చిత్రంలోని పాటలు అన్నారు దర్శకుడు కృష్ణ చైతన్య. నిర్మాత ఎన్. సుధాకర్ రెడ్డి చిత్రాన్ని ఏప్రిల్ ఐదో తేదీన ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్నట్టు ప్రకటించారు. దర్శకుడు త్రివిక్రమ్ ఈ చిత్రానికి కథను అందించారు. శ్రేష్ఠామూవీస్, పవన్ కల్యాణ్ క్రియేటివ్ వర్క్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి.

పూర్తి చేయలేదు

ఎన్టీఆర్, త్రివిక్రమ్ సినిమా అనే సరికే క్రేజ్ పెరిగిపోయింది. ఆ సినిమాలో లుక్ కోసం డిసెంబర్ నుంచి తారక్ తెగ కరసత్తులు చేస్తున్నారు. కొత్త లుక్‌లో కనిపించాలని దాని కోసం ట్రైనర్ లాయిడ్ స్టీవెన్స్ ఆధ్వర్యంలో తర్ఫీదు పొందుతున్నారు. బాలీవుడ్ హీరోలు హృతిక్ రోషన్, రణ్‌వీర్ సింగ్ కూడా స్టీవెన్స్ దగ్గరే శిక్షణ తీసుకుంటున్నారు. ఇటీవల అభిమానులంతా ఈ చిత్రంలో ఎన్టీఆర్ ఎలా ఉండబోతున్నారో? అని సామాజిక మాధ్యమంలో తెగ ఆరా తీయడంతో స్పందించారు. 'త్వరలోనే మీ ముందుకొస్తా. సహనం పాటించండి' అని ఎన్టీఆర్ పేర్కొన్నారు. ఇప్పుడు మళ్లీ తన తర్ఫీదుపై అప్‌డేట్‌ను ఇచ్చారు ట్రైనర్ లాయిడ్ స్టీవెన్స్. జిమ్‌లో తారక్ వ్యాయామం చేస్తున్న వీడియో ఒకటి పోస్టు చేస్తూ...'మేము ఇంకా పూర్తి చేయలేదు' అని పేర్కొన్నారు. ఈ చిత్రంలో ఎన్టీఆర్ సరసన ఎవరు హీరోయిన్‌గా చేస్తారన్నది ఇంకా స్పష్టత రాలేదు. బహూశా శ్రద్ధా కపూర్ చేసే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. ఎస్.ఎస్. తమన్ బాణీలు అందించనున్నారు.


ఎన్టీఆర్

ఉగాదికి తెలుస్తుంది


నాగ చైతన్య

నాగ చైతన్య, దర్శకుడు చందు మొండేటి కాంబినేషన్ అంటే వెంటనే 'ప్రేమమ్' గుర్తుకొస్తుంది. ఇప్పుడు వీరి కాంబినేషన్‌లో 'సవ్యసాచి' తెరకెక్కుతోంది. ఇందులో నిధి అగర్వాల్ కథానాయిక. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రంలో మాధవన్, భూమికలు ప్రత్యేక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాలో చైతూ లుక్ ఎలా ఉండబోతుందన్నది ఈనెల 18వ తేదీన తెలుస్తుందట. ఆ రోజు అంటే ఉగాదిని పురస్కరించుకుని ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు మైత్రీ మూవీ మేకర్స్ శనివారం ప్రకటించారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాతలు వై.నవీన్, వై.రవిశంకర్, మోహన్ మాట్లాడుతూ 'మా యూనిట్ సభ్యులందరికీ 'సవ్యసాచి' ఒక స్పెషల్ ఫిలిమ్. ప్రస్తుతం హైదరాబాద్‌లో నాగచైతన్య, భూమికలపై కీలక సన్నివేశాల చిత్రీకరణ జరుగుతోంది. ఈ షెడ్యూల్ పూర్తవ్వగానే తర్వాత షెడ్యూల్ కోసం టీం అమెరికా వెళ్లనున్నారు. సినిమా ఫస్ట్ లుక్‌ను మార్చి 18న విడుదల చేయాలనుకొంటున్నాం. జూన్ 14న విడుదల చేసేందుకు సన్నద్ధమవుతున్నాం. ఆడియన్స్ ను ఆశ్చర్యపరిచే స్థాయిలో సినిమా ఉంటుంది. ఆర్.మాధవన్ పాత్ర సినిమాకి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది' అని అన్నారు.


శ్రీదేవి, జాన్వి

అమ్మ నువ్వు గర్వపడేలా చేస్తా

- జాన్వి

'అమ్మ నువ్వు గర్వపడేలా చేస్తాను. నిన్ను చూసి నేను ఎంత గర్వపడ్డానో.. అదే స్థాయిలో నన్ను చూసి నువ్వు గర్వపడే రోజు వస్తుందని ఆశిస్తూ పనిచేస్తా. ఇదే ఆలోచనతో ప్రతిరోజు నిద్రలేస్తానని ప్రతిజ్ఞ చేస్తున్నా. ఎందుకంటే నువ్వు ఇక్కడే ఉన్నావు.. దాన్ని నేను అనుభూతి చెందుతున్నా' అని శ్రీదేవి తనయ జాన్వి కపూర్ పేర్కొన్నారు. శ్రీదేవి గురించి తన మనసులో ఉన్న భావాలను ఓ లేఖ రూపంలో రాశారు. 'నా హృదయంలో తీరని లోటు ఒకటి ఏర్పడింది. దాంతో ఎలా జీవించాలన్న విషయాన్ని నేర్చుకోవాలి. ఇంతలోటు ఉన్నప్పటికీ ఇంకా నేను నీ (శ్రీదేవి) ప్రేమ అనుభూతిని పొందుతున్నాను. నువ్వు నన్ను బాధ నుంచి, నొప్పి నుంచి సంరక్షిస్తున్నట్లే అనిపిస్తోంది. నేను కళ్లు మూసిన ప్రతిసారి.. గుర్తు చేసుకోవడానికి కేవలం మంచి అనుభూతులే ఉన్నాయి. ఇలా చేసింది నువ్వే అని నాకు తెలుసు' అని శ్రీదేవిని గుర్తు చేసుకున్నారు జాన్వి. తమ జీవితాల్లోకి శ్రీదేవి రావడం తమ అదృష్టమని చెప్పారు. 'నా స్నేహితులు ఎప్పుడూ 'నువ్వు హ్యాపీగా ఉంటావు' అంటుండేవారు. ఆ సంతోషానికి కారణం నువ్వేనని నాకు ఇప్పుడు అర్థమైంది' అని పేర్కొన్నారు. తన జీవితంలో శ్రీదేవి ఒక భాగమని, తన ప్రాణ స్నేహితురాలని చెప్పుకున్నారు. 'నువ్వు నాలో, ఖుషిలో, నాన్నలో నిండి ఉన్నావు. నువ్వు మాపై వేసిన ముద్ర చాలా బలమైనది. మేము జీవించడానికి అది చాలు.. కానీ నీ లోటును తీర్చడానికి మాత్రం అది సరిపోదు' అని జాన్వి లేఖలో పేర్కొన్నారు.

శ్రీదేవి బయోపిక్ తీయడం లేదు : వర్మ



శ్రీదేవి మరణ వార్త విన్నవెంటనే దేవుడ్ని సైతం తిట్టేశారు దర్శకుడు రామ్ గోపాల్ వర్మ. ఇటువంటి తారలపై బయోపిక్‌లు తీయడం రామ్ గోపాల్ వర్మ శైలి. అందరూ అలా అనుకొనే శ్రీదేవి బయోపిక్‌ను వర్మ తీసేందుకు సన్నాహాలు చేస్తున్నారని వార్తలు వచ్చాయి. దానిపై ఈయన శనివారం ట్విట్టర్ వేదికగా స్పందించారు. తాను శ్రీదేవి బయోపిక్ తీయడం లేదని స్పష్టం చేశారు. 'శ్రీదేవి బయోపిక్ తీస్తున్నానంటూ కొన్ని మీడియా వర్గాలు రాస్తున్న కథనాలు అవాస్తవం. ఆ ప్రయత్నం అవివేకం. ఎందుకంటే శ్రీదేవిలా ఆ పాత్రను పోషించగల నటి ఒక్కరూ లేరు' అని పేర్కొన్నారు.

కంప్యూటర్ గేమ్స్‌కు బానిసైన కుర్రోడి కథ

విజయ్ దేవరకొండ 'అర్జున్ రెడ్డి' తర్వాత చేస్తున్న సినిమా 'ఏ మంత్రం వేశావే'. శివానీసింగ్ నాయికగా నటిస్తుంది. గోలీసోడా ఫిలిమ్స్ నిర్మాణంలో సురక్ష్ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మల్కాపురం శివకుమార్ సమర్పణలో శ్రీధర్ మర్రి స్వీయ దర్శకత్వంలో రూపొందుతోంది. ఈ చిత్రాన్ని ఈనెల తొమ్మిదో తేదీన ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నట్టు దర్శక నిర్మాతలు శనివారం ప్రకటించారు. చిత్ర దర్శక నిర్మాత శ్రీధర్ మాట్లాడుతూ 'ప్రస్తుతం ఇప్పుడు టెక్నాలజీ పరంగా అందరూ సోషల్ మీడియాకి బానిసలైపోయారు. అలాంటి కాన్సెప్ట్‌తో చేసిన సినిమాయే ఇది. కంప్యూటర్ గేమ్స్‌కు బానిసైన హీరోని.. ఆన్‌లైన్‌లో పరిచయమైన హీరోయిన్ ఎలా మార్చుకుంది. తనకు మానవ విలువలను, సంబంధాలను ఎలా తెలియజేసిందనేదే కథ. రొమాంటిక్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ సినిమాకు సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుని క్లీన్ యు సర్టిఫికేట్‌ను పొందింది. 2014లో సినిమా షూటింగ్‌ను ప్రారంభించాం. 2015లో చిత్రీకరణను పూర్తి చేశాం. అయితే నేను శాన్‌ఫ్రానిస్కోలో ఉండటం వల్ల పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు ఆలస్యమయ్యాయి. దర్శకుడిగా నా తొలి సినిమా. ఇండిపెండెంట్ సినిమా గురించి అధ్యయనం చేసి తొలిసారి దర్శకత్వం చేసిన సినిమా ఇది' అని అన్నారు.


విజయ్ దేవరకొండ, శివానీ సింగ్

నారాయణ మూర్తి ...'అన్నదాత సుఖీభవ'



స్నేహచిత్ర పిక్చర్స్ పతాకంపై ఆర్.నారాయణమూర్తి రూపొందిస్తున్న చిత్రం 'అన్నదాత సుఖీభవ'. 'పొద్దు వాలక ముందే నాగలిని భుజాన వేసుకుని పొలానికి వెళ్లి అందరికీ అన్నం పెట్టే రైతు పరిస్థితి నేడు ఎలా ఉంది. రైతు తన ఉనికిని కోల్పోతున్నాడు.దేశానికి వెన్నెముక అన్న రైతు వెన్నెముక విరిగిపోతుంది. రైతే రాజు అన్న నానుడి ఇప్పుడు లేదు. రైతు దయనీయంగా తయారవుతున్నాడు. అన్నదాతా సుఖీభవ కాస్త.. అన్నదాత దుఃఖీభవ అయిపోయింది. దానికి కారణం ఏమిటి? 2009 నుండి నేటి వరకు మూడు లక్షల 25 వేల మంది రైతులు ఎందుకు ఆత్మహత్యలు చేసుకున్నారు? అనే అంశంపై చర్చిస్తూ..ఈ సినిమాను రూపొందించాం' అని నారాయణమూర్తి శనివారం మాట్లాడుతూ అన్నారు. 2005లో అప్పటి కేంద్ర ప్రభుత్వం రైతుల కోసం స్వామినాథన్ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. స్వామినాథన్ కమిటీ చేసిన సిపారసుల అమలు జరిగిందా? లేదా? అన్నది చెప్పే ప్రయత్నం చేశామన్నారు. 'నేడు మన దేశంలో సామాజికంగా వెనుకబడ్డ వర్గమేదని అంటే అది రైతులు మాత్రమే. లాల్ బహదూర్ శాస్త్రి అప్పట్లో రైతుకు గిట్టుబాటు ధరలను కల్పించి అదుకున్నారు. కానీ నేడు ఎవరు అలా చేయడం లేదు. వ్యవసాయం దండగ కాదు.. పండుగ అని చెప్పే చిత్రమే 'అన్నదాత సుఖీభవ' అని చెప్పుకొచ్చారు. ఈ చిత్రానికి వంగపండు సాహిత్యమందించారని పేర్కొన్నారు నారాయణ మూర్తి.

దిగొచ్చే వరకూ కలసికట్టుగా ఉండాలి

- టీఎఫ్‌సీసీ ఛైర్మన్ ప్రతాని రామకృష్ణగౌడ్


సాయి వెంకట్, ప్రతాప రామకృష్ణ గౌడ్

డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్లు దిగే వచ్చే వరకు అంతా కలిసికట్టుగా ఉండాలని తెలంగాణ ఫిలించాంబర్ ఆఫ్ కామర్స్ విజ్ఞప్తి చేసింది. డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్ల తీరును నిరసిస్తూ శుక్రవారం నుండి ఐదు రాష్ట్రాల నిర్మాతల మండలి సంయుక్తంగా థియేటర్ల బంద్ చేస్తోన్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా తెలంగాణ ఫిలించాంబర్ ఆఫ్ కామర్స్ శనివారం మీడియా సమావేశం ఏర్పాటు చేసింది. టీఎఫ్‌సీసీ ఛైర్మన్ ప్రతాని రామకృష్ణ మాట్లాడుతూ 'శుక్రవారం నుండి తమిళనాడు, కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో థియేటర్స్ బంద్ సక్సెస్ ఫుల్‌గా జరుగుతోంది. దీనికి సహకరిస్తోన్న ఐదు రాష్ట్రాల నిర్మాతలకు, డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబీటర్లు, ప్రజలకు ధన్యవాదాలు తెలుపుకుంటున్నా. మొదటి నుంచి డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్స్ విధానంపై మేము పోరాటం చేస్తూ వచ్చాం. ఇప్పుడు నాలుగు భాషల సినీ పరిశ్రమ ఒకే తాటిపైకొచ్చి ఒక జేఏసీగా ఏర్పడి డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్ల అద్దెలు తగ్గే వరకు పోరాటం చేయడం శుభ పరిణామం. మేము కూడా వారికి అన్ని విధాలుగా మద్దతు ప్రకటిస్తూ వారితో కలిసి ముందుకెళ్తున్నాం. డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్స్ దిగే వచ్చే వరకు అంతా కలిసికట్టుగా ఉండాలని కోరుకుంటున్నా. థియేటర్స్ బంద్ వరకు వచ్చారంటే డిజిటల్ రేట్ల వల్ల నిర్మాతలు ఎంత నష్టపోతున్నారో, ఎన్ని ఇబ్బందులు పడుతున్నారో అర్థం చేసుకోవచ్చు. దీని వల్ల ఎన్నో చిత్రాలు విడుదలకు కూడా నోచుకోకుండా ఉన్నాయి. క్యూబ్ , యుఎఫ్ఓ, పీఎక్స్‌డీ వారు ఐదేళ్ల తర్వాత ఫ్రీ సర్వీస్ చేస్తామని చేసిన అగ్రిమెంట్ కు కట్టుబడి ఉండండి. లేదా ఛార్జెస్ తగ్గించండి. లేదంటే మీరు పక్కకు తొలిగితే మేము కొత్త కంపెనీలతో ముందుకెళ్తాం. మా డిమాండ్స్ తీరే వరకు థియేటర్స్ బంద్ మాత్రం ఆగదు. ఇక మీదట కూడా అందరూ థియేటర్స్ బంద్ కు సహకరించాలని కోరుకుంటున్నా' అని అన్నారు.

వాళ్లకు మనోళ్లు కొందరు మద్దతిస్తున్నారు

ప్రస్తుతం జరుగుతున్న సమస్యను థియేటర్స్ బంద్ అని అనడం కంటే నిరసన వ్యక్తం చేస్తుండటం అని అనొచ్చు అని నిర్మాత మల్కాపురం శివ అన్నారు. ఆయన మట్లాడుతూ 'ఒకప్పుడు థియేటర్స్‌లో ప్రొజెక్టర్ ఇన్‌స్టాల్ చేయడానికి 4-5 లక్షలు రూపాయలు అవుతుందని అన్నారు. సరేనని ఎగ్జిబిటర్స్ అందరూ అంతా మొత్తాన్ని ఒకేసారి కట్టలేరని 104 వారాల్లో ఆ మొత్తాన్ని కట్టేలాగా... అది పూర్తైన తర్వాత రెండు నుండి మూడు వేల వరకు సర్వీస్ చార్జీలు కడితే సరిపోతుందని ముందు మాటలు కుదిరాయి. వారి మాటలు నమ్మి ఎగ్జిబిటర్స్ అందరూ సంతకాలు పెట్టారు. ఆ మాట ప్రకారం ఓ సినిమాకు తొలివారంలో 10-12వేలు.. రెండో వారంలో 8 వేలు.. మూడో వారం 6 వేల రూపాయలను వసూలు చేశారు. ఇప్పుడు అన్న సమయం ముగిసినా కూడా చార్జీలు వసూలు చేయడం మానలేదు. వీరికి మన సినిమా సభ్యుల్లో కొంత మంది నుండి మద్దతు కూడా లభించింది. దీని వల్ల చిన్న నిర్మాతలు ఎంతో నష్టపోతున్నారు. ఈ నిరసనలో దాదాపు రెండు లక్షల మంది మాకు సపోర్ట్ చేస్తున్నారు. త్వరలోనే ఈ సమస్య సమసిపోతుందని భావిస్తున్నాం' అని తెలిపారు.


మల్కాపురం శివ

ఈ పోరాటం గొప్పది : ఆర్ నారాయణమూర్తి

డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్ల తీరుకు వ్యతిరేకంగా దక్షిణాది సినిమా పరిశ్రమ చేస్తోన్న పోరాటం చాలా గొప్పదని ఆర్.నారాయణమూర్తి అన్నారు. చాలాసార్లు వారితో మన పరిశ్రమల పెద్దలు చేసిన చర్చలు విఫలమయ్యాయని, సినిమా పరిశ్రమలు ఎంత దోపిడీకి గురవుతున్నాయో దానికి వ్యతిరేకంగా చేస్తోన్న పోరాటమిదని ఆయన చెప్పారు. డీఎస్‌పీ సంస్థలు ఒప్పందం ప్రకారం నడవకపోగా అద్దెలు పెంచుకుంటూ పోతున్నాయని తెలిపారు. హాలీవుడ్, బాలీవుడ్ పరిశ్రమల్లో లేని అద్దెల విధానం మన రీజనల్ సినిమాపైనే ఎందుకు అని ప్రశ్నించారు. ఈ ఉద్యమానికి ప్రజలు సహకరించాలని నారాయణమూర్తి కోరారు.

ఏ నిమిషానికి ఏమి జరుగునో!

నాగ అన్వేష్ హీరోగా కొత్త చిత్రం ' ఏ నిమిషానికి ఏమి జరుగునో' షూటింగ్ ప్రారంభమైంది. గణేష్ క్రియేషన్స్ పతాకంపై తెరకెక్కుతోంది. ఈ సినిమా పూజా కార్యక్రమాలు శనివారం హైదరాబాద్‌లో జరిగాయి. వినాయక్ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. షో టైమ్ స్టూడియోస్ సమర్పిస్తున్న చిత్రమిది. కథానాయిక ఎవరు? అన్నది ఇంకా ఫైనల్ కాలేదు. లండన్ గణేశ్, సీహెచ్‌వీ నాగేశ్వరరావు నిర్మిస్తున్నారు. కృష్ణ గొర్లె దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాకు భాస్కర్ సామల కెమెరాను నిర్వహిస్తున్నారు.

లండన్ గణేష్ మాట్లాడుతూ 'నాగ అన్వేష్‌ని చూస్తే బాలీవుడ్ హీరోని చూసినట్టు అనిపిస్తాడు. నేను బ్రిటిష్ సిటిజన్‌ని. లండన్‌లో ఉంటాను. అందుకే లండన్ గణేష్ అని పేరు పెట్టుకున్నాను. లండన్ అనేది నా ఇంటి పేరు కాదు. డిసెంబర్‌లో ఈ టీమ్‌ని కలిశాను. ఇప్పుడు ప్రారంభోత్సవం చేశాం. మా దర్శకుడికి సినిమాలు తప్ప ఇంకేమీ తెలియదు. డిఫరెంట్ సైఫై చిత్రమిది' అని చెప్పారు. దర్శకుడు మాట్లాడుతూ 'సైన్స్ ఫిక్షన్ చిత్రమిది. మూడు షెడ్యూళ్లలో చేస్తాం. ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. మూడు పాటలుంటాయి. వచ్చే నెల నుంచి సినిమాను మొదలుపెడతాం. 'పుష్పక విమానం', 'ఆదిత్య 369' చిత్రాల తరహాలో ఉంటుంది' అని తెలిపారు.


సీహెచ్‌వీ నాగేశ్వరరావు, లండన్ గణేశ్, నాగ అన్వేష్, కృష్ణ గొర్లె



కళ్లకు అద్దాలు.. మెడలో రకరకాల చైన్లు.. లాకెట్లు.. ఇలా ఎప్పటి ట్రెండ్ అప్పుడే..! ఒకప్పుడు మణికట్టుకి వాచ్ ధరిస్తేనే ఫ్యాషన్. ఇప్పుడు చేతి మణికట్టుకీ ఓ ట్రెండ్ వచ్చేసింది. మణికట్టు మెరిసేలా రకరకాల బ్యాండ్లు, బ్రేస్‌లెట్లు, వాచీలు, రకరకాల గ్యాడ్జెట్లు.. ఇలా ప్రతిదీ ఫ్యాషన్ ట్రెండే.. చిన్నచిన్న చిల్లరకొట్ల నుంచీ పెద్దపెద్ద షాపింగ్ మాల్స్ వరకూ యూత్‌ని ఆకర్షిస్తున్న ఈ బ్యాండ్లూ, బ్రాండ్‌లూ కొత్తకొత్తగా క్రేజ్ అయ్యాయి. యువతీ యువకులకు ప్రత్యేకంగా వివిధ మోడల్స్ అందుబాటులోకొస్తున్నాయి. ప్రస్తుతం యువత ఇదే ట్రెండ్ ఫాలో అవుతోంది. చేతి అందాన్ని ఇనుమడింపజేస్తున్న ఈ తాజా ట్రెండ్ విశేషాలేంటో చూద్దాం..



మణికట్టు మెరిసే స్టైల్



ఇప్పుడు యువతరం అంతా స్మార్ట్‌గా ఉంటున్నారు. స్మార్ట్‌గా ఉన్న వస్తువుల్నే కోరుకుంటున్నారు. నఖశిఖ పర్యంతమూ స్మార్ట్‌గా తయారవుతున్నారు. అందులో బహిర్గతంగా ఉండే చేతి మణికట్టును ఆకర్షణీయంగా మార్చుకోవాలని ఆశపడుతున్నారు. అందుకే రకరకాల కంపెనీలు యువతను ఆకట్టుకునేందుకు ప్రతిదీ స్మార్ట్ టెక్నాలజీతో తయారుచేస్తున్నాయి.

స్మార్ట్ బ్రేస్‌లెట్

స్మార్ టెక్నాలజీతో వచ్చిన ఈ స్మార్ట్ బ్రేస్‌లెట్. డిడో, షియామీ, ఎంఐ తదితర కంపెనీలతోపాటు అనేక చైనా మోడళ్లు మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి. ఇందులో కాల్ ఫీచర్‌తోపాటు, ఫిట్‌నెస్ ట్రాకర్, హార్ట్‌రేట్ మోనిటర్, బిపి ట్రాకర్ వంటి యాప్స్ ఉంటాయి. వీటితో అందానికి అందం, ఆరోగ్యానికి ఆరోగ్యం. అందుకే యువత వీటికి ఎక్కువ ప్రాధాన్యతను ఇస్తోంది. ఇవి స్మార్ట్‌గా ఒదిగిపోయి వాచీలా మాత్రమే కాకుండా మరిన్ని స్మార్ట్ సేవల్ని అందిస్తూ స్పోర్టివ్ లుక్‌తో ముందుకొస్తున్నాయి యాపిల్ వాచీల్లాంటి ఖరీదైనవే కాదు, బడ్జెట్‌లో ఉన్నవీ చాలానే ఉన్నాయి. ఈ మధ్యే షామీ కంపెనీ 'మి బ్యాండ్'కి అప్‌డేట్ వెర్షన్‌ని 'మి బ్యాండ్ హెచ్‌ఆర్ఎక్స్' పేరుతో మార్కెట్‌లోకి తెచ్చింది. ప్రముఖ బాలీవుడ్ హీరో హృతిక్ రోషన్ ఈ బ్యాండ్‌కి ప్రచారకర్తగా వ్యవహరిస్తున్నారు. ఇది కేవలం ఫిట్‌నెస్ బ్యాండ్ మాత్రమే కాదు. స్మార్ట్‌వాచ్‌గా టైమ్‌నీ చూపిస్తుంది. మీ ఫోన్‌కి వచ్చే కాల్స్, మెసేజ్ అలెర్ట్స్‌ను వాచీలోనే చూసుకునే సదుపాయమూ ఇందులో ఉంది.





రిస్ట్‌వాచ్‌లు

ఒకప్పుడు హెచ్‌ఎంటి, టైటాన్ వాచీలను వాడటం గొప్పగా అనుకునేవారు. అప్పట్లో యువతకైనా, వయసు పైబడ్డవారికైనా అదో ట్రెండ్. ఇప్పుడు వాటి స్థానంలో ఫాస్ట్‌ట్రాక్, క్యాసియో, టైమ్‌వెల్, సొనాటా వంటి బ్రాండ్లూ, వీటితోపాటు రోలెక్స్ వంటి ఖరీదైన బ్రాండ్లూ అందుబాటులో ఉన్నాయి. వీటిల్లో యువత ఎక్కువగా ఫాస్ట్‌ట్రాక్ వైపు మొగ్గుచూపుతోంది. దీంతోపాటు క్రిస్టల్‌ఫేస్ అనే కొత్తరకం మార్కెట్‌లో వచ్చిన దగ్గర నుంచీ అదో కొత్త ట్రెండ్‌గా మారిపోయింది. ఇది వాచ్‌లో కొత్తరకం ఫార్ములా. అందుకే వాచీల్లో ఇదే ప్రత్యేక ఆకర్షణ అయ్యింది. క్రిస్టల్, వాచ్‌ఫేస్, బాడీ అని రకరకాలుగా దీన్ని పిలుస్తారు. ఇందులో ముఖ్యంగా వాటర్‌ప్రూఫ్‌కు ప్రాధాన్యం ఇస్తున్నారు నేటి యువత. ఎందుకంటే గీతలు, మరకలు పడని గ్లాస్‌తో క్రిస్టల్ తయారవుతోంది గనుక రఫ్ అండ్ టఫ్‌గా వాడుకోవచ్చు కదా! స్పోర్ట్స్‌వాచ్‌లో ఎక్కువగా ఈ ఫీచర్లు అందుబాటులో ఉంటాయి. ఆల్టీమీటర్, కంపాస్‌లు కలిగిన ఈ మోడల్స్ అందుబాటు ధరల్లోనే మార్కెట్లో లభిస్తున్నాయి.

ఇష్టమైన మోడల్స్

వెండి రంగు వాచీలు ఫార్మల్ లుక్ కోసం వాడేవాళ్లు ఎక్కువ. అయితే ఇవి ఎక్కువగా బ్లాక్, గ్రే, సిల్వర్, బ్లూ రంగుల దుస్తులపైనే ఎక్కువగా ధరిస్తున్నారని ఒక సర్వే తెలిపింది. బంగారు వర్ణం వాచీలు కాస్త రిచ్‌లుక్ ఇస్తాయనే అభిప్రాయంతో కొందరు వాడుతున్నారు. అంతేకాకుండా దీన్ని అన్నిరకాల పార్టీలు, వేడుకలు, పండగలకు ధరించవచ్చు. ఈ మధ్య టీనేజ్ పిల్లలు డిజిటల్ వాచ్‌లను బాగా ఇష్టపడుతున్నారు. ఎందుకంటే క్యాజువల్ లుక్‌ను ఇష్టపడే వీళ్లు డిజిటల్ వాచీలనే ఆశ్రయిస్తున్నారు. ఫ్రెండ్స్‌ను కలవాల్సినప్పుడు, సరదా పార్టీలకు, కాలేజ్ ఫంక్షన్లకూ, పర్యటనలకూ వీటిని ఎంచుకుంటున్నారు.





అయితే ఒక్కొక్కరి చేతికి ఒక్కో మోడల్, కలర్ వాచ్‌లు బాగుంటాయి. అందుకే వాచ్‌ని దుకాణానికి వెళ్లి మనకు ఏది నప్పుతుందో సరిచూసుకొని కొనుగోలు చేయడం ఉత్తమం.

రిస్ట్ బ్యాండ్స్

వీటిలో వివిధ రకాలు అందుబాటులో ఉన్నాయి. సిలికాన్ బ్యాండ్స్, వినైల్ బ్యాండ్స్, టైవెక్ బ్యాండ్స్ అంటూ అనేకరకాల మోడళ్లు యువతను ఆకట్టుకుంటున్నాయి. ఇవి ఎరుపు, పసుపు, ఆకుపచ్చ, నీలం, సియాన్ ఇలా ఎన్నో రంగుల్లో లభ్యమవుతున్నాయి. వీటిల్లో కొన్ని ఫ్రెండ్‌షిప్ బ్యాండ్లుగానూ వాడుతున్నారు. అందుకే ఈ మోడల్స్‌లో అదనపు సౌకర్యాలు లేకపోయినా యువత వీటికి అధిక ప్రాధాన్యత ఇస్తుంది. రిస్ట్‌కు సౌకర్యంగా ఉంటూ, ఆకర్షించే అందంతో ఉంటున్నాయి కాబట్టే ఇవీ యూత్ ట్రెండ్‌గా మారాయి.

బ్రేస్‌లెట్స్

సాధారణంగా బ్రేస్‌లెట్స్ అంటే మనకు గుర్తుకొచ్చేవి ప్లాటినం, గోల్డ్, సిల్వర్ వేరియంట్స్. ఇవి అందరికీ అందుబాటులో ఉండవు కాబట్టి.. మార్కెట్‌లో రకరకాల మెటల్ బ్రేస్‌లెట్స్ రకరకాల డిజైన్లలో అందుబాటులో ఉన్నాయి. చైన్‌మోడల్, చైన్‌మోడల్ విత్ పెండెంట్, రకరకాల డిజైన్లలో కాపర్, మెటల్ వేరియంట్లలో అందుబాటులో ఉన్నాయి. వీటిలో యువత ఎక్కువగా కాపర్, మెటల్ వేరియంట్స్‌ను వాడటం ఓ ట్రెండ్‌గా నడుస్తోంది. కాపర్ శరీరంలో వేడిని గ్రహిస్తుంది కనుక ఆరోగ్యపరంగానూ వీటి వాడకం అధికమనే చెప్పాలి. ★

మేధా మాస్టర్



అమ్మాయిల కోసం ఎన్నో రకరకాల సేఫ్టీయాప్స్ పుట్టుకొస్తున్నాయి. చాలా టెస్టులు పాసై మహిళా భద్రత కోసం ఎన్ని యాప్స్ వచ్చినా ఇంకా ఎన్నో లోపలు ఉంటూనే ఉన్నాయి. కానీ ఈ పదహారేళ్ళ అమ్మాయి తను అభద్రతకు లోనై తాను ఎదుర్కొన్న సమస్యను పరిష్కరించాలనుకుంది. కేవలం 40 గంటల్లోనే 'సేఫ్ ట్రావెల్' అనే యాప్‌ను అన్నివిధాలైన టెస్టింగులూ చేసి, కాంపిటిషన్‌లోనే మొదటి స్థానాన్ని కైవశం చేసుకుంది.

ప్రతి ఏటా నిర్వహించే యాన్యువల్ కాంగ్రేషనల్ యాప్ చాలెంజ్‌లో 'సేఫ్ ట్రావెల్' అనే యాప్‌ను కేవలం నలభై గంటల్లోనే డిజైనింగ్, టెస్టింగ్, ట్రబుల్ షూటింగ్ చెక్ చేసుకుని సబ్మిట్ చేసి, ఈ ఘనత సాధించింది భారత సంతతికి చెందిన 16 ఏళ్ళ అమ్మాయి మేధా గుప్తా.

భయంతో యాప్

హెర్డన్‌లోని తన ఇంటి నుండి వర్జీనియాకు 20 నిమిషాల నడక. ఆ ప్రాంతం చాలా నిర్మానుషంగా, భయానకంగా ఉంటుంది. అప్పుడే ఆమెకి ఈ యాప్ తయారుచేయాలనే ఆలోచన తట్టింది. చేరాల్సిన గమ్యానికి సరైన సమయంలోగా చేరుకోకపోతే ఫోన్‌లో ఉండే ఈ యాప్‌లో మనం ఎవరినైతే నమ్మకస్తులుగా యాడ్ చేస్తామో వారికి వెంటనే ఎస్ఓఎస్ లేదా మెసేజ్ రూపంలో ఎలర్ట్ వెళ్ళిపోతుంది. ప్రస్తుతం ఈ యాప్ కేవలం ఐఫోన్ యూజర్లకు మాత్రమే అందుబాటులో ఉంది. త్వరలో ఆండ్రాయిడ్‌కీ చేరుకునే అవకాశం ఉంది. నిజానికి మేధా ఈ ఛాలెంజ్‌ను గెలవటానికి ఈ యాప్‌ను తయారు చేయలేదు. కేవలం తను ఎదుర్కొన్న సమస్యకు పరిష్కారంగా ఈ యాప్‌ను తయారు చేసింది. గతంలో ఎన్నో 'హాకథాన్' కాంటెస్టుల్లో పాల్గొన్న అనుభవం మేధాకు ఉంది. చాలా ప్రోగ్రామింగ్ లాంగ్వేజీల్లో ఆమెకు పట్టుంది. 'నేను స్మార్ట్‌ఫోన్లో చాలా సమయం కేటాయించేదాన్ని. దాంతో అందులోని యాప్‌లు ఎలా రన్ అవుతాయో తెలుసుకోవాలన్న కుతూహలం కలిగింది. అందుకోసం చాలా ప్రోగ్రాములు నేర్చుకున్నాను' అంటుంది మేధా. ఈ యాప్ డెవలప్‌మెంట్‌లో తల్లి దివ్యగుప్తా కూడా సహకరించింది.



ప్రత్యామ్నాయ వేదిక

ఈ కాంటెస్ట్‌లో విజేతగా నిలిచిన విద్యార్థులను కాపిటల్ హిల్‌లోని ఒక రిసెప్షన్‌కు ఆహ్వానించి, అమెజాన్ వెబ్ సర్వీసెస్ క్రెడిట్స్ ద్వారా 250 డాలర్లు అందజేస్తారు. వాస్తవానికి ఈ కాంటెస్ట్ ఉద్దేశం భవిష్యత్తులో ఆ దేశంలో ఉద్యోగాల అవకాశం పెంచడానికి. దానికి యువత యాప్‌లు తయారుచేయాలి. దాదాపు 4,100 మంది విద్యార్థులు 1,300 యాప్స్‌ను ఈ పోటీల్లో సమర్పించారు. ప్రతి కాంటెస్ట్‌లో కేవలం ఒక్కరిని మాత్రమే విజేతగా ప్రకటిస్తారు. యువతలో సృజనాత్మకతనూ, వారిలో ఉండే ప్రతిభను చూపడానికి ఇది ఒక ప్రత్యామ్నాయ వేదిక. ఈ నైపుణ్యాలను బయటకు తీసుకురావటంలోనే ఈ కాంటెస్ట్ గొప్పతనం ఉంది. కోడింగ్, కంప్యూటర్ సైన్స్ ద్వారా విద్యార్థులను సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథ్స్ రంగాలలో ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతోనే ఈ కాంటెస్ట్‌ను నిర్వహిస్తున్నారు. ఈ ఛాలెంజ్ 2017 వరకూ కేవలం హైస్కూల్ విద్యార్థులకు మాత్రమే పరిమితం. ఇప్పుడు ఎల్‌కేజీ నుండి 12వ గ్రేడ్ వరకూ చదివే విద్యార్థులందరూ అర్హులే. ★



చిన్నారి

జోక్ :

తండ్రి : ఏరా చింటూ! మీ టీచర్ నన్ను ఒకసారి స్కూల్‌కి రమ్మన్నారు. ఏం వెధవ పని చేశావేంటి ?

చింటు : హోంవర్కులో తప్పులు చేస్తే పిలవరా మరి!

నేనెవరిని?

వానలో పనికొస్తాను
ఎండకు ఉపయోగపడతాను
అవసరం లేదంటేనే
ముడుచుకు పోతాను?

జవాబు : గొడుగు

నీడ కనిపెట్టండి!



పిల్లలూ..! పక్కనున్న చిత్రంలోకొన్ని జంతువులు, వాటి నీడలు ఉన్నాయి. అందులో దేని నీడ ఏదో కనిపెట్టండి !

సబ్జాతో చల్ల..చల్లగా!



ఇప్పుడే ఎండలకు తట్టుకోలేకపోతున్నాం కదా! ఇక వేసవిలో అయితే చెప్పనక్కర్లేదు. అంత ఎండలను ఎలా తట్టుకోవాలా అని ఆలోచిస్తున్నారా? వేసవిలో ఎండలకు వేడెక్కిన శరీరాలను సబ్జా గింజలు చల్లబరుస్తాయి. నిజానికి వీటిని మించిన ఔషధం లేదు. ఒకవేళ మనం తప్పనిసరి పరిస్థితులలో ఎండలో తిరగాల్సి వచ్చినా ఈ గింజలు కలిపిన నీరు అలసటన్నదే రానివ్వదు. శరీరంలోని వేడినంతటినీ హరించే శక్తి సబ్జాగింజల్లో ఉంటుంది. వీటిని లస్సీ, షర్బత్ లాంటి వాటిల్లో కలుపుతుంటారు. చూడ్డానికి అచ్చం తులసి గింజల్లానే ఉంటాయి. ఇవి తులసి జాతికి చెందిన రుద్రజడ మొక్క నుంచి ఉత్పన్నమవుతాయి. ఆ మొక్కలనే విబూది తులసి అనీ అంటారు. తులసి గింజల్ని బాసిల్ గింజలన్నట్టే.. వీటిని స్వీట్ బాసిల్ అంటారు. మన దేశంలోనే కాదు ఆసియాలోని ఉష్ణమండల ప్రాంతాలన్నింటా వీటిని సాగుచేస్తారు. ఈ గింజలకు ఎలాంటి రుచీ ఉండదు. అందువల్లే ఏ పానీయంలో కలిపినా దాని రుచి మారదు. పైగా నీటిలో నానబెడితే ఉబ్బి 30 రెట్లు పెద్దవవుతాయి. అలా నానిన వాటినే ఎందులోనన్నా కలుపుకుని తాగాలి. దానివల్ల ఫైటో కెమికల్స్, విసినిన్, ఓరియంటిన్ వంటి ఫ్లేవనాయిడ్లు, కార్బోహైడ్రేట్లు, విటమిన్–కె, కొవ్వు, పీచు పదార్థాలు, ప్రోటీన్లు మన శరీరానికి లభ్యమవుతాయి. వీటన్నింటివల్ల అధికబరువు, ఊబకాయం తగ్గుతుంది. ఇదీ అసలు విషయం. ఎండలలో వీటిని సేవించి, ఎండబారిన పడకుండా ఆరోగ్యాన్ని కాపాడుకుంటారు కదా! ★





నేను గీసిన బొమ్మ





ఎమ్. లక్ష్మీ శరణ్య
5వ తరగతి
నారాయణ ఇ టెక్నో స్కూల్
విజయవాడ

పిల్లల్లారా.. రారండి!!

కథలు, కవితలు, మీరు గీసిన బొమ్మలు, చూసిన ప్రదేశాలు, కనిపెట్టిన సైన్సు సంగతుల గురించి రాసి మీపేరు, ఫొటోతో పంపవలసిన మాచిరునామా

చిన్నారి, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.
ఇ మెయిల్ - jeevanapageps@gmail.com



భారత గ్రాండ్ మాస్టర్ పెండ్యాల హరికృష్ణ, సెర్బియాకు చెందిన మాజీ చెస్ ఛాంపియన్ నడ్జాల వివాహం హైదరాబాద్‌లోని నోవాటెల్ హోటల్‌లో శనివారం ఘనంగా జరిగింది. గుంటూరు జిల్లాకు చెందిన హరికృష్ణ అతిపిన్న వయసులోనే గ్రాండ్‌మాస్టర్ హోదా సాధించిన భారతీయుడిగా రికార్డ్ సృష్టించాడు.

సుల్తాన్ అజ్లాన్‌షా టోర్నీ ఉత్కంఠపోరులో భారత్ ఓటమి



అర్జెంటీనా చేతిలో 2-3 గోల్స్‌తో భారత్ పరాజయం

నేడు ఇంగ్లండ్‌తో పోరు

ఇఫో (మలేసియా) : సుల్తాన్ అజ్లాన్‌షా హాకీ టోర్నీ తొలి పోరులో భారత హాకీజట్టు పరాజయం పాలైంది. శనివారం ప్రపంచ నెంబర్-2, బలమైన అర్జంటీనాతో తలపడిన సర్దార్ సింగ్ నేతృత్వంలోని భారత జట్టు చివరికంటా పోరాడి 2-3 గోల్స్ తేడాతో ఓటమి చవిచూసింది. అర్జంటీనా జట్టును పెనాల్టీ కార్నర్ స్పెషలిస్ట్ గొంజాలో పిలాట్ మూడు గోల్స్ చేసి ఆ జట్టును గెలిపించాడు. వర్షం మరియు ప్రకృతి సహకరించని ఈ పోరులో చివరివరకూ గెలుపుకై భారతజట్టు అర్జంటీనాను నిలవరించడం గమనార్హం. అర్జెంటీనాలో గొంజాలో పిలాట్ 3, భారత్ తరపున అమిత్ రోహిదాస్ 2 గోల్స్ పెనాల్టీ కార్నర్స్ ద్వారా సాధించడం విశేషం. అనుభవజ్ఞులు లేని యువ జట్టును సర్దార్ సింగ్ బాగానే నడిపించాడు. హోరాహోరీగా ప్రారంభమైన మ్యాచ్‌లో తొలి క్వార్టర్ చివర్లో అర్జెంటీనాకు పెనాల్టీ కార్నర్ లభించింది. 13వ నిమిషంలో గొంజాలో గోల్ చేసి అర్జంటీనాను 1-0 ఆధిక్యంలో నిలిపాడు. 24వ నిమిషంలో లభించిన మరో పెనాల్టీ కార్నర్‌నూ గొంజాలో సద్వినియోగం చేసుకొని అర్జెంటీనా 2-0 ఆధిక్యతలోకి దూసుకెళ్లింది. ఈ క్రమంలో భారత్‌కు 26వ నిమిషంలో పెనాల్టీ కార్నర్ లభించింది. కుర్రాడు అమిత్ రోహిదాస్ మాస్టర్‌ఫుల్ స్ట్రోక్‌తో స్కోరును 1-2కు తగ్గించాడు. 28వ నిమిషంలో అర్జెంటీనాకు లభించిన పెనాల్టీ కార్నర్‌ను భారత్ చక్కగా అడ్డుకుంది. అర్ధభాగం ముగిసే సరికి భారత్ 1-2తో నిలిచింది. రెండో అర్ధభాగం ప్రారంభం కాగానే 31వ నిమిషంలో భారత్‌కు రెండో పెనాల్టీ కార్నర్ లభించింది. అమిత్ రోహిదాసే మళ్లీ గోల్ చేసి స్కోరు 2-2తో సమం చేశాడు. అయితే ఆ ఆనందం ఎక్కువ సేపు మిగల్లేదు. 33వ నిమిషంలోనే గొంజాలో మంచి స్ట్రోక్‌తో మూడో గోల్ చేసి అర్జెంటీనాను 3-2తో ఆధిక్యంలో నిలిపాడు. ఆ తర్వాత ప్రత్యర్థి జట్టుకు పీసీ లభించినా భారత్ అడ్డుకుంది. మరో 11 నిమిషాల్లో మ్యాచ్ ముగుస్తుందనగా భారీ వర్షం రావడంతో కాసేపు ఆట నిలిపివేశారు. వర్షం కాస్త తగ్గడంతో మళ్లీ ఆడారు. అయినప్పటికీ భారత్‌కు చివరి పది నిమిషాల్లో ఎలాంటి అవకాశాలు దక్కలేదు. ఇరుజట్లు సాధించిన గోల్స్ అన్నీ పెనాల్టీ కార్నర్స్ రూపంలోనే వచ్చినవి కావడం గమనార్హం. ఇతర మ్యాచ్‌లలో ఆస్ట్రేలియా 4-1 గోల్స్ తేడాతో ఇంగ్లండ్‌ను, మలేషియాజట్టు ఐర్లాండ్‌ను 4-1 తేడాతో విజయాలను నమోదు చేసుకున్నాయి.

వెంకటేశ్ ప్రసాద్ స్థానంలో ఆశీష్ కపూర్



ముంబయి : భారత జూనియర్ (అండర్-19) నేషనల్ సెలెక్షన్స్ చీఫ్ పదవికి తమిళనాడుకు చెందిన ఆశీష్ కపూర్‌ను భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) శనివారం నియమించింది. శుక్రవారం ఆ పదవికి టీమిండియా మాజీ పేస్ బౌలర్ వెంకటేశ్ ప్రసాద్ రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. అతని రాజీనామాను శనివారం బీసీసీఐ ఆమోదించింది. అతని స్థానంలో తమిళనాడుకు చెందిన మాజీ ఆఫ్‌స్పిన్నర్ ఆశీష్ కపూర్‌కు ఆ బాధ్యతలు అప్పగించింది. ఆశీష్ కపూర్ 1994-2000లో భారతజట్టు తరపున 4 టెస్టులు, 17 వన్డేలలో పాల్గొన్నాడు. 1996 ప్రపంచకప్‌కు పాల్గొన్న జట్టులో సభ్యుడైనప్పటికీ చివర్లో జట్టునుండి తప్పించారు. రంజీట్రోఫీల్లో తమిళనాడు, పంజాబ్, రాజస్థాన్‌ల తరపున రంజీట్రోఫీల్లో పాల్గొన్నాడు. 1999-2000 ఏడాదిలో తమిళనాడు తరపున అత్యధిక వికెట్లు పడగొట్టిన ఆటగాడిగా కూడా నిలిచాడు. ప్రస్తుతం ఢిల్లీ డేర్ డెవిల్స్ జట్టు మేనేజర్‌గా వ్యవహరిస్తున్నాడు.

కుస్తీలో మరో రెండు...

బిష్కెక్ (కిర్గిజ్‌స్తాన్) : ఆసియా కుస్తీ ఛాంపియన్‌షిప్‌లో భారత్‌కు మరో రెండు కాంస్య పతకాలు లభించాయి. శనివారం జరిగిన కుస్తీ పోటీల్లో భారత్‌కు చెందిన భజరంగ్ పూనియా (65 కిలోలు), వినోద్ కుమార్ ఓంప్రకాష్ (70 కిలోల) విభాగంలో కాంస్య పతకాలను సాధించారు. దీంతో రెజ్లింగ్ విభాగంలో భారతజట్టు ఒక బంగారు, ఒక రజిత, 6 కాంస్య పతకాలతో మొత్తం 8 పతకాలను గెలుపొందింది.

ఇంగ్లండ్‌కు మరో విజయం

కివీస్‌పై 4 పరుగుల తేడాతో విజయం



వెల్లింగ్టన్ : ఐదు వన్డేల సిరీస్‌లో భాగంగా న్యూజిలాండ్‌తో జరిగిన మూడో వన్డేలో ఇంగ్లండ్ నాలుగు పరుగుల తేడాతో ఉత్కంఠ విజయం నమోదు చేసుకుంది. టాస్ ఓడి తొలిగా బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ జట్టు 50 ఓవర్లలో 234 పరుగులకు ఆలౌట్ అయ్యింది. ఆ జట్టు సారథి మోర్గాన్ (48), బెన్ స్టోక్స్ 39 పరుగులు చేశారు. సోధికి 3, బోల్ట్‌కు 2 వికెట్లు లభించాయి. అనంతరం లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో కివీస్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్లు నష్టానికి 230 పరుగులు మాత్రమే చేసి 4 పరుగుల తేడాతో పరాజయం పాలైంది. తద్వారా ఇంగ్లండ్ జట్టు వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసుకొని సిరీస్‌లో 2-1 ఆధిక్యతలో నిలిచింది. ఈ మ్యాచ్‌లో న్యూజిలాండ్ కడవరకూ పోరాటం చేసినా ఫలితం దక్కలేదు. ప్రధానంగా న్యూజిలాండ్ కెప్టెన్ కేన్ విలియమ్సన్ అజేయ శతకంతో ఒంటరి పోరాటం చేసినా జట్టును గెలిపించలేకపోయాడు. విలియమ్సన్ 143 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సర్లతో 112 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. అయితే అతనికి మరోవైపు తగినంత సహకారం లభించలేదు. మిగతా న్యూజిలాండ్ ఆటగాళ్లలో కోలిన్ మున్రో(49), సాంత్నార్ (41)లు ఆకట్టుకున్నా జట్టును గెలిపించడంలో విఫలమయ్యారు. న్యూజిలాండ్ 50 ఓవర్లలో ఎనిమిది వికెట్లు కోల్పోయి 230 పరుగులకే పరిమితమైంది. ఇంగ్లండ్ బౌలర్లలో వోక్స్, రషీద్ తలో రెండు వికెట్లు సాధించగా, మొయిన్ అలీ మూడు వికెట్లతో మెరిశాడు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ మొయిన్ ఆలీకి లభించింది.

ఆసీస్‌కు భారీ ఆధిక్యత

రెండో ఇన్నింగ్స్ : 213/9

దర్బన్ : దక్షిణాఫ్రికా-ఆస్ట్రేలియా జట్ల మధ్య జరుగుతున్న మొదటి టెస్ట్‌మ్యాచ్‌లో ఆసీస్ పట్టు బిగించింది. తొలి ఇన్నింగ్స్ 189 పరుగుల ఆధిక్యతతో రెండో ఇన్నింగ్స్ మూడోరోజు ఆటను ప్రారంభించిన కంగారు జట్టు 9 వికెట్ల నష్టానికి 213 పరుగులు చేసింది. మరో వికెట్ చేతిలో ఉండగా మొత్తం 402 పరుగుల ఆధిక్యత లభించినట్లైంది. ఆసీస్ రెండో ఇన్నింగ్స్‌లో ఓపెనర్ బ్యాంక్రాఫ్ట్ అత్యధికంగా 53 పరుగులు చేశాడు. ఆ జట్టు సారథి స్టీవ్ స్మిత్ 38 పరుగులు మాత్రమే చేసి మరోసారి నిరాశపరిచాడు. మోర్కెల్, మహరాజ్‌లకు మూడేసి వికెట్లు, రబాడకు రెండు వికెట్లు లభించాయి. ఏదైనా సంచలనం జరిగితే తప్ప ఈ మైదానంలో 400 పరుగులు ఛేధించడం సఫారీ జట్టుకు కష్టమే.

నేటినుంచి ప్రపంచకప్ అర్హత మ్యాచ్‌లు

హరారే : ఆదివారం నుండి జింబాబ్వేలో ప్రపంచకప్ అర్హత మ్యాచ్‌లు జరగనున్నాయి. మార్చి 4 నుండి 17వ తేదీ వరకు జరిగే ఈ పోటీలలో అగ్రస్థానంలో నిలిచిన రెండుజట్లు ఐసీసీ ప్రపంచకప్ క్రికెట్‌కు నేరుగా అర్హత సాధిస్తాయి. మొత్తం 10 జట్లు రెండు గ్రూపులుగా విడిపోయి తమ గ్రూప్‌లోని ఇతర జట్లతో ఒక్కోసారి పోటీపడనున్నాయి. గ్రూప్-ఎలో వెస్టిండీస్, ఐర్లాండ్, నెదర్లాండ్, పప్పున్యూగేనియా, యు.ఎ.ఇ.జట్లు ఉండగా... గ్రూప్-బిలో ఆతిథ్య జింబాబ్వేతోపాటు ఆఫ్ఘనిస్తాన్, హాంకాంగ్, నేపాల్, స్కాట్లాండ్‌లు ఉన్నాయి. నేడు జరిగే తొలిమ్యాచ్‌లలో పప్పున్యూగేనియా-యుఎఇ, ఐర్లాండ్-నెదర్లాండ్, జింబాబ్వే-నేపాల్, ఆఫ్ఘనిస్తాన్-స్కాట్లాండ్ జట్ల మధ్య పోటీలు జరగనున్నాయి.



అండర్-25 దక్షిణ భారత అంతర్‌రాష్ట్ర క్రికెట్ టోర్నీ ఛాంపియన్‌గా నిలిచిన ఆంధ్రా జట్టు

అండర్-25లో ఆంధ్రాకే అగ్రస్థానం

ప్రజాశక్తి - కడప

కడపలో ఐదు రోజుల పాటూ నిర్వహించిన అండర్-25 దక్షిణ భారత అంతర్ రాష్ట్ర క్రికెట్ టోర్నీలో ఆంధ్రా జట్టు అగ్రస్థానాన్ని అధిరోహించింది. ఈ టోర్నమెంటులో గోవా, కర్నాటక, కేరళతో మూడు మ్యాచ్‌లు జరిగాయి. కర్నాటకతో జరిగిన మొదటి మ్యాచ్ టై కావడంతో 2 పాయింట్లు వచ్చాయి. గోవా, కేరళ జట్లతో తలపడిన రెండు మ్యాచుల్లోనూ విజయం సాధించి 8 పాయింట్లను సాధించి మొత్తం10 పాయింట్లతో ఆంధ్రా జట్టు ఛాంపియన్‌గా నిలిచింది. కర్నాటక జట్టు 10 పాయింట్లు లభించినా రన్‌రేట్‌లో ఆంధ్రా జట్టు ముందంజలో ఉండటంతో టోర్నీ విజేతగా నిలిచింది. కర్నాటక రెండో స్థానానికి పరిమితమైంది. 4 పాయింట్లు సాధించిన కేరళ మూడో స్థానంలో నిలిచింది. ఒక్క పాయింటూ సాధించని గోవా చివరి స్థానంలో నిలిచింది. ఛాంపియన్‌గా నిలిచిన ఆంధ్రా జట్టుకు, రన్నర్స్‌గా నిలిచిన కర్నాటక జట్టుకు ఎసిఎ ఉపాధ్యక్షులు ఎం.వి.శివారెడ్డి, జిల్లా అసోసియేషన్ ఉపాధ్యక్షులు మునగా వెంకటక్రిష్ణమూర్తి కప్, బహుమతులను అందజేశారు.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68